30-8Pg1exHMNWJQE:30-8Pg1exHMNWJQE.qxd 29/Aug/26 11:50 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 211 పేజీలు: 12 వెల: 8.00

ఉద్యోగం పోతే అమెరికాను వీడాల్సిందే 9లో
నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు

# పంచసూత్ర ప్రణాళిక

## గిరిజనుల అభివృద్ధికి

ప్రయోగాత్మకంగా సంజీవని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

పేదరికం లేని గిరిజన కుటుంబాలే లక్ష్యం

జిఒ నం.3కి ప్రత్యామ్నాయం త్వరలోనే..




శనివారం గన్నెల పంచాయితీ కేంద్రలో ఏర్పాటు చేసిన 'సంజీవని' పథకం ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పాడేరు/అరకులోయ, ఆగస్టు29,ప్రభాతవర్త:** అల్లూరి సీతా రామరాజు జిల్లాలోపవిత్రమైన సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని..మంచి ప్రదేశం..ఎంత ఆహ్లాదకరమైన ప్రదేశం అంటే కొత్త శక్తి...ఉత్సాహం వస్తుంది..ఇటు చూసినా పచ్చదనం..ఇటుచూసినా కొండలు..స్వచ్ఛమైన గాలి.. వాతా వరణం ఈ ప్రాంతం సొంతం..ఇటువంటి ప్రాంతంలో పవిత్రమైన సంజీవని ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వెల్లడించారు.అరకువ్యాలీ మండలం గన్నెల పంచాయితీ కేంద్రం గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' పథకం ప్రారంభోత్సవ సభ అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుయుడు గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల ప్రజలు పాపులేషన్ మేనేజ్మెంట్‌లో కూడా ముందున్నారనీ ఇది అభినందనీయమన్నాడు.. పిల్లలే మనసంపద అనే సిద్ధాంతాన్ని మన గిరిజన ప్రజలు ఆచరిస్తున్నారనీ ఇది గర్వకారణ మని సిఎం అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే మా ఆలోచన గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జిఓ నంబర్ 3 మేమే తీసుకువచ్చామణి సిఎం గుర్తు చేశారు. గత పాలకులు నిరక్ష్యంతో సుప్రీం కోర్టు దానిని రద్దు చేసిందన్నారు.ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తామని సిఎం చంద్ర బాబు హామీ ఇచ్చారు.

ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశామన్నాడు.అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశామన్నారు.1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకుకాఫీని మరో లక్షఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోమ్ స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామన్నాడు. వచ్చేమూడేళ్లలో లక్షమంది యువతకు నైపుణ్యశిక్షణ కల్పించాలన్నదే మా ఆలోచన అన్నారు. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో

>>2




శనివారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

## చెంచుల అభివృద్ధికి చర్యలు

### రూ. 8 లక్షల బ్యాంక్ రుణాల చెక్కును వారికి అందించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 ప్రభాతవార్త :** గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ కట్టుబడి ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో చెంచు తెగకు సంబంధించిన జిల్లా సంఘం ఉన్నతి సభ్యులకు సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజ్ రుణం 8లక్షల రూపాయల చెక్కును అందించారు. చెంచు వృత్తి చేసుకునేవారు వారి సాంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు, ఇతర అవసరాల కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం ఉన్నతి సంఘం సభ్యులకు 8 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణం చెక్కులు శనివారం అందజేశారు. వడ్డీ లేకుండా ఈ మొత్తం వస్తూ ఉండటంతో దీనిపై ఉన్నతి సంఘం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు కృషికి ధన్యవాదాలు తెలిపారు.

**కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష :**
శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ కంపెనీల సిఎస్ఆర్ నిధులతో చేపదు

>>2

## వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

### శిల్పారామం-పెదపలకలూరు వరకు 4.25 కి.మీ రహదారి నిర్మాణం : కేంద్రమంత్రి పెమ్మసాని



**విజయవాడ,ఆగస్టు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** శిల్పా రామం- పెద పలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 రహదారి అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభి వృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలిసి పనుల పురోగతిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ:.. శిల్పా రామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ -3 పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టును గతంలోనే ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ, వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్లను రిహాబిలిటేట్ చేసి, సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ పనులకు రూ.48 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చామని, పనుల్లో ఎదురవుతున్న సమస్యలను కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు. రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో హైట్ పెరగడంతో హైటెన్స్ వైర్‌ను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా సుమారు రూ. 2 నుంచి 3 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అదేవిధంగా ఎన్ఎస్‌పి కెనాల్ క్రాసింగ్స్ వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10 నుంచి రూ. 15 లక్షల అదనపు వ్యయం అవుతుందని తెలిపారు.భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రస్తుత ప్రాజెక్టులోనే వీలైనంత వరకు ఈ అదనపు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన**
ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్‌ను భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే వోవరుబ్రిడ్జిమీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని డా.పెమ్మసాని తెలిపారు. ఈ విస్త

>>2

## స్థానిక పోరుకు జనసేన సిద్ధం




### యువత, మహిళా సాధికారత పార్టీ ప్రధాన అంశాలు

### జనసైనికుల ఆత్మగౌరవం నిలబెట్టేలా ఎన్నికలు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నెల రోజులపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అనుసరించాల్సిన ప్రణాళికను పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పార్టీ పవన్ కల్యాణ్ సిద్ధం చేశారని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖమాత్యులు, జెస్పీ పిఎసి ఛైర్మన్‌నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీన్ని మనమంతా తు.చ. తప్పకుండా పాటించాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థలఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే నాయకులకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వనని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవాల కోసం చేయని ఆకృత్యం లేదన్నారు. వ్యవస్థలను, అధికారాన్ని అడ్డం పెట్టుకొని 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని టార్గెట్ చేశారని చెప్పారు. అప్పట్లో సిద్ధం చెప్పినవ్యక్తే... నేడు యుద్ధంఅంటున్నారని అన్నారు. జనసేనపార్టీ ఎప్పుడూ యుద్ధానికి సిద్ధమని తేల్చి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం శుక్రవారం మంగళగిరిలో జరిగింది. సమావేశంలో 2021లో జనసేన పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉన్నవారిని పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సమావేశం ప్రారంభంలోనే ఆత్మీయంగా మనోహర్ సన్మానించారు. 1000 మందికి సభావేదికపై సన్మానాలు చేశారు. అనంతరం జరిగినసమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అప్పట్లో పవన్ కల్యాణ్

>>2

## తెలుగులోనే ఇక ఉత్తర్వులు

### - సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న



**విజయవాడ,ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు భాషావేత్త, వ్యావహారిక భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా ఆగస్ట్ 29 న మనం నిర్వహించుకునే తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న తన పరిధిలోని ఆర్టీఐ అర్జీదారులకు, అధికారులకు, ప్రజలకు మరింత చేరువయ్యే కీలక నిర్ణయం తీసుకున్నారు. సమాచార హక్కు చట్టం అర్జీదారులకు, అధికారులకు సంబంధించిన ఆర్టిఐ కేసులపై తన పరిధిలో జారీ చేసే తీర్పుల ఉత్తర్వులను సామాన్య పౌరులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగులో అందించేందుకు నిర్ణయించారు.ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు, ఉత్తర్వులు వారికి అర్థం కాని భాషలో ఉంటే, తమ కేసులో అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ప్రజలకు సంబంధించిన ఉత్తర్వులు మన తెలుగు మాతృభాషలో అందుబాటులో ఉండటం ద్వారా న్యాయం, పారదర్శకత అర్జీదారులు, అధికారులు, ప్రజలకు మరింత చేరువవుతాయని గాజుల అదెన్న పేర్కొన్నారు. కమీషన్ ఇచ్చే తీర్పుల

>>2

## తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం



శనివారం విజయవాడలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

### వచ్చే నెల మొదటి వారంలో నంది నాటకోత్సవాలపై కీలక ప్రకటన

### ఘనంగా గిడుగు జయంతి, తెలుగుభాషా దినోత్సవాలు

### 19 మందికి తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

**విజయవాడ,.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, యేడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు తెలుగు భాషా పురస్కారాలు-2026 అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికతోపాటు రూ. 25,000 నగదు బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన

>>2



## తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

### ప్రోటోకాల్ పక్కనపెట్టి ఎయిర్‌పోర్టులో మోడీకి స్వాగతం పలికిన అధ్యక్షుడు

### అనంతరం ఒకే కారులో ఇరువురు అధినేతల ప్రయాణం

**తాష్కెంట్, ఆగస్టు 29:** ప్రధాని మోడీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు. అక్కడ ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని మోడీకి ఘన స్వాగతం పలికారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మోడీ ఈ పర్యటన చేపట్టారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం ప్రధాని మోడీ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన చూపించిన ప్రత్యేక ఆతిథ్యానికి కృతజ్ఞతలు. ఉజ్బెకిస్థాన్‌కు ఇది నా నాలుగో పర్యటన. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాల లోతు, వాటిలో పెరుగుతున్న వేగానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరపనున్నారు. ఇరు దేశాలమధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టి

>>2



## నేపాల్‌కు తొలగని ముప్పు!

### మరో రెండు హిమానీనదుల నుంచి వరదలు!

### 700 దాటిన మృతులు, 2500 మందికి పైగా ఆచూకీ గల్లంతు

**కఠ్మాండు, ఆగస్టు 29:** నేపాల్‌లో వరదల నుంచి కోలుకోక ముందే మరో షాకింగ్ విషయం వెలుగు వచ్చింది. ప్రమాదానికి కారణమైన భోటే కోషి త్రిశూలి నదీ వ్యవస్థ సమీపంలోనే మరో రెండు హిమానీనద సరస్సులు ఏర్పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధిపతి కృష్ణ వాట్సా తెలిపారు. అయితే వీటి నుంచి ఎంత మేర వరదనీరు బయటకు వచ్చే అవకాశం ఉందన్న దానిపై ప్రస్తుతం స్పష్టమైన అంచనాలు లేవని ఆయన వెల్లడించారు. ఒక సరస్సు 19.80 హెక్టార్లు, మరొకటి 7.28 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. సరస్సుల్లోని నీటి పరిమాణంపై ఇప్పటివరకు ఎలాంటి అంచనా లేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే అక్కడ హిమానీనదాలు కదులుతున్నప్పుడు పేరుకుపోయే రాళ్లు, మట్టి, ఇతర శిథిలాల కుప్పలు ఉన్నాయని కృష్ణ వాట్సా వెల్లడించారు. నేపాల్‌లో ఏర్పడిన ఈ సహజ సరస్సుల పరిస్థితిని భారత్ నేరుగా పరిశీలించే అవకాశం పరిమితంగా ఉండటంతో నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సహజంగా ఏర్పడే ఇలాంటి సరస్సులు భవిష్యత్తులో ఎలా మారతాయో పూర్తిగా అంచనా వేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సును నోయిడాకు చెందిన సుహోరా టెక్నాలజీస్ గుర్తించింది. ఆగస్టు 27న తీసిన అత్యంత

>>2

## ఎంబిబిఎస్, బిడిఎస్ ఫీజులు 10% పెంపు

**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వైద్య విద్యా కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వ ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులకు 10 శాతం, పిజి మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు.ఎంబిబిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ. 18,150, బి కేటగిరి (మేనేజిమెంట్ కోటా) రూ.14.52 లక్షలు, సికేటగిరి (ఎన్నారై కోటా) రూ.43.56 లక్షలు ఫీజులను నిర్ణయించారు. బిడిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ.15,730, బికేటగిరి రూ.4.84లక్షలు, సి కేటగిరి రూ.14.52 లక్షలుగా నిర్ణయించారు. మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఎకేటగిరి రూ.5,71,320, బి కేటగిరి రూ.11,42,640, సికేటగిరి రూ.66,12,500, పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమో ఎకేటగిరి రూ.1,78,538, బికేటగిరి రూ.3,57,075, సికేటగిరికి రూ.19,83,750. ప్రీ క్లినికల్ డిగ్రీ ఎ కేటగిరి రూ.80,937, బికేటగిరి రూ. 1,61,874, సికేటగిరి రూ.10,58,000గా నిర్ణయించారు.డెంటల్ క్లినికల్ పిజి డిగ్రీ ఎ కేటగిరి రూ. 3,92,783, బికేటగిరి రూ.7,85,565, సికేటగిరి రూ.15,87,000గా నిర్ణయించారు పారా క్లినికల్ డెంటల్ పిజి ఎ కేటగిరి రూ.3,53,504, బికేటగిరి రూ.5,74,759, సికేటగిరి రూ. 9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ,ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ.19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులో తెలిపారు. ఈ మేరకు మూడు వేర్వేరు జీవోలను విడుదల చేశారు.

30-8pg2exHMNWJQE:30-8pg2exHMNWJQE.qxd 29/Aug/26 11:43 PM Page 1





శనివారం ప్రయాగ్‌రాజ్‌లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన లోతైన గుంతలో స్వామి నారాయణ ఆలయ ప్రాంగణంలోని కొంతభాగం కూలిపోయిన తర్వాత అక్కడ మిగిలిన శిథిలాల దృశ్యం

# నేపాల్‌కు తొలగని ముప్పు!

>> స్పష్టమైన ఉపగ్రహ చిత్రాల్లో ఆ సరస్సు నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ఎత్తైన లెండే ఖోలా ప్రాంతంలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. సుమారు 20.25 హెక్టార్ల విస్తీర్ణంలో కొత్త నీటి మడుగు కనిపించిందని సుహోరా పేర్కొంది. ఈనెల 26న సంభవించిన వరదలతో ఈ కొత్త సరస్సు పరిణామాన్ని నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని చెప్పింది. దాని విస్తీర్ణం, స్థిరత్వాన్ని ఉపగ్రహ చిత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పుకొచ్చింది.

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 700 దాటింది. మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**కుటుంబ సభ్యులకు ఫొటోలు చూపించి గుర్తింపు**

గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖం గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కీ జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కీ ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పంచసూత్ర ప్రణాళిక

>> 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉండనున్నారు. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి...అందుకే సంజీవని తెచ్చామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి అన్నట్లు. గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కన్వర్జెన్స్ మిషన్ తెస్తున్నామన్నారు. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నామని, గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

గిరిజన రైతులు తమ ఉత్పత్తులతో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన సిఎం చంద్రబాబు అన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు వచ్చే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని ఆయన అన్నారు. 104 సర్వీసుల ద్వారా మీ ఇంటి దగ్గరే 42 రకాల వైద్య పరీక్షలు చేసి మీకు అవసరమైన మందులు ఇస్తారు. సెప్టెంబరు 2 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీరు తీసుకువస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డిఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని తొలి సంతకంతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే లేని పోని ఆరోపణలు చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేశారు. జే బ్రాండ్ల ద్వారా, కల్తీ మద్యం ద్వారా కొన్ని వేల మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు. అందరి ఆరోగ్యాన్ని నాశనం చేశారు. జే బ్రాండ్లను రద్దు చేసి మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామన్నారు.

గతంలో గంజాయి ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి చెడ్డ పేరు తెచ్చారని ఇప్పుడు దానిని మార్చేలా కాఫీ, మిరియాలు లాంటి ప్రత్యామ్నాయ పంటల ద్వారా గిరిజనులకు ఆదాయ మార్గాలు చూపామన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లోనూ గత పాలకులు అవకతవకలు చేశారని సిఎం ఆరోపించారు. ఆర్టీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్ష పత్రాలను ఓ ఎలక్ట్రీషియన్, ఓ అటెండర్ చేత దిద్దించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు. గత పాలనలో దేవాలయాల ప్రతిష్ఠను కూడా దెబ్బతీశారు. బలవంతపు మత మార్పిడులు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు కూడా బయటకు వచ్చి ఇంట్లో జరిగిన ఘటనల్ని బయటపెట్టిందన్నారు. బలవంతంగా మతమార్పిడి చేయించే ప్రయత్నం చేశారని చెప్పిందన్నారు. గ్రూప్ 1 విషయంలో ప్రశ్నించిన తమను గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం, ప్రధాని ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ల కింద 1,200 కోట్లతో 4,500 ఆరోగ్య మందిర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు.

గిరిజన గ్రామాల నుంచి రక్తం, థైరాయిడ్, కామెర్లు తదితర పరీక్షల శాంపిల్స్‌ను చింతపల్లి, పాడేరు వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా నేరుగా గ్రామాలకే ఆసుపత్రి సేవలందించేందుకు డ్రోన్ సాంకేతికతను అనుసంధానించామని చెప్పారు. డ్రోన్ల ద్వారా శాంపిల్స్ సేకరించి, పరీక్షలు నిర్వహించి, డిజిటల్ రిపోర్టులను నేరుగా గిరిజనుల వాట్సాప్‌కే పంపే దిశగా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం డోలీ వాహనాల స్థానంలో 500 కొత్త బ్రాండ్ న్యూ 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను జెండా ఊపి ప్రారంభించినట్లు తెలిపారు. సకల సౌకర్యాలతో కూడిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, తమకు ఎమ్మెల్యే రాథాకృష్ణ, వివిధ శాఖల అధికారులు, టిడిపి ప్రజాప్రతినిధులు, వేలాది సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

>> రణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్ ద్వారా నేరుగా అమరావతికి మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15 నుంచి 20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అలాగే ఈ అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించాల్సి ఉందని స్పష్టం చేశారు. రహదారికి అవసరమైన డ్రైనేజ్ కల్వర్టు, సెంటర్ లైటింగ్ వంటి అదనపు సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పూర్తయిన వెంటనే మున్సిపల్ ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఇప్పటికే గత ఐదు ఆరు నెలల్లో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు రావడం ప్రారంభమయ్యాయని, దీంతో ఈ ప్రాంతంలోని భూముల విలువలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో అభివృద్ధి కార్యకలాపాలు మరింత పెరిగితే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు సిఆర్‌డిఎ ద్వారా కూడా మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సహకారంతో, కార్పొరేషన్ మరియు సిఆర్‌డిఎ వనరులను సమన్వయం చేసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్‌ను సాధ్యమైనంత అద్భుతంగా పూర్తి చేసి, గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు కృషి చేస్తామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



శనివారం చంద్రబాబు 'సంజీవని' పథకం బహిరంగ సభకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

# రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు ఉద్యోగులు డిస్మిస్

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో పెను సంచలనం చోటు చేసుకుంది. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అప్పటి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) కె.సంధ్య, గూడ్స్ సర్వీసు టాక్స్ అధికారి బి.మెహర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కె.వి.చలపతిలను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ1 డివిజన్, జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) కార్యాలయంలోని ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన సమయంలో 2023లో ఈ అధికారులు, సిబ్బంది అవినీతి బయటపడింది. వీరిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేస్తూ రెవెన్యూ విజిలెన్స్ శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

# తెలుగులోనే ఇక ఉత్తర్వులు

>> వ్యవహారాల్లో ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఉండటంతో సామాన్య ప్రజలు, అర్జీదారులు తమ కేసులకు సంబంధించిన తీర్పులు, ఉత్తర్వులను స్వయంగా చదివి అర్థం చేసుకోవడం అనేక సందర్భాల్లో కష్టంగా మారుతోందని, ఈ నేపథ్యంలో తెలుగు భాషలో ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే, నా కేసులో ఏం జరిగింది? ఏ నిర్ణయం తీసుకున్నారు? అధికారులకు ఏ ఆదేశాలు ఇచ్చారు? అనే విషయాలను అర్జీదారులు స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని గాజుల అదెన్న అన్నారు. ఇది కేవలం భాషకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, పారదర్శకత, జవాబుదారీతనం, పౌర సాధికారతకు సంబంధించిన అంశమని గాజుల ఆదెన్న పేర్కొన్నారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగులో మాట్లాడతాం.. మన తెలుగు భాషను కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేయించాలని గాజుల ఆదెన్న విజ్ఞప్తి చేశారు. ఇతర భాషలు నేర్చుకుందాం.. కానీ తెలుగును మరిచిపోవద్దు తెలుగు భాషలో పుట్టి పెరిగిన మనమే నేడు ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మాతృభాషను విస్మరిస్తున్న పరిస్థితి బాధాకరమని గాజుల ఆదెన్న అన్నారు.

ఇటీవల కొన్ని ఉత్తర్వులను తెలుగులో ఇచ్చామన్నారు. అప్పీలు సంఖ్య 2263/ఎస్ ఐ సిజి ఏ/ఏపీ ఐ సి/2025లో అప్పీలుదారు తన అప్పీలును ఉపసంహరించుకున్నట్లు తెలియజేయడంతో అప్పీలును ముగిస్తూ తెలుగులో తీర్పును ఇచ్చారు. అదేవిధంగా అప్పీలు సంఖ్య 7366/టి ఎస్ ఐ సి/2018/టి సి6626/2021లో అప్పీలుదారు కోరిన సమాచారంపై పిఐఒకు ఆదేశాలు జారీ చేసి, అనంతరం సమాచారం అందించినట్లు సమర్పించిన పత్రాలను పరిశీలించిన తరువాత అప్పీలును ముగిస్తూ తెలుగులోనే తీర్పును ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తెలుగులో అందుబాటులో ఉండటం వల్ల సమాచార హక్కు కోసం పోరాడుతున్న సామాన్య పౌరులు తమ కేసులో తీసుకున్న నిర్ణయాన్ని ఎటువంటి అనువాదం లేదా ఇతరుల వివరణ అవసరం లేకుండా స్వయంగా చదివి తెలుసుకునే అవకాశం పొందుతున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష అమలు కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

# తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

>> విటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. భవిష్యత్‌లో భారత్-ఉజ్బెకిస్థాన్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో గణనీయమైన పురోగతి సాధించామనిమోడీ అన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచడంపై మిర్జియోయెవ్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. వికసిత్ భారత్, యాంగీ ఉజ్బెకిస్థాన్ లక్ష్యాల విషయంలో ఇరు దేశాల ఉమ్మడి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం మోడీ యాంగీ ఉజ్బెకిస్థాన్ పార్క్‌ను సందర్శించారు. అక్కడి స్వాతంత్ర్య స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అధ్యక్షుడు మిర్జియోయెవ్ కూడా మోడీ వెంట ఉన్నారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్రం సాధించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈస్మారకాన్ని ఏర్పాటుచేశారు.

మోడీ తనపర్యటనలో భాగంగా తాష్కెంట్లోని శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకున్న అనంతరం 30న ప్రధాని మోడీ కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే 26వ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొంటారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఈ సదస్సు జరగనుంది. ఎస్‌సిఓ ఏర్పాటై 25 యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశం జరుగుతోంది. భారత్ 2017 నుంచి ఎస్సీవోలో పూర్తి స్థాయి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సిఓ సదస్సులో భారత్ తన భద్రత, కనెక్టి విటీ, అవకాశాలు అనే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుందని మోడీ తెలిపారు. ఉగ్ర వాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి తావులేని ప్రాంతం కోసం సభ్యదేశాలతో కలిసి పనిచేయడమే భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. బిష్కెక్‌లో కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఇతర ఎస్సీవో దేశాల నేతలతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అలాగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొననున్నారు.

# చెంచుల అభివృద్ధికి చర్యలు

>> తున్న పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గుత్తేదారులు, పలు ప్రాజెక్టుల అధికారులు భాగస్వామ్యం అయ్యారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో శ్రీకాకుళం నగరంలో గుణపాలెం, హడ్కో కాలనీ, ఎపిజె అబ్దుల్ కలాం పార్క్, ఆర్కె నగర్ పార్క్‌ల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. కోల్ ఇండియా సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఇచ్ఛాపురం, పాతపట్నంలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో జిల్లా కేంద్ర లైబ్రరీ నిర్మాణ పనులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో ఆముదాలవలస, మందసలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంల గురించి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ కార్యక్రమాలు, బ్యాంక్ రుణాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి తోడ్పాటు అందివ్వాలని స్పష్టం చేశారు. కొత్త పారిశ్రామిక వేత్తలను తయారు చెయ్యడం, వ్యాపారంపై అవగాహన కల్పించడం, ఉపాధి అంటే ఉద్యోగమే కాదు అనే అపోహను యువతలో తొలగించడం అనే అంశాలను ఎంచుకుని భవిష్యత్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురానున్నట్టు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అరసవల్లి పుష్కరిణీ అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. కోడి రామ్మూర్తి స్టేడియం ఫేజ్ 1 పనుల గురించి ఆరా తీశారు. ఇవి డిసెంబర్ 31తేదీకి పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేపాల్ వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** నేపాల్,టిబెట్ వరదల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్న వరదల్లో మృతుల సంఖ్య 633కు చేరింది. మరో 3 వేలమంది గల్లంతైనట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిలో 517 మంది విదేశీయులు ఉండగా, వారిలో 320 మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించారు. నేపాల్ పర్యటనకు వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతయ్యారు. ఇప్పటివరకు వరదల నుంచి 3,700 మందిని సహాయ సిబ్బంది రక్షి ంచారు. సహాయ చర్యల్లో 11 వేల మంది భద్రతా సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. విదేశీ బృందాల సాయంతో నేపాల్ ప్రభుత్వం సహాయ చర్యలను ముమ్మరం చేసింది. నేపాల్ వరద బాధిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని భారత్ పంపిస్తోంది.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

>> పిలుపు మేరకు యువత, మహిళలు ముందుకు వచ్చి కష్టాల కోర్చి ఎన్నికల్లో నిలబడి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారు. స్థానిక ఎన్నికల్లో నిలబడ్డాం.. కలబడ్డాం.. జనసేన పార్టీ బలం గురించి మాట్లాడే ప్రతి ఒక్కరికీ చెబుతున్నదొక్కటే. మేం లొంగిపోలేదు. పోటీకి గైర్హాజరు కాలేదు. మేం నిలబడ్డాం. కలబడ్డాం. ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు కదం తొక్కాం. పవన్ కళ్యాణ్ పోరాట స్ఫూర్తి మనం అందిపుచ్చుకున్నాం. అదే స్ఫూర్తి నేడు రాష్ట్రంలో అద్భుతమైన పరిపాలన తీసుకొచ్చింది. వైసీపీని అధఃపాతాళానికి తొక్కుతామని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని చెప్పిన మాటను ప్రజలు నిజం చేశారు. ఆశీర్వదించారు. ఉద్దానం నుంచి ఇసుక కొరతతో ఇబ్బందులుపడుతున్న భవన నిర్మాణ కార్మికుల కోసం, మత్స్యకారుల జీవనానికి శాపంగా నిలిచిన 217 జీవో రద్దు చేయాలని మత్స్యకార భరోసా యాత్ర చేసిన అండగా నిలిచాం. రోడ్ల సమస్య మీద కానీ, ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు సహాయం చేసే విషయంలోగానీ జనసేన పార్టీ రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లింది. రాబోయే రోజుల్లో ఎలా స్థానిక సంస్థలకు సిద్ధమవుదాం అని ఇటీవల జరిగిన సమావేశంలో పవన్ కల్యాణ్ చెప్పింది ఒక్కటే. జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్దామని నిర్ణయించారు. పొత్తులో ఉన్నపుడు కొన్ని విషయాల పట్ల కొన్ని నిర్ణయాలు ఉంటాయి. మనం ఎక్కడ బలంగా ఉన్నామనేది కచ్చితంగా స్థానిక నాయకత్వం తెలుసుకోవాలి. మన బలం ఎంత..? దానికి గల కారణాలు..? సామాజిక అంశాలు, స్థానిక సమస్యలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయండి. అక్కడి మన బలాబలాలపై ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకోండి. సర్వేలు చేయించండి. కచ్చితంగా బలంగా ఉన్న చోట మనం పోటీ చేస్తే గెలిచేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనసేన పార్టీ యువత కోసం మరో అద్భుతమైన వేదికను తీసుకురాబోతోంది. పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2వ తేదీన జనసేన పార్టీ యువజన విభాగాన్ని మొదలుపెట్టబోతున్నాము. సెప్టెంబర్ 2వ తేదీన ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ చేయబోతున్నాం. యువతను పార్టీలోకి తీసుకురావాలి. స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలి. వారికి మంచి వేదికను ఇవ్వాలనే బలమైన లక్ష్యంతో యువజన విభాగం పనిచేస్తుంది. యువత సమస్యలు, వారి రాజకీయ ఆకాంక్షలు, ఆలోచనలకు ప్రతీకగా యువజన విభాగం నిలుస్తుంది. యువజన విభాగం ఏర్పాటుకు సంబంధించి ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిల్లో ర్యాలీలు, ఆవిష్కరణలు చేయాలి. దేశమే ఫస్ట్.. మిగిలినవన్నీ నెక్స్ట్ అనే తరహాలో యువజన విభాగం సేవలు విస్తృతం చేయాలనేది పవన్ కల్యాణ్ ఆలోచన. యువత రాజకీయాల్లోకి రావలసిన అవసరాన్ని గుర్తించి వారి కోసం బలంగా ఈ విభాగం పనిచేస్తుంది. 2029 ఎన్నికల్లో జనసేన పార్టీ మరింత బలంగా ముందుకు వెళ్లాలి. ప్రతి ఒక్కరూ నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఒక దేశ ప్రధాని స్వయంగా పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు అంటే మన పార్టీ అధ్యక్షుడికి కేంద్ర నాయకత్వం ఇచ్చే గౌరవాన్ని మనం అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియాను మంచి కోసం, మంచి పనిని పదిమందికి తెలియజేయడం కోసం ఉపయోగించుకోండి. స్థానిక సంస్థల ఎన్నికలు అంటే వీధి పోరాటాలు, రాజకీయాలు, చైతన్యం. మన ప్రాంతంలో జరిగే రాజకీయ పోరు. దీనిలో జనసేనను అత్యున్నతంగా నిలబెట్టేలా మనమంతా కలిసికట్టుగా పనిచేద్దాం అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, లింగమనేని రమేష్,టి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం

>> నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన త్యాగధనుడు, సంఘసంస్కర్త గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జి.ఒ ను కూడా తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషాపురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు. పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా గుర్తింపు పొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా పరివ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు. కందుకూరి, గురుజాడ, గిడుగులతో పాటు సిపి బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవనిగుర్తుచేశారు. 'ఐ లవ్ విజయవాడ' వంటి నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకూ తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు కూడా భాష ఎంతో చేరువైందని కొనియాడారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ వేడుకలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వర రావు రచించిన కావ్య మల్లికలు పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాషాపురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణు గోపాలరావు, జంధ్యాల శరత్‌బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, విఐటియు పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి లు మాట్లాడుతూ..భాషా వికాసానికి కృషి చేస్తున్న తమను గుర్తించి పురస్కారాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళావేదికకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి నమస్కరించారు20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు ముని మనవడు నాగేశ్వరరావు తెలుగు భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

30-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.విదియ ఉ.9.35
న.ఉత్తరాభాద్ర రా.3.44
వ.మ.1.18-మ.2.54
దు.సా.4.38-సా.5.28
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** వైద్యుని మార్పు చేయడం వలన లాభపడ గలుగుతామని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటారు.

**వృషభం :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ప్రతివారిని అనుమానాస్పద దృష్టితో చూస్తారు.

**మిథునం :** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** అన్ని రంగాల వారికి గతంలో కంటే నేడు ఎంతో కొంత ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**సింహం :** పని భారం వలన వత్తిడి అధికంగా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ప్రముఖుల పరిచయాలు.

**కన్య :** కీలక విషయాలలో వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకుని లాభ పడ గలుగుతారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తి చేయడానికి ప్రాముఖ్యనిస్తారు. స్వల్ప ధనలాభం గడిస్తారు.

**వృశ్చికం :** సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణ కర్తవ్యమని భావిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు. వాహన సౌఖ్యం.

**ధనుస్సు :** మంచి మాటకారితనం వలన అనుకూల ఫలితాలను ఎంతగా సాధించవలెనని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

**మకరం :** దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంత వరకు చేతికంది వస్తుంది. నూతన వాహన కొనుగోలు చేస్తారు.

**కుంభం :** నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరన్నది తెలుసుకుంటారు. ఆర్థిక అంశాలపై దృష్టిని పెడతారు. వస్త్ర లాభం.

**మీనం :** భూ, గృహ, యంత్ర సంబంధితమైన విషయములకు సంబంధినటువంటి లావాదేవీలు సానుకూల పడతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

30-8Pg3exHMNWJQEBRTCL:30-8Pg3exHMNWJQEBRTCL.qxd 29/Aug/26 11:40 PM Page 1



# తిరుమల సమాచారం



## నేటి నుంచి తిరుమలలో కారీరిష్టి యాగం
### వరుణయాగం, పర్జన్యశాంతి హోమం

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ ఆదివారం(నేటి) నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు వరుణయాగ, పర్జన్యశాంతి సహిత కారీరిష్టి యాగాలను టిటిడి నిర్వహిస్తోంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్త పండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందు కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలిరోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో అంకురార్పణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో వరుణయాగం, కారీరిష్టి, పర్జన్యశాంతి కార్యక్రమాలతో పాటు ఏడు వేదశాఖల పారాయణం, రామాయణం, సుందరకాండ, విరాటపర్వం, ఋష్యశృంగ ధ్యాన పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గోగర్భండ్యామ్ వద్ద వరుణ, పర్జన్య మంత్ర అనుష్ఠానం నిర్వహిస్తారు.సాయంత్రం 6గంటలనుండి రాత్రి 8గంటల వరకు ధర్మగిరిలో అగ్నిహోత్రఉపాసనం, ఏడు వేదశాఖల పారాయణం జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్రప్రజలకు అంతామంచి జరగాలనితిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప్, జస్టిస్ మేడిమల్లి బాలాజీ. క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ తదితరులు కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
### నగర సంకీర్తనలో రాష్ట్ర బిజెపి చీఫ్ మాధవ్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నగర సంకీర్తన మరింత వైభవంగా కొనసాగి తిరుపతికి ఆధ్యాత్మిక శోభను మరింత పెంచాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నట్లు బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్ర మైన తిరుపతి నగరంలో శనివారం తెల్లవారు జామున జరిగిన నగర సంకీర్తనలో రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన సంప్రదాయ వస్త్రాలు ధరించి , నుదుట తిరునామాలు ధరించి భజన మండలి సభ్యులతో కలిసి భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మీడియా ప్రతినిధి జల్లి మధు సూదన్, సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మునినాధ రెడ్డి,వాసుదేవ రెడ్డి, మునిరత్న ఆచారి, పొనుగంట భాస్కర్, చిత్ర హనుమం తరావు,లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.



## యోగసాధనతో ఆధ్యాత్మిక ఉన్నతి: డాక్టర్ రాజశేఖర్

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్య, పరిశోధనా రంగాల్లో అపూర్వ సేవలందించడంతోపాటు యోగసాధన ద్వారా ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించిన మహనీయులు వేటూరి ప్రభాకరశాస్త్రి అని వేంకటేశ్వర విశ్వవిద్యాల యం ప్రాచ్య పరిశోధనా సంస్థ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. 76వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేటూరి ప్రభాకరశాస్త్రి యోగ మార్గం అంశంపై డాక్టర్ రాజశేఖర్ ప్రసంగించారు. యోగాన్ని కేవలం శారీరక సాధనగా కాకుండా మనస్సుకు ప్రశాంతతను, ఆలోచనలకు ఉన్నతిని, జీవితానికి ఆధ్యాత్మిక దిశను చూపే సాధనగా ప్రభాకరశాస్త్రి భావించరన్నారు. యోగసాధన ద్వారా ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ జీవన విధానాన్ని అలవరచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభాకరశాస్త్రి యోగసాధన, ఆధ్యాత్మిక జీవన విధానం నేటి తరానికి కూడా జ్ఞానదీపంలా మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహానికి టిటిడి హిందూ ధర్మ ప్రచార కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ
## అకాడెమీలకు ప్రభుత్వ స్థలాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** దేశానికే ఆదర్శంగా రాష్ట్ర రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ "స్పోర్ట్స్ సిటీ" తో పాటు స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పివి సింధు, పుల్లెల గోపీ చంద్, కిదాంబి శ్రీకాంత్ క్రీడాకారుల అకాడ మీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు. అరకు నుంచి తిరుపతి వరకు, శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేనతమన్నారు. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాప్ ఛైర్మన్ వాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో సుమారు 90 వేల మంది, రాష్ట్రస్థాయిలో సుమారు 10 వేల మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని వెల్లడించారు.





ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని తెలిపారు. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు ఆరు ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఎపి నురి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్య మని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్స వంలో ఐదు లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని ఆరోగ్య కరమైన సంపద, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు.మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని విశాఖ, అమరావతి, తిరు పతిగా మూడు జోన్లుగా విభజించి నట్లు తెలి పారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల్లో స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సిఎస్ఆర్ నిధులతో రవినాయుడు క్రీడాకారులు పాల్గొన్నారు.

### అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

**తిరుపతి/తిరుపతిక్రీడ, ఆగస్టు 29ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందిస్తామని,రాష్ట్రప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని ప్రముఖులు చెప్పారు. తిరుపతిలో నాలుగురోజులు జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో విజయం సాధించిన విజేతలు, రన్నరప్‌లకు కలిపి 92 లక్షల రూపాయలుయ నగదును అందజేశారు. విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. శనివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు అధ్యక్షతన అమరావతి ఛాంపియన్‌షిప్- 2026 ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర ,మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , శ్రీని ఈ పోటీలను అండర్-17, అండర్-23 విభాగాల్లో నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువ క్రీడాకారులు పాల్గొనడం ద్వారా క్రీడల పట్ల యువతలో ఆసక్తి మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన 264 మంది క్రీడాకారులకు క్రీడా ప్రోత్సాహకాల కింద మొత్తం 8.8 కోట్ల రూపాయలు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు తెలిపారు.అమరావతి ఛాంపియన్ షిప్-2026కు లభించిన ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,ఎస్వీ యూనివర్సిటీ ,పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతులు ఆచార్య నర్సింగరావు, ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్‌లు ఆచార్య భూపతినాయుడు, ఆచార్య ఉష, టిడిపి ఇన్చార్జి జెబి శ్రీనివాసులు,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాప్ ఎండి భరణి , క్రీడాకారులు

# సోషల్ వర్క్ పాఠ్యప్రణాళికలపై పునఃపరిశీలించాలి



**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ మేధో, సాంస్కృతిక తాత్విక వారసత్వాన్ని సామాజిక సేవా విద్య ఆచరణను బలోపేతం చేయడానికి వినియోగించాల్సిన అవసరాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ నొక్కిచెప్పారు. ప్రస్తుతం ఉన్న సోషల్ వర్క్ పాఠ్యప్రణాళికలు పాశ్చాత్య నమూనాలపై ఆధారపడ"టాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భారతీయ జ్ఞాన వ్యవస్థలు-సామాజిక సేవపై జాతీయ సదస్సు సోషల్ వర్క్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో జాతీయ సదస్సు శనివారం జరిగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయుర్వేదం వంటి భారతీయ జ్ఞాన సంప్రదాయాలతో పాటు విశ్వాసం, విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలపై ఆధారపడిన భారతీయ సాంస్కృతిక వ్యవస్థలు సామాజిక సేవా విద్యకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించగలవని ఆమె వివరించారు. ధర్మం, కర్మ వంటి భారతీయ భావనలు, మహాత్మా గాంధీ ప్రతిపాదించిన అహింసా సిద్ధాంతం సమకాలీన సామాజిక సేవా విద్య ఆచరణను మరింత సమృద్ధి చేయగలవని ఆమె పేర్కొన్నారు. తుంకూరు విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన ఆచార్య కె. జి. పరశురామ, "నిర్మాణాత్మక భారతీయీకరణ" అత్యంత అవసరమని తన కీలక ప్రసంగంలో పేర్కొన్నారు. భారతీయ తత్వశాస్త్రం, సంస్కృతి, విలువలు , కుటుంబ వ్యవస్థలు సమాజ నిర్మాణాలు సోషల్ వర్క్ కు ముఖ్యమైన జ్ఞాన వనరులని ఆయన పేర్కొన్నారు. సదస్సు సమన్వయకర్త సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య కె. అనురాధ, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి సదస్సులో ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నిపుణులు అకడమిక్ సెషన్లలో పాల్గొన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయానికి చెందిన సామాజిక సేవా విభాగం ప్రొఫెసర్ షాహిన్ సుల్తానా, అధ్యాపకులు, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

## అనుగుణమైన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం
### ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం
### ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక జీవనశైలిలో మారుతున్న ఆహారపు అలవాట్లు, సమయపాలన లోపం కారణంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ప్రకృతి వైద్య నిపుణుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. "ఆరోగ్య సంజీవిని" అంశంపై ఆయన మాట్లాడుతూ జీవన విధానం ప్రకృతి నియమాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. సూర్యోదయం, సూర్యా స్తమయాలను అనుసరించి దైనందిన కార్యక్రమాలను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి భోజనాన్ని సాయంత్రం ఆరు గంటలలోపే పూర్తి చేసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెప్పారు. రాత్రి ఆలస్యంగా భోజనం చేసి వెంటనే నిద్రించడం వల్ల జీర్ణవ్యవస్థపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ, టిటిడి సంయుక్త ఆధ్వర్యంలో యోగ, ప్రకృతి వైద్యంతో ఆరోగ్య పరిరక్షణ" అంశంపై రెండు రోజుల అవగాహన కార్యక్రమం శనివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తొలి రోజు టిటిడి విద్యాసంస్థల విద్యార్థులకు, రెండో రోజు టిటిడి ఉద్యోగులు, పురప్రజలకు ముందస్తు ఆరోగ్య సంరక్షణ, డిజిటల్



సమతుల్యత, ఆహారమే ఔషధం, డిజిటల్ డిటాక్స్ తదితర అంశాలపై డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ, ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగముని నాయక్, టిటిడి డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి



**విశాఖపట్నం ఆగస్టు 28 ప్రభాతవార్త:** విశాఖలోని చింతల అగ్రహారంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందినట్లు సమాచారం.మల్లా ప్రవీణ్, ఆయన భార్యతో పాటు ఇద్దరు పిల్లలు మృతి చెందినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చిన అనంతరం భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అంతకుముందు భార్యాభర్తలు తమ వాట్సాప్ స్టేటస్‌లో 'రిప్' అంటూ సందేశం పెట్టినట్లు తెలుస్తోంది. ఆ స్టేటస్‌ను చూసిన బంధువుల అమ్మాయి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.ప్రవీణ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య కూరగాయల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ విషాదానికి అసలు కారణం ఏమిటనేది ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## రేపు వైజాగ్‌లో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ
### సమీక్షా సమావేశంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్

**విశాఖపట్న, ఆగస్టు 29 ప్రభాత వార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ పిలుపునిచ్చారు.ఈ నెల 31వ తేదీ (సోమవారం) విశాఖపట్నంలో జరగనున్న ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై, రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు .ఈ కార్యక్రమ ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఆర్యవైశ్య నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లతో డూండి రాకేష్ శనివారం నగరంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ లౌక్యానికి, ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరైనరోశయ్య విగ్రహాన్నివైజాగ్‌లో ఆవిష్కరించుకోవడం గర్వకారణ మన్నారు. మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జరిగే ఈ విగ్రహా విష్కరణ మహోత్సవానికి ఆర్యవైశ్య ప్రము ఖులు,నాయకులు, సమాజ బంధువులు భారీసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పైడ కృష్ణ ప్రసాద్ పలువురు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బొప్పరాజు వ్యాఖ్యలను ఖండించిన అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి చైర్మన్

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** బొప్పరాజు వ్యాఖ్యలను అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్ ఖండించారు. "బొప్పరాజు జరిపిన సదస్సు. రాజకీయ ప్రేరేపితం. పొలిటికల్ అజెండాతోనే ఉద్యోగ సంఘం సదస్సు నిర్వహించారు. బయట నుంచి వచ్చిన స్క్రిప్టులతో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సీఎం, ఆయన సతీమణిపై వ్యంగ్యాస్త్రాలు సరికాదన్నారు.పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బొప్పరాజుకు తగదు. ఉద్యోగుల సమస్యలు చర్చలతోనే పరిష్కరించుకోవాలి. పసలేని కార్యాచరణతో కుటుంబాలను రోడ్డుపైకి తేవడం సిగ్గుచేటు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు బొప్పరాజు అండ్ టీమ్ పన్నాగం. బొప్పరాజు అంటేనే డ్రామా నడిపే వ్యక్తి అనే భావన ఉద్యోగుల్లో ఉంది. రెవెన్యూ భవనం పేరుతో ఉద్యోగుల వద్ద ఒకరోజు వేతనం వసూలు చేశారు. రెవెన్యూ స్పోర్ట్స్ పేరుతోనూ నిధులు వసూలు చేశారని ఆరోపణలు. బొప్పరాజు బారి నుంచి ఉద్యోగు లను రక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి" అని భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు.



## తీయని భావాల భాండాగారం తెలుగు
### డాక్టర్ మేడసాని మోహన్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాష తీయని భావాల భాండాగారమని అవధాని, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం తెలుగు భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడసాని మోహన్ మాట్లాడుతూ తెలుగు బాష ప్రాచీనమైనదే కాకుండా మాధుర్యం, సాహిత్య సంపద, భావవ్యక్తీకరణలో విశిష్టత కలిగిన భాషగా గుర్తింపు పొందిందని తెలిపారు. వివిధ బాషల్లోని పదాలు తెలుగు బాషలో సులు వుగా ఒదిగిపోవడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషా చమత్కారాలతో అహూతులను అలరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తెలుగు వైభవాన్ని క్షుణ్ణంగా వివరించారు. తెలుగు బాషను ప్రజల వ్యావహారిక భాషగా తీర్చిదిద్దడంలో గిడుగు వెంకట రామమూర్తి కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఎపి తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తెలుగు బాషలో ఎంతో మధురమైన సుమతీ శతకాలు, వేమన పద్యాలను పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా వుం దన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మేడసాని మోహన్, పేట శ్రీనివాసులు రెడ్డిలను దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు ,పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు భాషకు గొడుగు గిడుగు: మాధవ్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాషా వ్యావహారిక రూపానికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో ఆయన చిత్రప టానికి మాధవ్, బిజెపి నాయకులు పుష్పాంజలి ఘటించారు. గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగు భాషను పండితుల గ్రంథాలకే పరిమితం కాకుండా ప్రజల నోట వినిపించే వ్యావహారిక తెలుగుగా తీర్చిదిద్దేందుకు గిడుగు రామమూర్తి పంతులు జీవితాంతం కృషి చేశారని అన్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే విద్య, సాహిత్యం, పరిపాలన ఉండాలనే ఆయన ఆలోచన నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

## మహిళపై సామూహిక అత్యాచారం

**విజయవాడ.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలోని వాంబే కాలనీలో దారుణం చోటు చేసుకుంది. ఒంటరిగా ఉంటున్న మహిళపై స్థానికంగా నివాసముంటున్న ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆ ప్రాంతంలో సంచలనంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం వాంబే కాలనీలో నివాసం ఉంటున్న మహిళపై అర్ధరాత్రి స్థానికంగా అల్లరి చిల్లరగా తిరిగే ఐదుగురు యువకులు మద్యం మత్తులో మహిళపై ఆఘాయిత్యానికి పాల్పడ్డారని, ఉదయం మహిళా ఎంతసేపటికి స్పందించకపోవడంతో చుట్టుపక్కల నివాసం ఉండేవారు ఆమెను ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నున్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన నున్న గ్రామీణ పోలీసులు ఆమె వద్ద స్టేట్ మెంట్ రికార్డు చేసి ఐదుగురు యువకులను అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్వరలో వివరాలని తెలుపుతామని నున్న గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ తెలిపారు.

# వచ్చే 26,27 తేదీల్లో 'విశాఖ నృత్యోత్సవ్'
### లోగో,పోస్టర్లను ఆవిష్కరించిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

**విశాఖపట్నం, ఆగస్టు 29 ప్రభాత వార్త:** నగరానికి చెందిన ప్రఖ్యాతనటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ తమ "18వ ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహణకు తొలి అడుగేసింది. అందుకు సంబంధించిన "విశాఖ నృత్యోత్సవ్ 2026" అధికారిక లోగో డాన్స్ ఫెస్టివల్ పోస్టర్లను ఒడిశా గౌరవ గవర్నర్ కంభంపాటి హరి బాబు శనివారం విశాఖపట్నం లో ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి, ఫెస్టివల్ డైరెక్టర్ విక్రమ్ గౌడ్, ఫెస్టివల్ కోఆర్డినేటర్ భాగ్యశ్రీ బత్తిన గవర్నర్ తో కలిసి అధికారిక ప్రచార పత్రాలను విడుదల చేశారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు సాయంత్రం 6:00 గంటల నుండి స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు.



భారతదేశం నలుమూలల నుండి వచ్చే ప్రముఖ నృత్య కళాకారులు, కళా బృందాలు ఈ వేదికపై వివిధ శాస్త్రీయ, జానపద నృత్య రీతులను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు సెప్టెంబర్ 26న గీతా నారాయణ్ సడగాణి (ఆంధ్రప్రదేశ్) చే కూచిపూడి, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనా జవేరి గ్రూప్ (మహారాష్ట్ర) మణిపూరి, హరి రెడ్డి గ్రూప్ (కర్ణాటక) చే కథక్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే రెండో రోజు సెప్టెంబర్ 27న కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వసుంధర దొరస్వామి బృందం (కర్ణాటక)భరతనాట్యం, మరియు అఫ్సాన్ గుజరాత్ బృందం (రాజస్థాన్) చే చారీ జానపద నృత్య ప్రదర్శనలు జరగను న్నాయన్నారు. గత 17 సంవత్సరాల నుంచి భారతీయ సంప్రదాయ నృత్య కళల్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విశాఖ నృత్యోత్సవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది 18 వ నృత్యోత్సవమని, అందరు తరలి రావా లని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

30-8pg4:30-8pg4.qxd 29/Aug/26 10:23 PM Page 1



కృష్ణా నది జలాల వివాదం,తాజా వర్షాభావ పరిస్థితులపై కృష్ణానది యాజమాన్య బోర్డు ఆగస్టు 2026లో కీలక సమావేశం నిర్వహించి కొన్ని ప్రాథమిక నిర్ణయాలు తీసుకుంది. ఎగువప్రాంతాల నుండి శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు వరద ప్రవాహాలు భారీగా తగ్గడంతో ఉమ్మడి రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఎలా ఉపయోగించాలనే దానిపై బోర్డు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది.ఆగస్టు 2026 నాటి సమావేశంలో కేఆర్ ఎంబి తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. అందువల్ల, ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, సాగునీటికి (ఇరిగేషన్) ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని బోర్డు స్పష్టం చేసింది. అక్టోబర్ 2026 వరకుతమ తాగునీటి అవసరాల కోసం 47 టీఎంసీల నీరు కావాలని ఏపీ బోర్డును కోరింది. ఇందులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 22టీఎంసీలు, హంద్రీనీవా ద్వారా 11 టీఎంసీలు, సాగర్ కుడి కాల్వ ద్వారా 7 టీఎంసీలు, కృష్ణా డెల్టా సిస్టమ్ కోసం 6 టీఎంసీలు కావాలని ఇండెంట్ పెట్టింది. ఏపీ ఇప్పటికే తమకు నిర్దేశించిన కోటాకంటే 10 టీఎంసీల నీటిని అదనంగా వాడుకుందని తెలంగాణ అధికారులు కేఆర్ ఎంబికి ఫిర్యాదు చేశారు. అలాగే ఉమ్మడి జలాశయాల నుండితాగునీటి విడుదలను 50:50 నిష్పత్తిలో సమానంగా పంచాలని తెలంగాణ డిమాండ్ చేసింది. 3. తుది నిర్ణయం వాయిదా 4)రెండు రాష్ట్రాలు తమ వార్షిక నీటి అవసరాల పూర్తి వివరాలను (యాన్యువల్ ఇండెంట్) వేర్వేరు కాల పరిమితులతో సమర్పించాయి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఎన్ని టీఎంసీల నీరు తాగునీటి కింద కేటాయించాలనే తుది నిర్ణయాన్ని సెప్టెంబర్ 4, 2026న జరిగే తదుపరి సమావేశానికి బోర్డు వాయిదా వేసింది.

# ఎల్‌నినో ఎఫెక్ట్..సాగు సగమే

**నెలవెట్ల సతీష్‌కుమార్ రెడ్డి**

పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణం, వర్షపాతంపై ప్రభావం చూపే వాతావరణ నమూనాయే ఎల్‌నినోగా చెప్పవచ్చు. దీనివల్ల రుతుపవనాలు బలహీనంగా,ఆలస్యంగా, అసమానంగా ఉండొచ్చు. వర్షాధార పంటలపై ఇది ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం ఏడాదికొకవిధంగా మారుతుంది. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. వానలోటుతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఇప్పటికే వేసిన పంటలు ప్రమాదంలో ఉన్నాయి. నైరుతి రుతు పవన (జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు) కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువగా ఉండగా, ఆగస్టు 25 నాటికి రాష్ట్రంలో 51శాతం వాన లోటు నమోదైంది. ఇది దేశవ్యాప్త లోటుకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గేఅవకాశం ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి తక్కువ నీటితోపండే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి సూచించారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటర్ మేర క్షీణించిందని ఆయన తెలిపారు. రైతుల ప్రయోజనార్థం జిల్లాస్థాయి ప్రత్యేక సలహాలను, పంటల యాజమాన్య వ్యూహాలను సిద్ధంచేస్తున్నట్లు వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన బుధవారంప్రజాభవన్‌లో ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. భారత వాతావరణ విభాగం, ఇక్రిశాట్, ఇకార్‌క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు పలుప్రముఖ సంస్థల నిపుణులు ఇందులో సభ్యులుగాన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ వర్షపాత లోటు ఉంది. దీంతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్య



లు చేపట్టింది. రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వాతావరణ ఆధారిత (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పంటల బీమా నమోదు గడువును జూలై31వరకు, దిగుబడి ఆధారిత పంటల బీమా (పీఎంఎఫబీవై)గడువును ఆగస్టు 31వరకు పెంచారు. దీనివల్ల ఉద్యాన పంటల బీమా కవరేజ్ గణనీయంగా పెరిగి, మరిన్ని పంటలకు బీమా వర్తించింది. ఎల్‌నినో సమయంలో పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక రక్షణగా నిలుస్తోంది పంటల బీమా! ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో సాగు నీళ్ల కరవై పంటల సాగుపై ప్రభావం చూపుతున్నది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ప్రాజెక్టులన్నీ ఖాళీ కుండలను తలపిస్తున్నాయి. వెరసి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ పరిస్థితులతో గతఏడాదితో పోల్చితే పంటల సాగు భారీగాతగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయశాఖఅంచనా వేసింది. గత ఏడాది 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో ఇది 1.06కోట్ల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశమున్నదని అంచనా వేసింది. అంటే సుమారు 32.20 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గుతుందని స్పష్టం చేసింది. గత ఏడాది వానకాలంతో పోల్చితే 23శాతం సాగు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 73.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు నివేదికలో పేర్కొన్నది. గతఏడాది ఇదే సమయానికి 78లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే గత ఏడాదితో చూస్తే 4.64 లక్షల ఎకరాల్లో పంటలు తక్కువగా సాగయ్యాయి.ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా వరిసాగుపై పడుతున్నది. సాగునీరు అధికంగా అవసరముండే పంట కావడం, వర్షాలు లేకపోవడంతో వరి సాగు సగానికి సగం తగ్గే అవకాశం ఉన్నది. గతఏడాది వానకాలంలో 70లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఈ సీజన్‌లో 38.51 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యే అవకాశమున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంటే 31.38లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గుతుందని పేర్కొన్నది. ఇప్పటి వరకు 14.09 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడినట్లు తెలిపింది. పత్తి 4.77 లక్షల ఎకరాల్లో తగ్గనున్నది. గత ఏడాది 50.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈసీజన్‌లో 45.92 లక్షలఎకరాల్లోనే సాగైంది. ఇక మక్కజొన్న 40వేల ఎకరాల్లో తగ్గే అవకాశమున్నది. 25 జిల్లాల్లో రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాలు, గ్రామాలు ఎల్‌నినో బారినపడుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఇప్పటివరకు 25కు పైగా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లుగా పేర్కొంది. ఇక 355 మండలాల్లో లోటు వర్షపాతం, 42మండలాల్లో అత్యంతలోటు వర్షపాతం, 186 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఇక గ్రామాల విషయానికొస్తే దాదాపుగా అన్ని గ్రామాలపై ఎల్‌నినో ప్రభావం ఉన్నట్లుగా పేర్కొంది. అయితే ఇందులో సుమారు 8 వేల గ్రామాలపై మధ్యస్థ ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతున్నట్లుగా వ్యవసాయశాఖ వెల్లడించింది. గత ఏడాది (2025) శ్రీశైలం నుంచి మొదటి సారి జూలై 8, 2025న క్రస్ట్ గేట్లు 6, 7, 8,11 నంబర్‌గల 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో అదే నెల జూలై 29, 2025న 6 గేట్లను, ఆ తర్వాత ఆగస్టు మాసంలోనూ వరద ఆధారంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గత ఏడాది వరదలు భారీగా రావడంతో దాదాపు 4 సార్లకు పైగా విడతలవారీగా గేట్లు ఎత్తాల్సి వచ్చింది.గత ఏడాది భారీ వరదలతో పోలిస్తే, ఈసారి వర్షాభావ పరిస్థితులు,వరదలు తగ్గడం వల్ల కృష్ణా జిల్లా తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటోంది. గత ఏడాది శ్రీశైలం, సాగర్ గేట్లు పదేపదే ఎత్తడం వల్ల దిగువన ఉన్న కృష్ణా డెల్టా ప్రాంతం నీటితో కళకళలాడింది. కానీ ఈసారి సాగునీరు, తాగు నీటి సంక్షోభం తలెత్తింది. దీంతో రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేయలేకపోయారు. అధికారులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక నేలలు వరికి మాత్రమే అనుకూలంగా ఉండటంతో రైతులు పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదిలా ఉండగా నాగార్జున సాగర్ వద్ద ఘర్షణ ఆగస్టు 26, 2026న ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేఆర్‌ఎంబి అనుమతి ఉందంటూ ఆంధ్రప్రదేశ్ అధికారులు నాగార్జున సాగర్ కుడి కాల్వ గేట్లను తెరిచి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీనికి కౌంటర్‌గా తమకు ఎలాంటి సమాచారం లేదం టూ తెలంగాణ అధికారులు కూడా ఎడమ కాల్వ గేట్లనుతెరిచి సమానంగా నీటిని విడుదల చేయడంతో సాగర్ వద్ద మళ్లీ కృష్ణా జలాల యుద్ధం మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ,సెంట్రల్ వాటర్ కమిషన్ సెప్టెంబర్ 7, 2026న ఢిల్లీలో ఇరు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతోప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. వర్షాభావం వల్ల జలవివాదాలు మరింతపెరిగే అవకాశం ఉన్ననేపథ్యంలో ప్రత్యామ్నాయం

తమిళనాడు

# విజిల్ @100

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో సవాళ్ల నడుమ సాగుతున్న నడకలో విజయ్‌కి ముఖ్యమంత్రిగా మొదటి వంద రోజులు పూర్తయ్యాయి. రాజకీయాల్లో తమిళ వెట్రి కళగం (టివికె) పార్టీని స్థాపించి రెండేళ్లలోనే ముఖ్యమంత్రి కావడం సినిమా నటుడైన విజయ్ సాధించిన తొలి విజయం అనుకుంటే, ఆ పదవిలో తొలి వంద రోజులు పూర్తి చేయడం మలి విజయం అనే చెప్పాలి. ఎందుకంటే.. ఆయనను పదవిలోకి రాకుండా, వచ్చినా కొద్ది రోజుల కంటే నిలబడకుండా చేయడానికి జరిగిన యత్నాలు ఈ వంద రోజుల్లో ఒకటీ రెండు కావు. అసెంబ్లీలోకి ప్రవేశించడం నుంచి అనేకానేక కొత్త పథకాలను ఇబ్బడిముబ్బడిగా ప్రకటించడం ద్వారా రోజురోజుకు తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటూ ఆయన ముందుకు సాగుతున్నట్లుగా కనిపిస్తుంది. ఆయన పార్టీ గుర్తు విజిల్. అది అప్రతిహతంగా ధ్వనిస్తూనే ఉంది. పార్టీ ఆవిర్భవించిన గత రెండేళ్లుగా విజిల్ మోత వినిపిస్తూనే ఉంది. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకొంటూ ఆయన ప్రకటిస్తున్న పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం,యేడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ప్రజల మెప్పును ఎక్కువగా పొందాయి. మహిళా భద్రతకు ఉద్దేశించినప్రత్యేక దళాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 65 ప్రత్యేక టాస్క్ ఫోర్స్ లు, 717 మద్యం దుకాణాల మూసివేత వంటి నిర్ణయాలు కూడా చక్కని ప్రజాదరణ పొందాయి. విద్యార్థులకోసం రెండు వేల కోట్లతో లాప్‌టాప్ పథకం, 710 కోట్లతో కామరాజ్ అల్పాహార పథకం, ఆరు వేల కోట్లతో గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటి పథకాలు కూడా ప్రశంసలనందుకొన్నాయి. ఆగస్టు 5న ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో 'జెన్ జీ' ని ఆకర్షించే పలు పథకాలు ప్రకటించడం ఆయన ముందు చూపునకు నిదర్శనం. పాఠశాల నుంచే ఎఐ విద్య, ఐటిఐల్లో ఎఐకోర్సులు, ఐదులక్షల మంది ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎఐ శిక్షణ వంటి అనేక బడ్జెట్ ప్రతిపాదనలు దానిలో ఉన్నాయి. 100 రోజులు పూర్తయిన సందర్భంగా విజయ్ ప్రభుత్వం ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సమర్పిస్తూ 1.2 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రతిపాదనలు చేయడం విశేషం. ప్రకటించిన పథకాల్లో 90 శాతం అమలులోకి రావడంతో విజయ్ సక్సెస్ రేట్ బాగా పెరిగింది. ఇండియా టుడే సర్వే ప్రకారం విజయ్‌కి ప్రజాదరణ 70 నుంచి 75 శాతం దాకా ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా విజయ్ దాదాపు 35 శాతం ఓట్లతో గత మే నెలలో అధికారంలోకి వచ్చారు. ఆయన వ్యవహార శైలి విభిన్నంగా ఉండడంతో ప్రజలను ఆకర్షించినా,పథకాల అమలుతో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సాధించగలిగింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో టివికెకు తగినంత బలం ఇంకా చేకూరలేదనే అభిప్రాయం ఉంది. సినిమా రంగానికి చెందడంతో ఆ ఆకర్షణ ఆయనకు కలిసివచ్చిందనే వాదన కూడా సబబు కాదు. అలా కలిసి వస్తే మెజారిటీకి దూరంగా 108 సీట్లు మాత్రమే ఎందుకు వస్తాయి! కాంగ్రెస్, మిత్ర పక్షాల మద్దతుతో ఎట్టకేలకు అధికారంలోకి వచ్చినా బాలారిష్టాలు ముసురుతూనే ఉన్నాయి. అధికారం కోల్పోయిన స్టాలిన్ తొలుత విజయ్‌ని తీవ్రంగా విభేదించినా, కొద్ది రోజుల్లోనే 'అసలు సినిమా చూస్తా' రంటూ శాపాలు పెట్టినా అటువంటి 'సినిమా' ఏదీ తెరపైకి రాకపోవడం గమనించవలసిన విషయం. పూర్తి మెజారిటీ లేకపోవడంతో విజయ్‌ని ఓ ఆట ఆడిద్దామనే స్టాలిన్ అనుకొన్నారు. అయితే విజయ్ ప్రకటించిన పథకాలే ఇప్పుడు ఆయనకు శ్రీరామ రక్ష అవుతున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలన నుంచి తమిళనాడుకు విముక్తి కలిగించి డిఎంకె, అన్నా డిఎంకెలను పక్కకు నెట్టిన 'నాయకుడు'గా ఎదుగుతున్న విజయ్ పరుగుకు బ్రేక్ వేసే యత్నాలు గత వందరోజుల్లో చాలానేజరిగాయి. 2026 ఎన్నికల్లో డిఎంకె పార్టీకి 24 శాతం ఓట్లు రాగా, అన్నాడిఎంకెకు 21శాతంవచ్చాయి. విజయ్‌ని ఓడించాలంటే ఈ రెండు పార్టీల ఓట్ల శాతాలు ఏకం కావాలి. విజయ్ ప్రమాణ స్వీకారానికి ముందు అటువంటి ప్రయత్నం కూడా ఒకటి జరిగింది. రజనీకాంత్ స్టాలిన్‌తో జరిపిన 'ప్రత్యేక భేటీ' అప్పట్లో సంచలనం సృష్టించింది. విజయ్ ప్రమాణ స్వీకార హడావుడిలో ఆ వార్త మరుగున పడినా, అది ఇప్పటికీ కదులుతూనే ఉంది. డిఎంకె, అన్నాడిఎంకెను ఒక తాటి పైకి తేవడమే లక్ష్యంగా రజనీకాంత్ ఆ చర్చలు జరిపినట్లు అప్పట్లో అంతా చెప్పుకొన్నారు. ఆ రెండు పార్టీలు కలుస్తాయా? అనే ప్రశ్నకు జవాబు చెప్పలేం. ఎంచుకొనే లక్ష్యాన్ని బట్టి ఏది జరగడానికైనా అవకాశం ఉంటుంది. ఆ ప్రయత్నం కొనసాగితే రాజకీయ సమీకరణాలు కూడా మారుతాయి. అది పసిగట్టడం వల్లనే అన్నాడిఎంకెలో చీలిక తేవడానికి విజయ్ చాలా పెద్ద ప్రయత్నమే చేసినట్లు వినిపించింది. చాప కింద నీరులా ఆ కథ నడుస్తూనే ఉంది. ఇప్పటి వరకు చూస్తే విజయ్ పాలన ఇంకా 'విజయ వంతమైన ప్రారంభం' గానే చెప్పాలి. విజయవంతమైన సిఎం కావడానికి మరికొంత కాలం పట్ట వచ్చు. ముందు అనేక సవాళ్లను అధిగమించ వలసి ఉంటుంది. పరందూరు రెండో విమానాశ్రయం ప్రాజెక్టు రద్దు, కావేరీ జల వివాదం ప్రస్తుతం ఆయన మెడకు చుట్టుకొంటున్నాయి. కరూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తూ విజయ్ తీసుకొన్న నిర్ణయాన్ని హైకోర్టు తిరస్కరించడం కూడా ఆయన ప్రభుత్వానికి పెద్ద ఎదురు దెబ్బ. ఇటువంటి కొన్ని మైనస్‌లున్నా విజయ్ సర్కార్‌కు ప్రజాదరణ 70 శాతం ఉండడం కూడా గమనించవలసిన మరో అంశం. అయితే ఈ రేటింగ్‌ను నిలబెట్టుకొనడానికి ఆయన ముందు ముందు ఏఎచర్యలు తీసుకొంటారనే విషయం పైనే టివికె పార్టీ రాజకీయ




ముఖ్యమంత్రి విజయ్

అమెరికా

# మధ్యవర్తి మంతనాలు!

**గన్ని మోహన్**

నాలుగేళ్లు దాటిన రష్యాఉక్రెయిన్ యుద్ధ విరమణకు అమెరికా శతవిధాలా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రష్యా సైన్యం ఎదుర్కొంటున్న భారీ నష్టాలతో అదనపు భూభాగం ఏమీ సాధించలేకపోయిందని అమెరికా సిఐఎ అంచనావేసింది. మరోపక్క వేలాదిగా డ్రోన్లతో ఉక్రెయిన్ నగరాలను ధ్వంసంచేస్తున్న రష్యా సేనలకు ఇప్పుడు అదనంగా మరో మూడు లక్షలమంది సైన్యాన్ని కూడా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమకూర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి సాగుతున్న ఈ ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెర దించాలన్న లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణ చర్చలకు మళ్లీ తెరలేపినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ విమానం హఠాత్తుగా మాస్కోలో ల్యాండ్ అయిన సంఘటన ప్రపంచ వ్యాప్తంగా ఆశ్చర్యం కలిగించింది. అందులో సిఐఎ చీఫ్ జాన్ రాట్‌క్లిఫ్ రహస్యంగా మాస్కోను సందర్శించి ఆదేశ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్‌ఎస్‌బీ) చీఫ్ అలెగ్జాండర్ బోర్ట్నికోవ్‌తో సమావేశమై కాల్పుల విరమణకు చర్చలకు ముందుకురావాలని కూడా ట్రంప్ సందేశంగా వినిపించినట్లు సమాచారం. రష్యా సైనిక, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారకముందే తీవ్ర స్థాయిలో చర్చలు ప్రారంభించాలని ఆయన సూచించినట్లు సమాచారం. రష్యాసైనిక బలగాలు యుద్ధ రంగంలో చెల్లిస్తున్న మూల్యాన్ని ర్యాట్‌క్లిఫ్ తన అంచనాలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. తాను సీఐఎ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన 18 నెలల కాలంలో రష్యా ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో కేవలం ఒకటి శాతంమేర మాత్రమే అదనంగా స్వాధీనం చేసుకోగలిగిందని ఆయన గుర్తు చేసారు. ప్రస్తుత, మాజీ అమెరికా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రష్యా ఎఫ్‌ఎస్‌బీ చీఫ్ బోర్ట్నికోవ్‌కు ర్యాట్‌క్లిఫ్ నేరుగా తన అంచనాలను వివరించినట్లు తెలుస్తోంది. అమెరికా సీఐఎ రష్యా ఎఫ్‌ఎస్‌బీతో పాటు విదేశీగూఢచారి సంస్థ ఎస్‌వీఆర్‌తోనూ కమ్యూనికేషన్ చానళ్లను కొనసాగిస్తోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న దౌత్య ప్రతినిధుల ప్రయత్నాలకు భిన్నంగా ఈ తాజా సంప్రదింపులు జరిగినటు తెలుస్తోంది. రష్యా తన యుద్ధ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్థాయిలో యుద్ధరంగంలో పురోగతి సాధించడం లేదన్న విషయాన్ని మాస్కో గుర్తించాలని ర్యాట్‌క్లిఫ్ స్పష్టం చేసారు. రష్యా సైనికుల నష్టాలపై ర్యాట్‌క్లిఫ్ చేసిన వ్యాఖ్యలు మాస్కోకు ఈ యుద్ధం మరింత ఖరీదైనదిగా మారుతోందన్న అమెరికా విస్తృత అంచనాలకు అనుగుణంగా ఉన్నాయి. రష్యాదళాల పురోగతిని అడ్డుకో వడంలో ఉక్రెయిన్ డ్రోన్ యుద్ధతంత్రం కీలక పాత్ర పోషిస్తోందని కూడా సీఐఎ డైరెక్టర్ పేర్కొన్నట్లు సమాచారం. నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రయత్నాలు మాస్కోలో ర్యాట్‌క్లిఫ్ పర్యటన పెద్దగా పురోగతి సాధించని రష్యా ఉక్రెయిన్ చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల క్రమంలో జరిగిందనే భావించాలి. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చినతర్వాత ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సహాయం తగ్గింది. దీంతో యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మరింత సహాయాన్ని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాస్కోకు వెళ్లే ముందు ర్యాట్‌క్లిఫ్ ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. రష్యా చర్చల వైఖరిని మాత్రమే పరిశీలిస్తానని, ఉక్రెయిన్ తరపున ఎలాంటి రాయితీలు ఇవ్వబోనని ఆయన వారికి హామీఇచ్చారు. ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ నిర్వహిస్తున్న సంప్రదింపులపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తం చేస్తున్న కీవ్‌కు ఈ అంశంముఖ్యమైనదే. డాన్‌బాస్ ప్రాంతంలో రష్యాదాడులు పెద్దగా ముందుకు సాగకపోవడం, అదే సమయంలో రష్యా భూభాగంలోని లోతైన ప్రాంతాల్లోని లక్ష్యాలపై డ్రోన్లతో దాడులు చేసే సామర్థ్యాన్ని ఉక్రెయిన్ కొనసాగించడం రాబోయే శీతాకాలంలో చర్చలకు అవకాశం కల్పించవచ్చని యూరోపియన్ దౌత్యవేత్తలు కూడా అంచనాలువేసారు. రష్యాపై చాలాకాలంగా విమర్శలు చేస్తున్న ఆయన గూఢచార సంస్థల మధ్య కొనసాగుతున్న మార్గాల ద్వారా అమెరికా అంచనాలను నేరుగా మాస్కోకు తెలియ జేయగలుగుతున్నారు. అమెరికా రష్యా మధ్య ఇలాంటి గూఢచారి స్థాయి సంప్రదింపులకు గతంలోనూ ఉదాహరణలు ఉన్నాయి. 2021 నవంబర్‌లోఅప్పటి సీఐఎ డైరెక్టర్ విలియం బర్న్స్ మాస్కోను సందర్శించి బోర్ట్నికోవ్‌తో పాటు పలువురు సీనియర్ రష్యా అధికారులను కలిశారు. ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అప్పట్లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను హెచ్చరించారు. ఆ తర్వాతి ఏడాది రష్యా అణు ఆయుధాలను ఉపయోగించే అవకాశంపై ఆ దేశ కమ్యూనికేషన్లను అమెరికా నిఘా సంస్థలు గుర్తించిన నేపథ్యంలో బర్న్స్ రష్యా ఇంటెలిజెన్స్ చీఫ్ సెర్గీ నారిష్కిన్‌ను టర్కీలోని అంకారాలో కలిశారు. అణ్వాయుధాలను ఉపయోగించే దిశగా మాస్కో అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖైదీల మార్పిడి విషయంలో ర్యాట్‌క్లిఫ్, బోర్ట్నికోవ్‌లు గతంలో గూఢచారి వ్యవస్థలద్వారా సంప్రదింపులు జరిపారు. మాస్కోలో జరిగిన తాజా సమావేశం వీరిద్దరి తొలి ముఖాముఖి భేటీగా తెలుస్తోంది. దౌత్య ప్రతిష్టంభనకు తెర దించేందుకు ప్రయత్నం గూఢచారి సంస్థల మధ్య ఉన్న సంప్రదింపుల మార్గాలను ఉపయోగించుకుని రష్యా, ఉక్రెయిన్ దౌత్య ప్రతిష్టంభనను తొలగించేందుకు అమెరికా మరో ప్రయత్నం చేస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. యుద్ధరంగంలో ఒత్తిడిని కొనసాగించడం ద్వారా రష్యా మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకోగలదా? లేక చర్చల ద్వారా మరిన్ని ప్రయోజనాలను సాధించగలదా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ●



జాన్ ర్యాట్‌క్లిఫ్

# ఇంజినీరింగ్ విద్యకు నాణ్యమైన పునాది అవసరం

**జీ. శ్రీలత**

దేశంలో ఇంజినీరింగ్ విద్య పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారుతోంది. ఒకప్పుడు ఇంజినీరింగ్ అంటే భవిష్యత్తుకు భరోసా, మంచి ఉద్యోగానికి మార్గం, కుటుంబానికి ఆర్థిక స్థిరత్వానికి చిహ్నంగా భావించేవారు. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థులు బీటెక్ పట్టాలు చేతబట్టుకుని బయటకు వస్తున్నప్పటికీ, వారిలో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు కలిగినవారి సంఖ్య మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 'డిగ్రీలు ఇస్తున్నామా? లేక ఇంజినీర్లను తయారు చేస్తున్నామా?' అనే ప్రశ్న ఇప్పుడు గట్టిగా వినిపించాల్సిన సమయం వచ్చింది. ఇంజినీరింగ్ కళాశాలలు కేవలం తరగతి గదులు,ఫీజుల వసూళ్లు, పరీక్షలు, హాజరు, సెమిస్టర్ ఫలితాలకే పరిమితమైతే వాటి అసలు ఉద్దేశ్యం నెరవేరదు. ఒక ఇంజనీర్ అంటే కేవలం పాఠ్యాంశాలను చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వ్యక్తి కాదు. సమస్యను గుర్తించి, దానికి సాంకేతిక పరిష్కారం కనుగొని, ఆ పరిష్కారాన్ని ఆచరణలోకి తీసుకురాగల సృజనాత్మక మేధస్సు కలిగిన వ్యక్తి. కానీ మన ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థలో ఈ దిశగా ఎంతవరకు కృషి జరుగుతోంది అన్నది సమీక్షించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం సాంకేతిక కళాశాలల్లో పటిష్టమైన గ్రంథాలయాలు, తగినన్ని పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, పరిశోధనా జర్నల్స్, డిజిటల్ వనరులు, ఆధునిక ప్రయోగశాలలు ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో అనేక ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో పరిస్థితి భిన్నంగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, భౌతిక గ్రంథాలయాలు పేరుకే ఉండటం, ప్రయోగశాలలు తగిన స్థాయిలో పనిచేయకపోవడం వంటి సమస్యలు విద్యా ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయి. నోట్స్, ఫొటోకాపీలు, డిజిటల్ పీడీఎఫ్‌లతోనే విద్యార్థుల విద్యాభ్యాసాన్ని నడిపించడం ఎంతవరకు సమంజసం? డిజిటల్ వనరులు అవసరమే. కానీ అవి పుస్తక పఠనానికి, పరిశోధనకు ప్రత్యామ్నాయం కావు. ఒక విద్యార్థి వివిధ రచయితల పుస్తకాలు చదవాలి. విభిన్న అభిప్రాయాలను తెలుసుకోవాలి. పరిశోధనా పత్రాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి.అప్పుడే ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక సామర్థ్యం, సృజనాత్మకత పెరుగుతాయి. పుస్తకాలు, పరిశోధన వాతావరణం, ప్రయోగశాలలు లేని ఇంజనీరింగ్ విద్య కేవలం డిగ్రీలను ఇవ్వగలదేమో కానీ ఆవిష్కర్తలను తయారు చేయగలదా? అన్న ప్రశ్నకు విద్యా వ్యవస్థ సమాధానం చెప్పాలి. జర్మనీ, ఫిన్లాండ్, అమెరికా తదితర దేశాల్లో ఇంజనీరింగ్ విద్యలో ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థి కేవలం పుస్తకంలోని సిద్ధాంతాన్ని చదివి పరీక్ష రాయడం మాత్రమే కాకుండా, ఆ సిద్ధాంతాన్ని వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్చుకుంటాడు.అక్కడి అనేక సాంకేతిక విద్యా సంస్థలు సీడీఐఓ కాన్సీవ్, డిజైన్, ఇంప్లిమెంట్, ఆపరేట్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అంటే ఒక సమస్యను ఊహించడం నుంచి పరిష్కారాన్ని రూపొందించడం,అమలు చేయడం,ఆ తర్వాత దానిని పనిచేసే స్థాయికి తీసుకు రావడం వరకు విద్యార్థి స్వయంగా అనుభవిస్తాడు. ఇదేవిధానం మన దేశంలో కూడా విస్తృతంగా అమలుకావాలి. ఉదాహరణకు ఒక గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే విద్యార్థులు దానికి తక్కువ ఖర్చుతో నీటి శుద్ధివ్యవస్థ రూపొందించాలి. వ్యవసాయంలో నీటివృథాను తగ్గించే సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేయాలి. ట్రాఫిక్ సమస్యకు కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారం రూపొందించాలి. ప్రభుత్వ పాఠశాలలకు తక్కువ ఖర్చుతో డిజిటల్ విద్యా పరికరాలను అభివృద్ధి చేయాలి. ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థులను కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా సమస్య పరిష్కారకులుగా, ఆవిష్కర్తలుగా, భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దగలవు. మన దేశంలో మరో ప్రధాన సమస్య పరిశ్రమకు, కళాశాలలకు మధ్య ఉన్న అంతరం. కళాశాలలో బోధించే సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల్లో వాస్తవంగా ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం మధ్య తేడా ఉండటం వల్ల విద్యార్థులు పట్టా పొందిన తర్వాత మళ్లీ శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఇంజినీరింగ్ కళాశాల కనీసం కొన్ని పరిశ్రమలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ సందర్శనలు, ప్రత్యక్ష ప్రాజెక్టులు, నిపుణుల ఉపన్యాసాలు, పరిశోధనా అవకాశాలు కల్పించాలి. చివరి సంవత్సరం ప్రాజెక్ట్ అనేది కేవలం మార్కుల కోసం తయారు చేసే నివేదికగా కాకుండా, వాస్తవ పరిశ్రమ లేదా సామాజిక సమస్యకు పరిష్కారంగా ఉండాలి. అలా జరిగితే కళాశాలల్లోనే స్టార్టప్‌లకు బీజం పడుతుంది. విద్యార్థుల పరిశోధనలు పేటెంట్లుగా మారవచ్చు. వారి ప్రాజెక్టులు వ్యాపార ఉత్పత్తులుగా మారవచ్చు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజినీరింగ్ విద్య నేరుగా దోహదపడే అవకాశం ఏర్పడుతుంది. ఇంజినీరింగ్ విద్యలో హాజరు నిబంధనపై కూడా కొత్తగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. విద్యార్థి నిర్దిష్ట శాతం తరగతులకు హాజరు కావాలనే నిబంధనకు విద్యా పరంగా కారణాలు ఉన్నాయి. ప్రయోగశాలలు, ప్రత్యక్ష బోధన, బృంద కార్యకలాపాలు, అధ్యాపకులతో పరస్పర చర్చ వంటి అంశాలకు భౌతిక హాజరు అవసరం ఉంటుంది. అయితే హాజరును మాత్రమే విద్యార్థి సామర్థ్యానికి కొలమానంగా చూడటం మాత్రం సమంజసం కాదు. ఒక విద్యార్థి తరగతిలో కూర్చున్న గంటల సంఖ్య కంటే అతను నేర్చుకున్నది ఏమిటి? ఏ ప్రాజెక్ట్ చేశాడు? ఏ సమస్యను పరిష్కరించాడు? ఎలాంటి పరిశోధన చేశాడు? ఏ నైపుణ్యం సంపాదించాడు? అన్నది ముఖ్యమవ్వాలి. ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ ల్యాబ్‌లు, ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఓపెన్ కోర్సులు అందుబాటులో ఉన్న ఈ డిజిటల్ యుగంలో విద్యార్థి అభ్యాసాన్ని మరింత సమగ్రంగా అంచనా వేయాలి. హాజరుతో పాటు ప్రాజెక్ట్, అసైన్‌మెంట్, పరిశోధన, ప్రెజెంటేషన్, ఇంటర్న్‌షిప్, నైపుణ్య పరీక్షలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే దీనిని హాజరు పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌గా చూడకూడదు. హాజరు,అభ్యాస ఫలితాలు, ప్రాజెక్టులు, నైపుణ్యాలు అనే సమగ్ర విధానం అవసరం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యలో భారీ స్థాయిలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులపై విద్యార్థుల్లో విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. అదే సమయంలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సుల్లో మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలను పునర్‌వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉంది. ఇంజినీరింగ్ సీట్లసంఖ్యపెంచడం మాత్రమే పరిష్కారం కాదు. నాణ్యత పెంచడం అసలు పరిష్కారం. కళాశాలలు ఎక్కువగా ఉండటం కంటే నాణ్యమైన ఇంజినీర్లను తయారు చేసే కళాశాలలు ఎక్కువగా ఉండాలి. ఉద్యోగావకాశాల విషయంలో కూడా గణాంకాలు మనల్ని ఆలోచింపజేస్తున్నాయి. వివిధ నైపుణ్య, ఉపాధి నివేదికలు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో ఒక వర్గం మాత్రమే పరిశ్రమకు తక్షణం సిద్ధంగా ఉంటోందని సూచిస్తున్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఒక విషయం, పరిశ్రమలో పనిచేయడానికి అవసరమైన ప్రోగ్రామింగ్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, బృందపని, ప్రాజెక్ట్ నిర్వహణ, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలు కలిగి ఉండటం మరో విషయం. ఇక్కడే మన విద్యావ్యవస్థలోని అసలు లోపం బయటపడుతోంది. ఒక విద్యార్థిని ఇంజనీరింగ్‌లో చేర్పించేందుకు మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులు,హాస్టల్ ఫీజులు, రవాణా ఖర్చులు, పుస్తకాలు, ఇతర విద్యాఖర్చులు భరించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేసే పరిస్థితి కూడా ఉంటుంది. అంత ఖర్చు చేసి చదివించిన తర్వాత విద్యార్థి చేతిలో కేవలం ఒక డిగ్రీ, ఒక మార్కుల పట్టిక మాత్రమే మిగిలితే అది కుటుంబానికి మాత్రమేకాదు, దేశానికి కూడా నష్టం.కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు కలిసి ఇంజినీరింగ్ విద్యపై సమగ్ర సమీక్ష నిర్వహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు,విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు మేల్కొనాలి. పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారుతున్న ఇంజినీరింగ్‌విద్యకు నాణ్యత అనేపునాది వేయాలి. అప్పుడే తల్లిదండ్రుల కలలు నెరవేరతాయి.



గుంటూరు వార్త

# నేడు నీట్ పీజీ పరీక్ష

## అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించిన డిఆర్ఓ

**గుంటూరు విద్య, ఆగస్టు 29, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లాలో నీట్ పీజీ -2026 పరీక్ష ఆదివారం గుంటూరులోని ఆరు పరీక్ష కేంద్రాల్లో జరగనున్నది. ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అన్నారు. నీట్ పరీక్షలకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షకు అభ్యర్థులు ఆరు కేంద్రాల్లో హాజరుకానున్నారని చెప్పారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారని, అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు ఉదయం 7.00 గంటల నుండి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పేరేచర్ల యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలోనూ, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కళ్ళం హరనాద్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, చేబ్రోలు ఆర్. వి ఇంజనీరింగ్ కళాశాల, బుడంపాడు సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరగనున్నది. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. మినిమమ్ స్పై కెమెరాలు, కెమెరా కలిగిన కళ్లజోడు, ఇయర్‌ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు, బిట్స్, నోట్స్, పేపర్లు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్ పరీక్షల సమగ్రత, గోప్యతను కాపాడేందుకు సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షా కేంద్రాలకు సమీపంలోని సైబర్ పోలీస్ స్టేషన్ల ద్వారా సైబర్ ముప్పులను పర్యవేక్షించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందుగానే నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు, ప్రవేశ ద్వారాలు, పరీక్షా గదులు, టేబుళ్లు, కుర్చీలు, మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు, నీటి ప్రదేశాలు, పరికరాలు, లిఫ్టులు తదితర ప్రాంతాలను పూర్తిగా శానిటైజ్ చేయాలని సూచించారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునేలా అవసరమైన మేరకు నడపాలని, పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు తిరుగు ప్రయాణానికి కూడా తగిన బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వైద్య అత్యవసర సేవలతో పాటు తగిన సంఖ్యలో ఏ ఎన్ ఎం లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు భంగం కలగకుండా భారతీయ నాగరిక సురక్షా సంహిత, 2023లోని సెక్షన్ 163ను అమలు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలు, నెట్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ ( లాన్) సక్రమంగా ఉండేలా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు ముందుస్తు ఏర్పాట్లు చేయాలని, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

# సాగర్ కుడి కాలువ ద్వారా తాగునీరు విడుదల

## - చెరువులు, కుంటలకు నీటిని నింపుకోవాలి నీటి నిల్వలతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం

**కారంపూడి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా త్రాగునీటిని జల వనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. నీరు విడుదలతో పల్నాడు, బాపట్ల, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం జిల్లాలలో త్రాగునీరు అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. నీటిని తాగునీటి అవసరాల కోసమే వినియోగించు కోవాలని అధికారులు కోరారు. త్రాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని పొలాలకు మళ్ళిస్తే జల వనరుల శాఖ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కృష్ణా బోర్డు ఆదేశాల మేరకు 8 టీఎంసీల నీరు విడుదల చేశారు. ఐదు జిల్లాలలో ఉన్న 442 చెరువులు, 33 08 కుంటలు నీటితో నింపుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సాగర్ కుడికాలపై ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 137 కిలోమీటర్ల మేర 24 గంటల పాటు గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్,, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్,, జలవనరుల శాఖ నిరంతరం తనిఖీలు చేపట్టి చివరి వరకు త్రాగునీరు అందే విధంగా చూడాలని కోరారు.తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెరువులు, కుంటలకు మీటింగ్ నింపడం వలన భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. త్రాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులను గుర్తించి, వీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే మండలంలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతూ,బోర్లలో నీళ్ల రాక అవస్థలు పడుతున్నారు. సాగర్ జలాలతో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది.



# తప్పు పై గర్జించే వ్యక్తి వర్ల రామయ్య : గళ్ళా మాధవి

**గుంటూరు, ఆగస్టు 29,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీలో దశాబ్దాలుగా నిబద్ధతతో పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగిన సీనియర్ నాయకులు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీ వర్ల రామయ్య శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆత్మీయ అభినందన సభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని, ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్యను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ వర్ల రామయ్య రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడటానికి తన వయస్సు, అనుభవం రెండూ సరిపోవని, తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఆయన వీరవిధేయుడిగా నిలిచారని కొనియాడారు.




మైక్ ముందు ప్రత్యర్థుల తప్పులను నిర్భయంగా ఎండగడుతూ, తన వాణితో రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించే సింహగర్జనగా వర్ల రామయ్య పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

శాసనమండలిలోకి ఆయన అడుగుపెట్టడం పార్టీకి మరింత బలాన్నిస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గతంలో శాసనమండలి పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేసిన వర్ల రామయ్య, ఇప్పుడు అదే సభలో ప్రజల గొంతుకగా నిలబడి ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని ఆకాంక్షించారు. తన వాణితో వైసీపీ నాయకత్వానికి నిజమైన వణుకు పుట్టించేలా ప్రజా ప్రయోజనాల కోసం గళం విప్పాలని కోరారు.యువ నాయకులను ప్రోత్సహించడం, వారికి రాజకీయ దిశానిర్దేశం చేయడం వర్ల రామయ్య ప్రత్యేకత అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రాజకీయాల్లో కొత్తగా ఎదుగుతున్న నాయకులను ఆప్యాయంగా ఆహ్వానిస్తూ, వారికి మార్గనిర్దేశం చేసే గొప్ప నాయకుల్లో వర్ల రామయ్య ముందు వరుసలో ఉంటారని అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో కూడా ఆయన నుంచి ఎన్నో సూచనలు, సలహాలు పొందినట్లు గుర్తు చేసుకున్నారు.పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా పలుమార్లు ఒకే వేదికను పంచుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలిపారు. వర్ల రామయ్య గారు తన అనుభవం, రాజకీయ పరిజ్ఞానంతో పార్టీ శ్రేణులను మరింత బలోపేతం చేస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# శ్రావ్యంగా దీవి రవికాంత్ గాత్ర సంగీత కచేరీ

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 29,ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం శ్రీత్యాగరాజ కళావేదికపై కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో నెలవారి కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులు దీవి రవికాంత్,హైదరాబాద్ గాత్ర సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది.వీరికి వయోలిన్ పై షణ్ముఖ శ్రీవత్స, మృదంగంపై బీరక సురేష్‌బాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కచేరిని రేవగుప్తి రాగంలో గోపాలక పాహి,ఆందోళికా రాగంలో రాగ సుధారస



వంటి అనేక వాగ్గేయకార కృతులను ఆలాపించి సంగీతాభిమానులను అలరించారు.సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ కళాకారులను సత్కరించారు.

# ఘనంగా తెలుగు భాష,క్రీడా దినోత్సవాలు

**గుంటూరు విద్య ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలుగు భాషా మరియు క్రీడ దినోత్సవాలు స్థానిక ఎన్.జి.జిఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, మరియు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి



సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణ, సాంప్రదాయ వస్త్ర ధారణలో అలరించారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విధ్యార్థులకు బహుమతులు అందించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విదార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుమన్నాయి.

# ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్3 పనులను వేగంగా పూర్తి చేస్తాం

## శిల్పారామం-పెదపలకలూరు వరకు 4.25 కి.మీ రహదారికి రూ.48 కోట్లతో పనులు

## ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 పనుల పరిశీలనలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 29,ప్రభాతవార్త :**

గుంటూరు నగర కార్పొరేషన్ పరిధిలోని మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను వేగంగా పూర్తి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నగర పరిధిలోని శిల్పారామం పెదపలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 రహదారి అభివృద్ధి పనులను మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్, పబ్లిక్ హెల్త్, జిఎంసి, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పనుల పురోగతిని



శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ:.. శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ - 3 పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టును గతంలోనే ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్లను రిహాబిలిటేట్ చేసి, సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ పనులకు రూ.48 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పనుల్లో ఎదురవుతున్న సమస్యల పై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు. రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో హైట్ పెరగడంతో హై టెన్షన్ వైర్లను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా సుమారు రూ. 2 3 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అదేవిధంగా విళీశి ద్ద్వు క్రాసింగ్స్ వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10 నుంచి 15 లక్షల అదనపు వ్యయం అవుతుందని తెలిపారు.భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రస్తుత ప్రాజెక్టులోనే వీలైనంత వరకు ఈ అదనపు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన..**

ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్‌ను భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని పెమ్మసాని తెలిపారు. ఈ విస్తరణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్ ద్వారా నేరుగా అమరావతికి మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15 నుంచి 20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రి కి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే ఈ అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించలేదన్నారు . రహదారికి అవసరమైన డ్రైనేజ్ కవర్లు, సెంటర్ లైటింగ్ వంటి అదనపు సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పూర్తయిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో అభివృద్ధి కార్యకలాపాలు మరింత పెరిగితే గుంటూరు కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు దిళిదీతి ద్వారా కూడా మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

# డిఎస్సీ విజేతలకు కూటమి ప్రభుత్వమే రక్షణ కవచం : మంత్రి అనగాని

**రేపల్లె, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాజకీయ లబ్ధి కోసం కష్టపడి ఉద్యోగాలు సాధించిన నిరుపేద ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని వైకాపా నేతలు అసత్యప్రచారంతో దెబ్బతీస్తున్నారని డిఎస్సీ విజేతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.మెగా డిఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో శనివారం రేపల్లెలోని డిఎస్సీ విజేతలు సుధీర్,ఫాసియా బేగం,లావణ్య,నవ్య తదితరుల నివాసాలను మంత్రి అనగాని సత్యప్రసాద్ సందర్శించారు.డిఎస్సీ విజేతల కృషిని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డిఎస్సీపై ఆందోళన తగదని చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ప్రకారం 16347 ఉద్యోగాలతో మెగా డిఎస్సీపై తొలి సంతకం చేశారని గుర్తు చేశారు.కేవలం 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని చెప్పారు.కేవలం రూ.750 దరఖాస్తు ఫీజు మినహా ఎటువంటి ఖర్చు లేకుండా అవినీతికి తావులేకుండా అర్హత ఆధారంగానే డిఎస్సీ నియామకాలు పూర్తి చేయడం జరిగిందని ఆయన వివరించారు.మెగా డిఎస్సీని అడ్డుకోవడానికి వైకాపా నేతలు 300కు పైగా కోర్టు కేసులు వేసినప్పటికీ న్యాయపోరాటం చేసి అభ్యర్థులకు ఉద్యోగాలు అందించామని సత్యప్రసాద్ పేర్కొన్నారు.సమాజానికి మార్గదర్శకులుగా నిలవాల్సిన ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు అరాచక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు.ఉద్యోగాలు సాధించినవారిలో 90 శాతానికి పైగా ఆటో,లారీ డ్రైవర్లు,పేద,మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే ఉన్నారని ఆయన తెలిపారు.వ్యక్తిగత ప్రతిభతో ఉద్యోగం సాధిస్తే డబ్బులిచ్చి కొనుక్కున్నారనే ప్రచారం తగదని అనగాని హితవుపలికారు.వైకాపా నేతల అసహ్యకర రాజకీయాలకు నిదర్శనమని ఆయన ఆ గ్రహం వ్యక్తం చేశారు.సిఎం నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రక్షణ కవచంలా డిఎస్సీ విజేతలను కాపాడుకుంటారని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయనే విమర్శలు అర్థరహితమన్నారు.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీచేయడం జరిగిందని చెప్పారు.బాధితులు ఎవరైనా ఉంటే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.ప్రభుత్వం పూర్తిస్థాయిలో పారదర్శకంగా రెస్పాన్స్ షీట్లు,గ్రీవెన్స్ అవకాశాలు కల్పించి నియామకాలు చేపట్టిందని వివరించారు.ఏటా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సత్యప్రసాద్ ప్రకటించారు.









**ప్రతిభతోనే ఉద్యోగం-ఫాసియా బేగం**

ప్రతిభను నమ్ముకుని ప్రతి కూలతలను జయించి మెగా డిఎస్సీలో బాపట్ల జిల్లాలోనే ప్రథమ ర్యాంక్ సాధించి చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొందడం సంతృప్తినిచ్చిందని రేపల్లెకు చెందిన ఫాసియా బేగం వెల్లడించారు.2018 డిఎస్సీలో కేవలం 0.93 మార్కులతో ఉద్యోగం కోల్పోయానని,గత వైకాపా హయాంలో 5 సంవత్సరాలు డిఎస్సీ నోటిఫికేషన్ వెలువడకపోయినా చంద్రబాబు రాగానే డిఎస్సీ నోటిఫికేషన్ వస్తుందనే విశ్వాసంతో 9 నెలల పసిపాపను చూసుకుంటూ కష్టపడి చదివి రూ.750 అప్లికేషన్ ఫీజు మాత్రమే చెల్లించి ఉద్యోగం సాధించానని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వివరించారు.

**పారదర్శకంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్-సుధీర్**

డిఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పారదర్శకంగా జరిగిందని డిఎస్సీ విజేత సుధీర్ చెప్పారు.12 సంవత్సరాలుగా శ్రమిస్తుంటే కూటమి పాలనలో తగిన ప్రతిఫలం లభించిందని తెలిపారు.ఉద్యోగాలపై రాజకీయంగా బురదచల్లడం సరికాదన్నారు.2018 డిఎస్సీలోనే పిఇటి,పిడి అభ్యర్థులకు పారదర్శకంగా ఈవెంట్స్ నిర్వహించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.రేపల్లెకు చెందిన నవ్య,లావణ్యలు మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద తమ అభిప్రాయాలను వెలుబుచ్చారు.

# మాతృభాష తెలుగును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపీ భాష్యం రామకృష్ణ

**గుంటూరు విద్య, ఆగస్టు 29 ప్రభాతవార్త :** మన తెలుగు మాతృభాషను ప్రేమించాలి, మాట్లాడాలి, చదవాలి. దాని గొప్పదనాన్ని భావితరాలకు అందిస్తూ తెలుగు మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" రాజ్యసభ సభ్యులు, భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం



రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంటూరు చంద్రమోళి నగర్ మూడో లైన్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్ సమీపంలోని గ్రౌండ్‌లో "తెలుగు మహోత్సవం" అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని ఒక్కరోజు వేడుకగా మాత్రమే పరిమితం చేయకుండా, తెలుగు లెక్సికాన్, గ్రంథోత్సవం, భాష్యవాణి ద్వారా భగవద్గీత శ్లోకాల అభ్యాసం వంటి కార్యక్రమాలతో మాతృభాష, సంస్కృతి, విలువలను నిరంతరం విద్యార్థులకు అందించాలని ఆయన పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని భాష్యం విద్యాసంస్థల అన్ని శాఖలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని తమ ప్రదర్శనల ద్వారా ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోజంతా సాగిన ఈ మహోత్సవంలో తెలుగుతల్లి, గిడుగు వెంకట రామమూర్తి, శ్రీకృష్ణదేవరాయలు, తెనాలి రామకృష్ణుడు, రైతు తదితర పాత్రల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు నీతి పద్యాలు, పొడుపు కథలు, తెలుగు గేయాలు, భగవద్గీత శ్లోకాలు, హరికథలు, బుర్రకథలు, చందమామ కథలు, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయాలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. కూచిపూడి, కోలాటం, జానపద, సంప్రదాయ నృత్యాలు తెలుగు సంస్కృతీ వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించాయి. తెలుగు మహోత్సవంలో ఏర్పాటు చేసిన "గ్రంథోత్సవం" తెలుగు సాహిత్య సంపదకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. పెద్ద బాలశిక్ష, భగవద్గీత, రామాయణం, చందమామ కథలు, ప్రముఖ తెలుగు కవులు-రచయితల రచనలు, పురాణాలు, ఇతిహాసాలు, నీతి కథలు, బాలసాహిత్యం, విజ్ఞాన గ్రంథాలు సహా ఎన్నో అద్భుత పుస్తకాలను విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని భాష్యం విద్యాసంస్థలు మరో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. విద్యార్థుల్లో తెలుగు పదసంపదను పెంపొందించడం, కొత్త పదాలను పరిచయం చేయడం, మాతృభాషపై ఆసక్తి-అభిమానాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా భాష్యం విద్యాసంస్థలకు చెందిన 180 శాఖల్లో శాఖా స్థాయిలో "తెలుగు లెక్సికాన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు పదాల అర్థం, ప్రయోగం, భాషా మాధుర్యాన్ని విద్యార్థులకు చేరువ చేసే నిరంతర కార్యక్రమంగా దీనిని కొనసాగించనున్నారు. అదేవిధంగా భాష్యం స్కూల్ రేడియో "భాష్యవాణి" ద్వారా విద్యార్థుల్లో విలువలు, సంస్కారం, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించే మరో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఒక భగవద్గీత శ్లోకాన్ని, దాని అర్థాన్ని, విద్యార్థి జీవితానికి దాని అన్వయాన్ని భాష్యవాణి ద్వారా పరిచయం చేయనున్నారు. ఈ మహోత్సవంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ హనుమంతరావు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు.


**కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్**
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా-520008.

**స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)
(అపెండిక్స్ IV SARFAESI చట్టం నందలి రూల్-8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54/2002) ప్రకారం **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, తక్కెళ్లపాడు బ్రాంచ్, తక్కెళ్లపాడు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్షన్ 13(2) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన **(కోస్టల్ ఈజీ లోన్ టర్మ్ లోన్ అకౌంట్ నెం. 96009459020)** క్రింద **తేది 16.06.2026** నాటికి బకాయి **రూ. 3,55,372/- (అక్షరాల మూడు లక్షల యాభై ఐదు వేల మూడు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలుపుకుని మొత్తమును చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత: శ్రీ ఆత్మకూరి తిమోతి రాజు, తండ్రి: ఎ. ప్రసాద్ రావు,** డి.నెం. 256/1D, వట్టిచెరుకూరు - 522212, గుంటూరు జిల్లా., ఎ.పి., మరియు **సహ-ఋణగ్రహీత: శ్రీమతి ఆత్మకూరి సత్యమణి, భర్త: ఎ. తిమోతి రాజు,** డి.నెం. 256/1D, వట్టిచెరుకూరు - 522212, గుంటూరు జిల్లా., ఎ.పి., మరియు **హామీదారు: శ్రీ బొప్పరాజు కొండల రావు, తండ్రి: బి. కాశి,** డి.నెం. 4-148, వట్టిచెరుకూరు-522212, గుంటూరు జిల్లా, ఎ.పి., వారిని కోరుతూ **తేది.16-06-2026** న **డిమాండ్ నోటీసును** జారీచేయడమైనది.

సదరు ఋణగ్రహీత డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 చట్టంలోని సెక్షన్ 13, సబ్-సెక్షన్(4) కు అనుబంధమైన రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని **24.08.2026** తేదిన **స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత/హామీదారు, ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సర్ఫేసీ చట్టం సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తుల ను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు. ముఖ్యంగా ఋణగ్రహీత / హామీదారులు మరియు ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా బకాయి **తేది 16.06.2026** నాటికి బకాయి **రూ. 3,55,372/- (అక్షరాల మూడు లక్షల యాభై ఐదు వేల మూడు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు మొదలగునవి **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, తక్కెళ్లపాడు బ్రాంచ్, తక్కెళ్లపాడు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. ఒకవేళ డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత జమలు ఉన్నట్లయితే అవి సర్దుబాటు చేయబడును.

**స్థిరాస్తి వివరములు:**

గుంటూరు యస్ఆర్ఓ., గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఏటుకూరు గ్రామం, బొంతపాడు, అసెస్‌మెంట్ నెం. 1021190815; డి.నెం. 309/C; రెవెన్యూ వార్డ్ నెం. 60, ప్లాట్ నెం. 29 మరియు 30 నందు 185.80 చ॥గ॥లు (డాక్యుమెంట్ ప్రకారం 185.80 చ॥గ॥లు) ఖాళీ స్థలం శ్రీమతి ఆత్మకూరి సత్యమణి, భర్త: ఆత్మకూరి తిమోతి రాజు పేరున కలదు. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 30లో కొంత భాగం - 50.2 అ॥లు, **దక్షిణం:** బొగ్గుల కొండయ్య యొక్క ఆస్తి - 33.4 అ॥లు, **పడమర:** ప్లాట్ నెం. 28లో స్థలం - 50.2 అ॥లు, **ఉత్తరం:** విక్రేతలు వదిలిన 20 అ॥ల వెడల్పు రోడ్డు - 33.4 అ॥లు.
**గుంటూరు జె.యస్.ఆర్.ఒ., రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 13745/2014, తేది. 10.10.2014 ప్రకారం శ్రీమతి ఆత్మకూరి సత్యమణి, భర్త: ఎ. తిమోతి రాజు పేరున గల ఆస్తి.**

తేది : 24-08-2026
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి,
కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

30PLD 6ff.qxd:30PLD 6.qxd 01/01/2001 10:06 Page 1



# ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకోవాలి

**పోలింగ్ బూత్‌లను పరిశీలించిన జిల్లా రెవెన్యూ అధికారి, ఈఆర్వో కె.అద్దయ్య**



**మాచర్ల టౌన్ ఆగష్టు 29 ప్రభాతవార్త:**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి, 101మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్వో కె.అద్దయ్య అధికారులకు సూచించారు. శనివారం మాచర్ల పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్లు 62,64,100,102, 103,104 తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాల నిర్వహణపై బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆగష్టు 29,30 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల్లో ఫారం6, ఫారం7, ఫారం8 తదితర దరఖాస్తులను సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద స్వీకరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, విచారణలను (హియరింగ్స్) సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్‌ఓలు, తహశీల్దార్లతో జిల్లా రెవెన్యూ అధికారి కె.అద్దయ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ షెడ్యూల్, హియరింగ్స్ నిర్వహణ, వాటిని అమలు చేయాల్సిన విధానం, పెండింగ్‌లో ఉన్న ఫారం6, 7, 8 దరఖాస్తులపై చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కె.అద్దయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.కిరణ్ కుమార్, మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మున్సిపల్ సిబ్బంది, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

**ప్రధాన కూడళ్లలో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు**
**సోషల్ మీడియా గొలుసుకట్టు యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**టౌన్ సీఐ షేక్ నజీర్ బేకింగ్**



**మాచర్ల టౌన్ ఆగష్టు 29 ప్రభాతవార్త:**పట్టణ ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా మాచర్ల పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ద్విచక్ర వాహనాల చోరీలు, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రధాన కూడళ్లలో నిరంతరం నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వివిధ రకాల గొలుసుకట్టు స్కీమ్‌లు, యాప్‌ల విషయంలో యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తొలుత యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టి లేదా కొన్ని కార్యకలాపాలు నిర్వహించిన తర్వాత కొంత నగదు తిరిగి వచ్చినట్లు చూపించి ప్రజలను ఆకర్షిస్తారని, అనంతరం మరింత డబ్బు పెట్టుబడి పెట్టేలా ప్రలోభాలకు గురిచేసి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి యాప్‌లను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు తదితరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకులు, యాప్‌లు, అధిక లాభాల హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ఆగనున్న ఉద్యోగుల బండి



**పిడుగురాళ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త :** పిడుగురాళ్ల పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల రైలు బండి సెప్టెంబరు 4వ తేదీన పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో నిలిపేందుకు సర్వం సిద్ధమైంది. ఉద్యోగులు, స్థానిక ప్రజల సౌకర్యార్థం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన కృషి ఫలితంగా ఇది సాధ్యమైనట్లు రైల్వే బోర్డు సభ్యులు కొంకా రాధా చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణ రైల్వేస్టేషన్‌కు కావాల్సిన మౌలిక సదుపాయాలతోపాటు మరికొన్ని రైళ్లు నిలుపుదలకు శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కృషి చేశారన్నారు. విజయవాడ లింగంపల్లి రైలు రాత్రి 7:08 గంటలకు, లింగంపల్లి - విజయవాడ రైలు ఉదయం 8:06 గంటలకు పిడుగురాళ్ల స్టేషన్లో నిమిషం పాటు ఆగనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## నందమూరి హరికృష్ణకు నివాళి



**పిడుగురాళ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త :** సినీనటుడు, నిర్మాత, రాజకీయ నేత నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రత్తయ్యను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాల్లో సుపరిచితులైన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ మాకినేని పెద రత్తయ్యను శనివారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడమే గాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు అత్యంత విధేయుడగా రత్తయ్య గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో నీటి పారుదల శాఖా మంత్రిగా సేవలందించారు. గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షునిగా కూని పనిచేశారు. 1982 నుంచి చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఎమ్మెల్యే యరపతినేని చర్చించారు. పార్టీ వ్యవహారాలు, ప్రజాసేవలో ఆయనకున్న సుధీర్ఘ అనుభవాలను తెలుసుకున్నారు. పెద్ద రత్తయ్య అనుభవం, సలహాలు, మార్గదర్శకాలు ప్రజాసేవలో ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు.

## తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలి

**మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్**



**మాచర్ల టౌన్ ఆగష్టు 29 ప్రభాతవార్త:**తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ పిలుపునిచ్చారు. మాతృభాష తెలుగు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. మాచర్ల పట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో శనివారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్ల భాషపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు మాతృభాష తెలుగును కూడా గౌరవించి, పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు ఎందరో కవులు, రచయితలు తెలుగు భాషా సాహిత్యానికి విశేష సేవలు అందించారని తెలిపారు. నన్నయ్య, శ్రీశ్రీ, గురజాడ అప్పారావు, గుర్రం జాషువా వంటి మహనీయులు తమ రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేశారని పేర్కొన్నారు. ప్రముఖ కవులు, రచయితలు చేసిన కృషి కారణంగానే తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా కొనియాడుతున్నారని తెలిపారు. మాతృభాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. పరభాషలపై అవగాహన పెంచుకోవడం అవసరమే అయినప్పటికీ, అమ్మలాంటి మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డొక్కా మాణిక్య వర ప్రసాద్ అన్నారు. కార్యక్రమానికి ముందు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రిటైర్డ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బండారు సుబ్బారావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కనకదుర్గా రెడ్డి, రిటైర్డ్ ఎంఈవో వేముల నాగయ్య, అధ్యాపకులు కేలం ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మోదుగుల వారి వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**ముప్పాళ్ల ఆగస్టు 29 ప్రభాత వార్త:**ఎస్ ఎన్ ఆర్ గార్డెన్స్ నరసరావపేట నందు ముప్పాళ్ళ మండలం పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన మోదుగుల శ్రీనివాసరావు శ్రీదేవి కుమారుడు మౌర్య వంశీ గారి వివాహ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ..డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి.. గారి తండ్రి ..డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ప్రత్యేక అలంకరణ



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** ఈరోజు ఉదయం 11:00 గంటలకు శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, 98సత్తెనపల్లి నియోజకవర్గం మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి వారి అధ్యక్షతన పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు, అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ప్రస్తుతం శీ.ఐలో గుర్తించిన అనామలీస్, అన్‌మ్యాపింగ్ ఓటర్ల వివరాలతో నోటీసులు జనరేట్ చేయబడి, వారికి షెడ్యూల్ ప్రకారం తినిళివీల ద్వారా హియరింగ్ జరుగుతున్నదని తెలిపారు. కావున సదరు నోటీసు పీరియడ్ షెడ్యూల్ ప్రకారం ప్రతి నోటీసు అందుకున్న ఓటర్లు హాజరవ్వాల్సిందిగా, సదరు విధంగా అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులు సహకరించి, వారి ద్వారా కూడా నోటీసులు అందుకున్న ఓటర్లు హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈరోజు మరియు రేపు స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా ప్రతి తీలీవీ పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండి ఓటర్ల సమస్యలు, అనుమానాలను నివృత్తి చేస్తారని తెలియజేశారు.

## ఓటమి భయంతోనే పోలింగ్ బూతుల మార్పు, ఓటర్ల జంబ్లింగ్

**గోపిరెడ్డి**



**నరసరావుపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కూటమి ప్రభుత్వం రొంపిచర్ల మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూతులను మార్చడంతో పాటు ఓటర్ల జాబితాలో జంబ్లింగ్‌కు పాల్పడుతోందని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పోలింగ్ బూతుల మార్పు, ఓటర్ల జాబితా జంబ్లింగ్ వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రొంపిచర్ల మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, వీరవట్నం, ఎడ్లపాడు గ్రామాల్లో పోలింగ్ బూతుల మార్పులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆయా గ్రామాల వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి డీపీఓను కలిసిన అనంతరం గోపిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23వ ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో పోలింగ్ బూతుల వివరాలను ప్రచురించిన అధికారులు, కేవలం ఐదు రోజుల వ్యవధిలో ఈ నెల 28న నాలుగు గ్రామాల్లో పోలింగ్ బూతులను మార్చారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే ఈ మార్పులు జరిగాయని, ప్రతిపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించకుండా, వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. రొంపిచర్లలో 850 మంది ఓటర్లను తరలించారంటూ ఆరోపణ రొంపిచర్ల గ్రామంలోని నాలుగు వార్డులకు సంబంధించిన పోలింగ్ బూతులను పడమట పాలెం పోలింగ్ బూత్‌కు మార్చారని గోపిరెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సుమారు 850 మంది ఓటర్లను సుమారు 440 మంది ఓటర్లకు ఉన్న పడమటిపాలెం పోలింగ్ బూత్‌కు తరలించారని ఆరోపించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలిసిన తగుడిపాడులోని ఏడు వార్డుల పోలింగ్ బూతులను మండల ఎలిమెంటరీ స్కూల్ నుంచి జిల్లా పరిషత్ పాఠశాలకు మార్చారన్నారు. వీరవట్నంలో ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు సంబంధించిన ఏడు వార్డుల పోలింగ్ బూతులను ఇతర వర్గాల ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాలకు మార్చారని, ఎడ్లపాడులో నాలుగు వార్డులకు సంబంధించిన పోలింగ్ బూతులను టీడీపీ వర్గీయులు నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేశారని ఆరోపించారు. కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ ఓటర్లను వివిధ వార్డులకు తరలించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల జాబితాలో మార్పులు చేయడం సరికాదని గోపిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, వాసులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్లు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**చిరుమామిళ్ల లక్ష్మీనారాయణమ్మ రంగారావు**



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వెంకటేశ్వర విద్యానికేతన్ డైరెక్టర్ చిరుమామిళ్ల లక్ష్మీనారాయణమ్మ రంగారావు అన్నారు. శనివారం సత్తెనపల్లి పట్టణంలోని వేద నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణమ్మ రంగారావు మాట్లాడుతూ పట్టభద్రులకు సమాజంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. కళాశాల చైర్మన్ చింతాడ రమేష్ మాట్లాడుతూ 1994 నుంచి 32 సంవత్సరాలుగా వేద విద్యాసంస్థలు వేలాది మంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనతను సొంతం చేసుకున్నాయని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ సచివాలయాలు, ప్రభుత్వ వైద్యశాలలు, కార్పొరేట్ రంగాల్లో వందలాది మంది వేద విద్యార్థులు నర్సింగ్, పారామెడికల్ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. తమపై నమ్మకంతో మూడు దశాబ్దాలకు పైగా విద్యాసంస్థలను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నర్సింగ్, పారామెడికల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల మహిళా డైరెక్టర్ శ్రీమతి చింతాడ ప్రభావతి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వేద విద్యాసంస్థల ప్రిన్సిపాల్లు మామిడి మాలతి, సీహెచ్ సైదానాయక్, ఆర్. కోటేశ్వరరావు, సింధూష, సృజన, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** ప్రధా నమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి పంటకు ఎకరాకు రూ.40,000 బీమా పరిహారం అందేలా రైతులు తమ వాటాగా రూ.80లను ఆగస్టు 31వ తేదీలోగా చెల్లించాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి తెలిపారు. రైతులు పంట నమోదు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, సాగు చేసిన పంట ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కామన్ సర్వీస్ సెంటర్లు (దిళీది), మీ సేవా కేంద్రాలు లేదా ఇన్సూరెన్స్ ఏజెంట్ల ద్వారా పంటలకు బీమా చేయించుకోవచ్చని తెలిపారు .కౌలు రైతులు కూడా పంట బీమాకు అర్హులేనని ఆయన పేర్కొన్నారు. బీమా చేయించిన పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వర్షాభావ పరిస్థితులు, బెట్ట పరిస్థితులను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు. రైతులు పంట బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పంటలకు రక్షణ కల్పించుకోవాలని కోరారు.

## ఏఎం రెడ్డి విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**నకరికల్లు, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామంలోని ఏఎం రెడ్డి స్మారక విద్యాసంస్థల్లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలల ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అట్లూరి శాంతిశ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కోసం క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని అన్నారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతినిపురస్కరించుకొని దేశంలో క్రీడాకారులను, అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమనితెలిపారు. ఏఎం రెడ్డి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జునరావు, డాక్టర్ పి. భార్గవ్ భూషణ్‌రావు, డాక్టర్ కే. కృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పల్నాడు క్రీడాకారుల సత్తా

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ప్రభాతవార్త ):** :అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పల్నాడు జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఆగస్టు 24 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన 364 మంది క్రీడాకారులు పాల్గొనగా, వివిధ క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 7 రజతాలతో మొత్తం 10 పతకాలు సాధించారు. ఆర్చరీలో ఎం. మారుతి అరుణ్‌రెడ్డి, అథ్లెటిక్స్‌లో అహమద్ ఆసియా, కబడ్డీ గీ17 బాలుర జట్టు స్వర్ణ పతకాలు సాధించగా, అథ్లెటిక్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ విభాగాల్లో రజత పతకాలు దక్కాయి. విజేతలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి. నరసింహారెడ్డి అభినందించారు. కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, టీమ్ మేనేజర్లను కూడా అభినందించారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రజలకు అష్టకష్టాలు..!

**అధికారులు కోసం గంటల తరబడి నిరీక్షణ**
**తాగు నీరు, మరుగు దొడ్లు లేక మహిళలు అవస్థలు**
**క్రోసూరు ఎమ్.ఆర్.ఓ. కార్యాలయంలో కనీస వసతులు కరువు శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు**



**క్రోసూరు( ఆగస్టు 29 ప్రభాతవార్త )**పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, క్రోసూరు మండలం క్రోసూరు లోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు నెలలో నోటీసులు అందుకున్న ఓటర్స్ క్రోసూరు ఎమ్.ఆర్.ఓ. కార్యాలయంలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని క్రోసూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వయోవృద్ధులు, వికలాంగులు, మహిళలు పెద్ద సంఖ్యలో క్రోసూరు మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకుంటున్నారని, అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం ఆలస్యంగా రావడంతో సుమారు 500 మంది వరకు ప్రజలు కార్యాలయం వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అయన తెలిపారు. ముఖ్యంగా వయోవృద్ధులు, వికలాంగులకు సరైన కూర్చునే సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదురయ్యాయని, మహిళలకు కనీసం తాగునీరు, ప్రజా మరుగుదొడ్ల సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందా? లేదా ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అనే విషయాలను తెలుసుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు కనీస వసతులపై దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, మహిళలు అధికంగా వస్తారని తెలిసినప్పటికీ తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు ప్రభుత్వ యంత్రాంగం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటు హక్కు కోసం వచ్చిన ప్రజలకు ఇలాంటి అవస్థలు తప్పవా ?ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారుల సమన్వయం ఎక్కడ? ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఎందుకు విఫలమయ్యారు?అనే ప్రశ్నలు ఇప్పుడు క్రోసూరు మండలంలో చర్చనీయాంశంగా మారాయని దీనిపై పల్నాడు జిల్లా కలెక్టర్, దగ్గర ఉన్నతాధికారులు స్పందించి, భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వినోదుల నరసింహారావు కోరుతున్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


**మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలి**



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని మాస్ట్రిన్‌పేటలో గల జ్యోతి ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ హైస్కూల్‌లో తెలుగు భాషా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గూడ ఆదిశేషిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషా వేత్త గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తేనె కంటే తీయనైన తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించి, మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుత తరంలో పెరుగుతున్న "మమ్మీ-డాడీ సంస్కృతికి బదులుగా తెలుగు ప్రజలు "అమ్మ-నాన్న అనే మాతృభాషా సంస్కృతిని కొనసాగించాలని సూచించారు. ప్రతి తెలుగు వ్యక్తి తన మాతృమూర్తిని, మాతృభాషను జీవితాంతం మరువకూడదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ "దేశ భాషలందు తెలుగు లెస్స" అనే భావనను ప్రతి తెలుగు వ్యక్తి గర్వంగా చాటుకోవాలని, తెలుగులో మాట్లాడటాన్ని అలవాటుగా చేసుకోవాలని అన్నారు. "తెలుగువాడిగా గర్వించు.. తెలుగులోనే సంభాషించు" అనే సందేశంతో మాతృభాషపై యువతలో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గూడ ఆదిశేషిరెడ్డి, కె. వెంకట్రావు, జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి, కోశాధికారి బక్క సుబ్బారావు, సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ ఉద్యమించాలి

**సీఐటీయూ జిల్లా నాయకులు గుంటూరు విజయ్‌కుమార్**



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** విద్యారంగ పరిరక్షణ కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ఎఫ్ఐ) కార్యకర్తలు ఉద్యమించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సత్తెనపల్లి నియోజకవర్గ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభకు రియాజ్, డి. అమూల్య, వెంకీ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ ప్రైవేటీకరణతో పాలకులు విద్యను పేద విద్యార్థులకు దూరం చేస్తున్నారని విమర్శించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని, అయితే ప్రైవేట్ విద్యాసంస్థల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో క్రీడా మైదానాలు, అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు "చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు" అనే నినాదంతో విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కోకన్వీనర్ డి. అమూల్య గత కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా, ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. భవిష్యత్ కర్తవ్యాలు, కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. విద్యార్థుల సమస్యలపై పలు తీర్మానాలుమహాసభలో బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలని తీర్మానించారు. అలాగే సత్తెనపల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అధిక ఫీజులను తగ్గించాలని తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను భువనేశ్వరి, నవీన్ ప్రవేశపెట్టగా అమృతవర్షిణి బలపరిచారు. మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 22 మందితో నూతన కమిటీ ఎన్నికఅనంతరం 22 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ రియాజ్, జె. సాయికుమార్, ఉపాధ్యక్షులుగా భువనేశ్వరి, అమృతవర్షిణి, సహాయ కార్యదర్శులుగా జానీశంకర్, ఆగస్టిన్, వెంకీ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా నవీన్, దిలీప్, వెంకటేష్, సుధాకర్, లక్ష్మయ్య, ప్రశాంత్, లిఖిత, శ్రీవిద్య, ఆంజనేయులు, భార్గవి, దావీదు, భాష, అల్తాఫ్, సంజయ్, మనోహర్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ సాయి పరిశీలకులుగా హాజరయ్యారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి. మహేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నీరుకొండ కృష్ణ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు గద్దె ఉమాశ్రీ సౌహార్ద సందేశాలు అందించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ జెండాను షేక్ రియాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ నాయకులు అభిలాష్, ఆసిఫ్, సీఐటీయూ సత్తెనపల్లి పట్టణ కన్వీనర్ జైరాజ్ కుమార్ తదితరులు నాయకత్వం వహించారు.

## పోలింగ్ బాక్సుల పరిశీలన



**యడ్లపాడు, ఆగస్టు 29, ప్రభాతవార్త :** యడ్లపాడు మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా వినియోగించనున్న పోలింగ్ బాక్సులను అధికారులు శనివారం పరిశీలిస్తున్నారు. మండలంలోని 190 పోలింగ్ బూత్‌లకు అవసరమైన పోలింగ్ బాక్సులను సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టినట్లు ఎంపీడీవో వి హేమలతాదేవి తెలిపారు. పోలింగ్ బాక్సుల పనితీరు, నాణ్యత తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అవసరమైన బాక్సుల సంఖ్యను గుర్తించి, అదనంగా కావాల్సిన వాటిని తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఎమ్మెల్సీ వర్ల రామయ్యకు అభినందన సభ



**సత్తెనపల్లి (ఆగస్టు 29, ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్యకు నిర్వహించిన అభినందన సభలో సత్తెనపల్లి నుంచి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిలక జాన్‌సన్, టీడీపీ నాయకులు కూచిపూడి కృపారావు, గర్నెపూడి సాల్మన్‌రాజు, తాళ్లూరి అమర్‌నాథ్ తదితరులు పాల్గొని వర్ల రామయ్యకు అభినందనలు తెలిపారు. వర్ల రామయ్య ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షి ంచారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**యడ్లపాడు, అగస్టు 29, ప్రభాతవార్త :** మండలం కొండవీడు కోట గ్రామ పరిధిలో శుక్రవారం ఉదయం సుమారు 09:30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జల్లిక బీ అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే, జల్లిక బీ తన చిన్న కుమారుడితో కలిసి వ్యవసాయ క్షేత్రానికి కాలినడకన వెళ్తుండగా, గుల్షావలి గెస్ట్ హౌస్ సమీపంలో రహదారి దాటుతున్న సమయంలో ఫిరంగిపురం వైపు నుండి చెంగిశాన్‌పేట వైపు వెళ్తున్న ఎపి 40 ఎఫ్ఇ 4880 నంబరు గల ద్విచక్ర వాహన దారుడు వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జల్లిక బీ కిందపడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు చెవుల నుండి రక్తస్రావం జరిగింది. స్థానికుల సహాయంతో ఆమెను ఫిరంగిపురం తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని లైఫ్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ఐసియులో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదర్యాపు చేపట్టినట్లు ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు.

## దుర్గి మోడల్ స్కూల్‌లో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు



**దుర్గి, ఆగస్టు29ప్రభాతవార్త** దుర్గి మండల కేంద్రంలోని పి.ఎమ్ శ్రీ ఎ.పి మోడల్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దేవాభూషణ్ మాట్లాడుతూ, విద్యా ర్థుల సమగ్ర వికాసానికి చదువుతో పాటు క్రీడలు, మాతృ భాష ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణను, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని, తెలుగు భాషా సంస్కృతిని కాపాడుకోవడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, కవితలు మరియు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్, యస్.యమ్.సి చైర్మన్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యస్.యమ్.సి చైర్మన్ వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పరిశోధనకి డా. శివ రామ ప్రసాద్ ఎంపిక

### రోడ్డు ప్రమాదాలపై పరిశోధనకు జాతీయ స్థాయి అవకాశం



**నకరికల్లు, ఆగస్టు 29, ప్రభాతవార్త:** భారత వైద్య పరిశోధనా మండలి కు చెందిన నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల, పిడుగురాళ్లలో జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. శివ రామ ప్రసాద్ కొమేరా మెంటీగా ఎంపికయ్యార ు.దేశవ్యాప్తంగా ఎంపికైన ఎనిమిది మంది మెంటీలలో డా. శివ రామ ప్రసాద్‌కు చోటు దక్కడం విశేషం. ।దిలీళివి।ని నిపుణుల మార్గదర్శకత్వంలో పరిశోధన రూకల్పన, డేటా సేకరణ, విశ్లేషణ, అలాగే పరిశోధన ఫలితాలను ఆచరణాత్మక ఆరోగ్య చర్యలుగా మార్చే విధానంపై ఆయన శిక్షణ పొందనున్నారు. రోడ్డు ప్రమాద బాధితులపై పరిశోధడా. శివ రామ ప్రసాద్ చేపట్టనున్న పరిశోధనలో రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి తృతీయ స్థాయి ఆసుపత్రికి బాధితులు చేరుకునే వరకు జరిగే ఆలస్యాలు, ప్రారంభ వైద్య నిర్వహణపై అధ్యయనం చేయనున్నారు. ప్రమాదం అనంతరం "గోల్డెన్ అవర్‌"లోగా బాధితులు ఆసుపత్రికి చేరుకోవడాన్ని ప్రభావితం చేసే రవాణా, ప్రథమ చికిత్స, రిఫరల్ ప్రక్రియ, ఇతర అవరోధాలను గుర్తించడం ఈ పరిశోధనలో ప్రధాన అంశంగా ఉనుంది. ట్రామా కేసుల్లో ప్రతి నిమిషం కీలకమైన నేపథ్యంలో, గుర్తించిన ఆలస్యాలను తగ్గించేందుకు ప్రీహాస్పిటల్ కేర్, రిఫరల్ ట్రామా కేర్ వ్యవస్థలను మరింత మెరుగుపరిచే ఆచరణాత్మక పరిష్కారాలను సూచించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ అధ్యయనం ద్వారా పిడుగురాళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద బాధితులకు వేగవంతమైన, సమర్థవంతమైన అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉంది. జాతీయ స్థాయి పరిశోధనా కార్యక్రమానికి ఎంపికైన డా. శివ రామ ప్రసాద్‌ను ప్రభుత్వ వైద్య కళాశాల సహచర వైద్యులు, సిబ్బంది, మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఆయన పరిశోధన విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎం. నాగమల్లేశ్వరి, సీడీపీఓ శ్రీలత, నోడల్ అధికారి అరుణ, పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌లోని 8, 9, 10వ తరగతుల కిశోర బాలికలకు బాల్య వివాహాలనిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్‌తో పాటు వారి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని రామారావు పేర్కొన్నారు. తల్లిదండ్రులు బాలికలకు విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలకు తీసుకురావాలని, విద్యతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా, ఆరోగ్య, పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అనంతలక్ష్మి ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## కెరిడ్జ్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం




**నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** తెలుగు భాష గొప్పతనం, సాహిత్య వైభవం, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా కేరిడ్జ్ ఇంర్నేషనల్ స్కూల్లో తెలుగు భాషా దినో త్సవ వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. తెలుగు విభా గాధిపతి ఎం. అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీక అని, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే తెలుగు భాషపై మమకారం పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు శాస్త్రీయ నృత్యం, శతక పద్యాలు, తెలుగుతల్లి వేషధారణ, అచ్చులతో రామాయణం ప్రదర్శనలతోఆకట్టుకున్నారు. నన్నయ, తిక్కన, ఎర్రన, కవయిత్రి మొల్ల పాత్రలను విద్యార్థులుఅభినయించారు. తెలుగుగీతాలు, ప్రసంగాలు, సామాజిక సం దేశాత్మక నాటిక ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జి కోట బాపూజీ, తెలుగు ఉపాధ్యాయులు నిర్మల, భూపతి, ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాతృభాషకు ప్రత్యామ్నాయం లేదు



**రాజుపాలెం29 (ప్రభాతవార్త):** గిడుగు వెంకట రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల-రాజుపాలెం-కొండమోడు కె.ఎన్.ఆర్. విద్యాసంస్థల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు మాట్లాడుతూ ప్రపంచంతో పోటీపడేందుకు ఇంగ్లీష్‌తో పాటు అనేక భాషలను నేర్చుకోవడం అవసరమని అన్నారు. కొత్త భాషలను నేర్చుకోవడం అభివృద్ధికి సూచిక అని, అయితే ఎన్ని భాషలు నేర్చుకున్నా మన మాతృభాషకు ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు అధ్యాపకులు వంగివరపు రాజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ తెలుగును ప్రేమించి, గౌరవించాలని, తెలుగు సాహిత్యాన్ని చదివి, తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. "మన భాష - మన గర్వం, మన సంస్కృతి - మన బలం, తెలుగు తల్లి - మన ఆత్మగౌరవం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తెలకపల్లి గోపికృష్ణ, దీపంగి సురేష్, బి. యాకోబు, కోనేటి ప్రసన్న, బి. ఇందు తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వినుకొండ నియోజకవర్గ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న బొల్లా

**చీఫ్‌విప్ జీ.వీ.డీసీసీబీ మక్కెన**

**కూటమి పాలనపై విషప్రచారం చేస్తున్న వైకాపా**

**బొల్లా హయాంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలి**





**బొల్లాపల్లి, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:** బొల్లాపల్లి మండలంలో విద్య, వైద్యం, ప్రజా మౌలిక వసతులకు సంబంధించిన సుమారు రూ.2.20 కోట్లతో నిర్మించిన నాలుగు అభివృద్ధి భవనాలను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. నాయుడుపాలెంలో రూ.36 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్, బొల్లాపల్లిలో రూ.53 లక్షల ఎంఈవో కార్యాలయం, రూ.8 లక్షల గ్రంథాలయం, రూ.1.23 కోట్ల కేజీబివి భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధిని సీఎం చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. మాటలు, ప్రచారం కంటే ప్రజలకు కనిపించే పనులకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామంలోనే ప్రాథమిక వైద్యం నుంచి విద్యార్థులకు మెరుగైన విద్యా వసతుల వరకు అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో ప్రభుత్వ విద్యలో నాణ్యత, ఉపాధ్యాయ నియామకాలు, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జీవీ సూచించారు. వర్షపాతం తక్కువగా ఉండటం పంటలకు నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ తక్కువ నీటితో దిగుబడినిచ్చే జొన్న, మొక్కజొన్న, కంది వంటి ఆరుతడి పంటలను ఎంచుకోవాలని కోరారు. పశుగ్రాసం కొరత రాకుండా రైతులు ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బొల్లాపల్లి మండలంలోని రెమిడిచర్ల, గుమ్మనంపాడు, రావులపురం తదితర గ్రామాల్లో బోర్లు ఎండిపోయి తాగునీటి ఇబ్బందులు తలెత్తిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జీవీ తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న ఏ గ్రామాన్నీ నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన మేరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరినట్లు చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఓర్వలేకపోతున్నారని జీవీ విమర్శించారు. కేజీబివి భవనం, ఎంఈవోకార్యాలయం, గ్రంథాలయం, విలేజ్ హెల్త్ సెంటర్ వంటి ప్రజలకు ఉపయోగపడే భవనాలను ప్రారంభిస్తుంటే అభినందించాల్సింది పోయి కూటమి ప్రభుత్వంపైనా, అభివృద్ధి చేస్తున్న నాయకులపైనా విషప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఏ అభివృద్ధి జరిగినా బ్రహ్మనాయుడు ఓర్చుకోలేక, సహించలేక రాజకీయ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విమర్శలు చేయడం చాలా సులభమని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి చేసి చూపించడమే ముఖ్యమని జీవీ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బొల్లాపల్లి మండలానికి, వినుకొండ నియోజకవర్గానికి ఏం చేశారో బొల్లా బ్రహ్మనాయుడు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మీ ఐదేళ్ల అభివృద్ధి లెక్కలు తీసుకురండి మా రెండేళ్ల అభివృద్ధి లెక్కలు మేం తీసుకొస్తాం ప్రజల సమక్షంలోనే ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో తేల్చుకుందాం అని జీ.వీ సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి అభివృద్ధి పనిని రాజకీయ కళ్లద్దాలతో చూసి విషప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై జీవీ మాట్లాడుతూ గతంలో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు 24 శాతానికి పరిమితమైన సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం న్యాయపోరాటాన్ని ఎందుకు సమర్థంగా ముందుకు తీసుకెళ్లలేదో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు తగ్గడం వల్ల స్థానిక సంస్థల్లో బీసీలు వేలాది రాజకీయ అవకాశాలను కోల్పోయారని ఆరోపించారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కల్పించడంలో కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. బయట ఆరోపణలు చేయడం కాకుండా జగన్ అసెంబ్లీకి వచ్చి ఆధారాలతో చర్చించాలని సవాల్ చేశారు. మంత్రి నారా లోకేశ్ సభలో చర్చకు సిద్ధమని పలుమార్లు చెప్పినప్పటికీ జగన్ ఎందుకు అసెంబ్లీకి వచ్చి చర్చించడం లేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ వ్యవహారంపై వచ్చిన ఆరోపణలకు ముందుగా జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిందని జీవీ పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను రాజకీయ ప్రయోజనాల కోసం అనుమానించేలా వారిని అవమానించేలా వైసీపీ ప్రచారం చేయడం బాధాకరమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే దానిపై జగన్ స్వార్థ రాజకీయం చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు

**ఎమ్మెల్యే డా.చదలవాడ**



**నరసరావుపేట, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** నరసరావుపేటలోని తిలక్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, జట్టు స్ఫూర్తి వంటి విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి విద్యార్థి తనకు ఇష్టమైన క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను ఎమ్మెల్యే అభినందించారు. విజేతలకు బహుమతులుఅందజేశారు. విద్యార్థుల తో కలిసి క్రీడా దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, నాయకుల ు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 2న నారా మంత్రి లోకేశ్ నరసరావుపేట పర్యటన

**ఎమ్మెల్యే చదలవాడ**



**నరసరావుపేట, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** జేఎన్టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నరసరావుపేట కాకాని క్యాంపస్‌లో రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు హాస్టల్ భవనాలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సెప్టెంబర్2నప్రారంభించనున్నారు. ఈ హాస్టళ్ల ద్వారా సుమారు 1,440 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం కలగనుంది. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం జేఎన్టీయూ క్యాంపస్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి కార్యక్రమ ఏర్పాట్లు, భద్రత, పారిశుద్ధం, పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాంపస్‌లో పూర్తిస్థాయి వసతి సౌకర్యం అందుబాటులోకి రావడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల ఇబ్బందులు తొలగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపాల్, ఉమ్మడి కూటమి నాకులు పాల్గొన్నారు.

## మాచవరంలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం

**ఎమ్మెల్యే అరవిందబాబు**



**రొంపిచర్ల, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరి ంచేందుకు నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం రొంపిచర్ల మండలం మాచవరం గ్రామంలో శనివారం సాయంత్రం కొనసాగింది. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు అందకపోవడం, సమస్యలు లేదా లోపాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పరిష్కరించే బాధ్యతను కూటమి నాయకులు, కార్యకర్తలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రొంపిచర్ల మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఏఎం రెడ్డి విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**నకరికల్లు, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామంలోని ఏఎం రెడ్డి స్మారక విద్యాసంస్థల్లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలల ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అట్లూరి శాంతిశ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కోసం క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచిం చారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా వి ద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని అన్నా రు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతినిపురస్కరించుకొని దేశంలో క్రీడా కారులను, అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించే లక్ష్యం తో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకర మని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జునరావు, డాక్టర్ పి. భార్గవ్ భూషణ్‌రావు, డాక్టర్ కే. కృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రిటైర్డ్, అమర పోలీసు కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**అదనపు ఎస్పీ**



**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు, విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో రిటైర్డ్ పోలీసు అధికారులు, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు అందిన పెన్షన్, ఆర్థిక ప్రయోజనాలు, ఇతర సంక్షేమ బెనిఫిట్స్‌పై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అందాల్సిన బెనిఫిట్స్, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పెండింగ్ ప్రయోజనాల ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ శాఖలో ఎన్నో సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ చేసిన అధికారులు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రోహిత్ కుమార్ చౌదరి తెలిపారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, జిల్లా పరిపాలన పోలీస్ అధికారులు సూపరింటెండెంట్ షకీలా, రవి తేజ, శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడులో అక్రమ మద్యం విచ్చలవిడి



**క్రోసూరు( ఆగస్టు 29 ప్రభాతవార్త )** పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ,ఎర్రబాలెం, పీసపాడు, ఆనంతా రం, క్రోసూరు గ్రామాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ బెల్ట్ షాపుల వల్ల మధ్య తరగతి కుటుంబాల్లో అనేకమంది రొడ్డిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్టు వ్యవహరిస్తున్నట్లు స్థానిక ప్రజల గుసగుసలాడుతు న్నారు. అధికార యంత్రాంగం లం చాల మత్తులో మునిగిపోయిందా లేకపోతే ఎమ్మెల్యే చెప్పినట్టు వింటుందా అనే విధమైన విమర్శలు కూడా వస్తున్నాయి. తమకు వచ్చే రోజువారి కూలీలో మద్యం దళారులే మొత్తం దోచేస్తే ఏమిటని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

**జడ్పిటీసీ కంకణాల స్వర్ణకుమారి శివాజీ**



**పెదకూరపాడు, ఆగస్టు 29, ప్రభాతవార్త )** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షతన సభ ముందుకు సాగింది. అన్ని శాఖల అధికారులు పాల్గొని గత మూడు మాసాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. తమ్మవరం గ్రామంలో బోరు పంపులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కోరారు. లింగంగుంట్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో సాగునీటి సమస్య అధికంగా ఉందని క్లోరైడ్ సమస్యతో ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెదకూరపాడు ఎస్సీ కాలనీ ఆనందపేట నందు 12 లో లెవెల్ స్తంభాలు అధ్వానంగా ఉన్నాయని వాటిని మార్చాలని ఎంపీటీసీ నిర్మల గోవిందరావు కోరారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జడ్పిటిసి కంకణాల స్వర్ణకుమారి శివాజీ కోరారు. ఎంపీపీ మీరయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాల పరిమితులు అధికారులు నాయకుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి లీల, అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముల భద్రతా పటిష్టంగా ఉండాలి

**బాపట్ల.ఆగస్టు 29. ప్రభాతవార్త ప్రతినిధి:** ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, శనివారం పరిశీలించారు. నెలవారి సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాముల వద్దకు ఆయన చేరుకుని పరిశీలించారు. వాటి భద్రత పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. గతంలో వేసిన సీల్ ను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీసులు భద్రంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బాపట్ల ఆర్డిఓ హారికుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, తహసిల్దార్ షాలీమ, తదితరులు పాల్గొన్నారు.




బాపట్ల జిల్లా వార్త



## రేపల్లెలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె, ఆగస్టు 29, ప్రభాతవార్త:** పట్టణంలో ఆర్‌డిఎస్ఎస్ స్కీమ్ కింద 33కెవి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలు,మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్ బాబు శనివారం తెలిపారు.రైల్వే స్టేషన్,వినాయక గుడి,మెయిన్ రోడ్,తాలూకా ప్రభుత్వ కార్యాలయాలు,ప్రభుత్వ వైద్యశాల,చంద్రమౌళి ఉద్యానవనం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# పారదర్శకంగా ఓటర్ల సవరణ ప్రక్రియ

### -క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

**బాపట్ల, ఆగస్టు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పూర్తి పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని పౌర సరఫరాల కమిషనర్, బాపట్ల జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ కె.కన్నబాబు స్పష్టం చేశారు. శనివారం ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించి, క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై క్షేత్రస్థాయి పరిశీలన




జరిపారు. ముందుగా స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి జిల్లాలో జరుగుతున్న ప్రక్రియను వివరించారు. ముసాయిదా జాబితా ప్రకటించడానికి ముందు జిల్లాలో 10,50,605 మంది ఓటర్లు ఉండగా, గైర్హాజరు, మరణాలు, మార్పులకు సంబంధించి 1,10,216 పేర్లను తొలగించామని, ప్రస్తుతం తుది ముసాయిదా జాబితాలో 9,40,389 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అలాగే జిల్లాలో కొత్తగా 155 పోలింగ్ స్టేషన్లు పెరగడంతో, మొత్తం కేంద్రాల సంఖ్య 1,212 నుంచి 1,367కి చేరిందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,59,116 నోటీసులు జారీ చేశామని, నోటీసుల పంపిణీలో ఎలాంటి పెండింగ్ లేదన్నారు. ఇప్పటివరకు 58,065 విచారణలు (హియరింగ్) పూర్తి కాగా, మిగిలినవి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు.ఈ సందర్భంగా ఎలక్టోరల్ అబ్జర్వర్ కె.కన్నబాబు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఎస్ఐఆర్ గడువును పొడిగించిందని తెలిపారు. సెప్టెంబరు 28 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, అక్టోబరు 3న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. పారదర్శకతలో భాగంగా రాజకీయ పార్టీలకు డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ అందించినట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బీఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్)ను నియమించుకునేలా పార్టీలను ప్రోత్సహిస్తున్నామని, తద్వారా ప్రక్రియ మరింత సజావుగా సాగుతుందని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన చీరాల, బాపట్లలోని రెండు పోలింగ్ స్టేషన్లలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. నోమ్యాపింగ్‌కు సంబంధించి నోటీసులు పొందిన వారి వద్ద నుండి ఆధార పత్రాలు సేకరించి హియరింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు లేవనెత్తిన పలు సమస్యలను ఆయన శాంతంగా విని, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు హరికుమార్, నరసింహారావు, శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ షఫీతో పాటు జనసేన, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు మాధవి, మాల్యాద్రి, బాలనారాయణ, గంగయ్య, రాజారాం, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష అత్యంత పటిష్టంగా నిర్వహించాలి: కలెక్టర్

**బాపట్ల, ఆగస్టు 29,ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ పీజీ పరీక్ష అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. నీట్ పీజీ పరీక్ష పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పీజీ పరీక్షను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున అధికారులు సమగ్ర ప్రణాళిక, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు.30వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని రెండు పరీక్ష కేంద్రాలలో నీట్ పీజీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో 496 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పూర్తిస్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి చరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జామర్స్ ఏర్పాటు చేయాలనిఅధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా నిర్వహిస్తున్న నీట్ పీజీ పరీక్షకు ఏలాంటి అవాంతరాలు జరగకుండా విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆయన సూచించారు. నీట్ పరీక్ష కేంద్రాలకు జిల్లా నోడల్ అధికారిగా చీరాల ఆర్డీవో నరసింహారావును నియమించినట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. సైబర్ నేరాళ్లు ఎలాంటి ఆటంకాలు చేయకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు సీనియర్ అధికారులు నియమితులయ్యారని, పరీక్షను పర్యవేక్షిస్తారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ఇద్దరు వైద్యులనుఅందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య రాకుండా పోలీసు అధికారులు పర్యవేక్షించాలన్నారు. వాహనాల పార్కింగ్ సమస్య రాకుండా చూడాలన్నారు. నియమితులైన ఉద్యోగులు మినహా మిగిలిన వారు ఎవరు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించరాదని అధికారులకు ఆదేశించారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో చీరాల ఆర్డీవో నరసింహారావు, సిపిడిఎన్ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్చార్జి అధికారి సోమల నాయక్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రి సహాయనిధితో ప్రయోజనం

**రేపల్లె, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధితో ప్రయోజనం లభిస్తున్నదని రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త అనగాని శివప్రసాద్ అన్నారు.శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రేపల్లె మండలంలోని పోటుమెరక గ్రామానికి చెందిన కోసూరి ముద్దులకృష్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.73,554 చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో రేపల్లె నియోజకవర్గంలోని అర్హులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు.ఈ కార్యక్రమంలో రేపల్లె మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు ధన్యవాదాలు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

**కర్లపాలెం. ఆగస్టు29. ప్రభాతవార్త:** మండల పరిషత్ ద్వారా ప్రజలకు నిరంతరం సేవలందించిన ప్రతి ప్రభుత్వ అధికారికి, ఉద్యోగికి ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారాం వనజ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రస్తుత పాలకమండలి చిట్టచివరి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిన సాంబశివరావు ప్రజా సమస్యలపై చివరి సమావేశంలోనూ తన గళాన్ని వినిపించారు.నల్లమోతువారిపాలెం పరిధిలోని ఎఫ్సిఐగోడౌన్ల నుంచి విపరీతమైన పురుగులు రావడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనిపై వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త నందాయపాలెంలో వీధిదీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలో తన ప్రశ్నించే తత్వంతో ఏ అధికారికైనా మనస్తాపం కలిగి ఉంటే అన్యధా భావించవద్దని కోరగా.. మీలాంటి ప్రజాప్రతినిధితో కలిసి పనిచేయడం సంతోషదాయకమని పలువురు అధికారులు కొనియాడారు. ప్రజాప్రతినిధిగా తన ప్రయాణంలో సహకరించిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజులకు ఈ సందర్భంగా సాంబశివరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**రేపల్లె, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతారావు డిమాండ్ చేశారు.శనివారం రేపల్లె పట్టణంలో ప్రభుత్వం స్పెషల్ టెట్ అని చెప్పి సాధారణ టెట్ నిర్వహణకు సిద్ధమవుతున్న




సందర్భంగా యుటిఎఫ్ ఆందోళనకు సంబంధించి బైక్‌జాత కార్యక్రమం నిర్వహించారు.శాంతారావు మాట్లాడుతూ స్పెషల్ టెట్లో అర్హత మార్కులు తగ్గించాలని,బోధించే సబ్జెక్టులకే పరీక్ష నిర్వహించాలని,ఆఫ్ లైన్‌లో పరీక్ష నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఎం.బి.సుబ్రహ్మణ్యం,రేపల్లె మండల అధ్యక్షుడు జి.సుబ్రహ్మణ్యం,సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్,కార్యదర్శి వి.సుబ్బారావు,నగరం, నిజాంపట్నం మండలాల నాయకులు సిహెచ్.కోటేశ్వరరావు, కె.రాంబాబు, గణపయ్య,రవీంద్రరాజు,భూషణం తదితరులు పాల్గొన్నారు.

## వెల్లటూరులో తెలుగు భాష దినోత్సవం

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 29, ప్రభాతవార్త:** భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం తెలుగు భాష దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.మాతృభాషపై అభిమానం,తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.విద్యార్థులు



తెలుగు గీతాలు,పద్యాలు ఆలపిస్తూ ప్రతిభను చాటుకున్నారు.గిడుగు రామమూర్తి,అన్నమయ్య,తెలుగుతల్లి తదితర ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి మాట్లాడుతూ తెలుగు భాష సంభాషణకు మాత్రమే పరిమితం కాదని సంస్కృతి,సం ప్రదాయం,చరిత్ర,సాహిత్యానికి ప్రతీక అని వెల్లడించారు.క్రీడల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శైలజ,జె.వెంకటస్వామి, శ్రీనివాసరావు, గుర్రం మురళీ మోహన్, వి.శ్రీనివాసరావు, ఎం.కుటుంబరావు, పద్మ,నాగజ్యోతి, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు అకాడమీ, సారస్వత పరిషత్‌ను పునరుద్ధరించాలి

### బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్

**బాపట్ల. ఆగస్టు29. ప్రభాతవార్త ప్రతినిధి:** మాతృభాషను అభివృద్ధి చేసుకోవడం ద్వారానే రాష్ట్రం సర్వాంగీణ ప్రగతి సాధిస్తుందని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన ఖితెలుగు భాషా దినోత్సవంఖి కార్యక్రమంలో ఆయన ముఖ్యప్రసంగం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధి వెనకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 11వ శతాబ్దం వరకు ఒకే లిపితో కొనసాగిన తెలుగు, కన్నడ భాషల్లో ప్రస్తుతం ఎంతో వైరుధ్యం కనిపిస్తోందన్నారు. కర్ణాటక ప్రభుత్వం అక్కడ కన్నడ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి నిధులు ఇస్తోందని, మన వద్ద ఆంగ్ల భాషపై ఉన్న విపరీతమైన వ్యామోహం తెలుగు వికాసానికి అడ్డంకిగా మారిందని విశ్లేషించారు. ప్రాథమిక విద్య నుంచే పిల్లలకు తెలుగుపై అవగాహన, మక్కువ పెంచితే ఈ సమస్య తీరుతుందని సూచించారు. ప్రభుత్వం దృష్టి సారించాలి:తెలుగు అకాడమీ, తెలుగు సారస్వత పరిషత్తులకు తక్షణమే తగిన నిధులు కేటాయించి పునరుద్ధరించాలని శ్యామ్‌సుందర్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో రాష్ట్రముందున్నా, మాతృభాషా వికాసంపై మరింత శ్రద్ధ పెడితే సాంస్కృతికంగా కూడా వేగంగా పురోగమిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కవులకు ఘన సత్కారం:కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో ప్రముఖ కవులు ఎం. మాల్యాద్రిరావు, సంగాని శ్రీరాములులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ విమర్శకుడు లక్కాకుల వెంకటరావు, గ్రంథాలయ అధికారి శివాజీ గణేషన్, పోలాసం వీరాంజనేయులు, షేక్ బాబావలి, ఆక్సి తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించాలి : శాంతినగర్ వాసులు విజ్ఞప్తి

**తెనాలి ఆగస్ట్ 29(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం,శాంతినగర్ 24వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న మర్రి చెట్టును లేదా దాని కొమ్మలను తొలగించవలసిందిగా శాంతినగర్ వాసులు మున్సిపల్ కమీషనర్ కి విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ సందర్భంగా శాంతినగర్ నివాసి అమర్తల శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు, శాంతినగర్ లో ఉన్న ఒక పెద్ద మర్రి చెట్టు వల్ల ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాణసంకటమైన సమస్య, మా కాలనీలో ఉన్న మర్రి చెట్టు పైభాగం నుండి ప్రధాన విద్యుత్ (కరెంట్) తీగలు వెళ్తున్నాయి. చెట్టు కొమ్మలు ఆ కరెంట్ తీగలకు బలంగా తగులుతున్నాయి. దీనివల్ల సాధారణ రోజుల్లోనే కాకుండా, ముఖ్యంగా వర్షాలు పడినప్పుడు చెట్టు మొత్తం కరెంట్ పాస్ అవుతోంది (షార్ట్ సర్క్యూట్ అవుతోంది).ఆ సమయంలో చెట్టుకు సమీపంలోకి వెళ్లాలన్నా, ఆ దారిలో నడవాలన్నా స్థానిక ప్రజలు, చిన్న పిల్లలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నాము. ఏదైనా పెద్ద ప్రమాదం జరగకముందే ముందస్తు చర్యలు తీసుకోవడం చాలా అవసరం.కావున, తాము వెంటనే స్పందించి, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి,శాంతినగర్ 24వ వార్డులోని ఆ మర్రి చెట్టును లేదా విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న ప్రమాదకరమైన కొమ్మలను త్వరితగతిన తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నానన్నారు.



## ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**నగరం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** తెలుగు భాష మన సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతిక అని ఎస్ వి ఆర్ ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. శనివారం ఎస్.వి.ఆర్ . ఎం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను గౌరవించడం మనందరి బాధ్యతని, తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలుగు సాహిత్యాన్ని చదివి, తెలుగు భాషను దైనందిన జీవితంలో విస్తృతంగా ఉపయోగించాలన్నారు. డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయడంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం జ్ఞానం, మాతృభాషను ప్రేమించడం మన సంస్కారమని విద్యార్థులకు సందేశాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.సురేఖ, ఉప్పల గోపికృష్ణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లేపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**నగరం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర స్వామిని పూజించి సేవించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలం



కరణలు చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ధర్మ రక్షా బంధన్ కార్యక్రమంలో నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష మన దేశానికి ధర్మానికి రక్షణ అంటూ ధర్మరక్షణ కంకణాలు కట్టారు. ఈ కార్యక్రమంలో పొన్నపల్లి సత్యనారాయణ, బయ్యన వెంకట రావు, చింతల మురళీకృష్ణ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## దేశభాషలందు తెలుగు లెస్స

నిజాంపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త : దేశ భాషలందు తెలుగు లెస్స అని ఎనాడో చెప్పారని ఎంఇఓ శేషుగోపాలం అన్నారు. తెలుగు భాషా



దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన నిజాంపట్నంలోని బిసి గురుకుల పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తెలుగుభాషా దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని భాషలన్నింటిలో చాలా క్లిష్టమైన భాష తెలుగు అని ఆయన చెప్పారు. తెలుగు భాషలోని అక్షరాలు నేర్చుకోవాలంటే చాలా కష్టమనా న్నరు. తెలుగు భాష చాలా అందమైన భాష అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రతినిధులు, తెలుగు భాషాలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మాటలకు అందని మహా విషాదం నేపాల్ విలయం

### -అవగాహన సంస్థ ఆందోళన

గుంటూరు కల్చరల్,ఆగష్టు 29,ప్రభాతవార్త : నేపాల్లో ఆకస్మిక వరదలు విరుచుకుపడి 350మంది ప్రాణాలు కోల్పోవడం,1300మందికి పైగా ఆచూకీ తెలియకపోవడం అత్యంత విషాదకరమని,ఇటీవల కాలంలో హిమాలయ పర్వత ప్రాంతంలో చోటు చేసుకున్న అత్యంత దారుణమైన ప్రకృతి విలయం ఇదని అవగాహన సంస్థ ఆందోళన ప్రకటిస్తుంది.నేపాల్ వరదల ఉగ్రరూపం,విధ్వంసం హిమాలయాల అతి సున్నితమైన అస్థిర పర్యావరణానికి ప్రబల నిదర్శనమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.వాతావరణ మార్పు తీవ్రంగా ప్రభావితం చేస్తున్న తరుణంలో కంటికి కనిపించే ఈ అందమైన మంచు పర్వతాల వెనుక జరుగుతున్న దేమిటో తెలుసుకోలేకపోతే ఇటువంటి విపత్తులు అనేకం చూడాల్సి వస్తుందని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

## గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు పరిష్కరించేదిశగా చర్యలు : మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 29(ప్రభాతవార్త):** స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు



వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మరియు జిల్లా కలెక్టర్ ,జాయింట్ కలెక్టర్ తదితరుల సమక్షంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. అందులో భాగంగా మారీస్ పేటకు చెందిన పిల్లి రజిని అనే డ్వాక్రా మహిళ చాయ్ రాస్తా ఏర్పాటుకు సహకరించాలని గ్రీవెన్స్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలను కమిషనర్ రామా అప్పలనాయుడు , మెప్మా సీఎంఎం విజయ కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రీవెన్స్ లో తమ జీవనోపాధి కోసం టీ దుకాణం ఏర్పాటు. చేసుకునేందుకు స్థలం చూపించాలని మహిళ కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై సంబంధిత సిబ్బందితో చర్చించి సాధ్యసాధ్యాలను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు.

## అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 29(ప్రభాతవార్త):** సామాన్యులందరికీ, విద్యార్థి భావ్యక్తీకరణకు భాషా బోధనకు, సులభ గ్రహ్యానికి వ్యవహారిక భాష శరణ్యమని గిడుగు శ్రీరామమూర్తి చాటి చెప్పారని రచయిత మొవ్వా సుబ్బారావు అన్నారు.శనివారం తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ సమావేశహాలులో అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సభలో ఆయన మాట్లాడారు. పండితశ్రేష్టులు రచనల్లోని విరుధప్రయోగాలను, వైరిసమాసలను జల్లెడపట్టి గిడుగుచూపించారని వివరించారు.గ్రాంథిక భాషలో రాయడం రాదన్న వారికి చెల్లుమనిపించే జవాబుగా కొన్ని రచనలు చేశారన్నారు. గిడుగు రామ్మూర్తి పాఠశాలలను స్థాపించి విద్యాదానం చేశారన్నారు.యం.వి.రఘునాధరావు మాట్లాడుతూ, వ్యవహారిక భాష ప్రాముఖ్యతను నెరిగి దాన్ని సాధనకు ఉద్యమాలు నిర్వహించారని వివరించారు.పర్లాకిమిడినిఒరిస్సాలో కలిపేందుకు ప్రయత్నాలు జరగా వాటిని వ్యతిరేకించి ఉద్యమబాటను నడిపార న్నారు. మన రాష్ట్రంలో వారి జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా అధికారికంగా ప్రకటించడం హర్షదాయకం అన్నారు.ఈకార్యక్రమంలో ఆదర్శ ఉపాధ్యాయుని చదలవాడ రత్నకుమారి, చందు అనురాధ,కన్నెగంటి మోనిక, కే శ్రీలక్ష్మి, బొల్లిముంతకృష్ణ, తుంగా బాలస్వామి,దేవరపల్లి నీలాంబరం, చందు నాగేశ్వరరావు, శనగనపల్లి ఉమామహేశ్వరరావుతదితరులుపాల్గొన్నారు.ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు.



30-8Pg5exTCL:30-8Pg5exTCL.qxd 29/Aug/26 10:27 PM Page 1



# మృత్యువుకు 30 సెకన్ల దూరంలో..

## ఒకేఒక్క మెసేజ్ 8 మంది ప్రాణాలు నిలిపింది

**ఖాట్మాండు, ఆగస్టు 29:** ప్రకృతి కోపానికి నేపాల్‌లోని రసువా జిల్లా విలవిల్లాడింది. ఈ నెల 26న నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో అనూహ్యంగా విరుచుకుపడిన మెరుపు పూరలు, బురద, కొండచరియల విధ్వంసంలో వందలాది మంది చిక్కుకున్నారు. అతియే భంగే ఝూర్నా సమీపంలో వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న ఎనిమిది మంది శ్రామికులను ఒక ఎకైక ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన ప్రమాద హెచ్చరిక మృత్యుముఖం నుంచి కాపాడింది. మృత్యువు విరుచుకుపడటానికి సరిగ్గా 30 సెకన్ల ముందు వచ్చిన ఆ అలర్ట్, ఎనిమిది మంది ప్రాణాలను నిలబెట్టిన ఒక అద్భుతంలా మారింది.



**'ఫోన్ చూశా.. కళ్లు ఎత్తేసరికి 10 అడుగుల నీటి గోడ!'**

మెయిలుంగ్ ప్రాంతంలో నిర్మాణ బృందంతో కలిసి పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడు అర్జున్ రెమాల్ తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆయన ఫోన్ ఒక్కసారిగా వైబ్రేట్ అయింది. నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద నిర్మూలన సంస్థ నుంచి వచ్చిన ఆ మెసేజ్‌లో 'క్షణాల్లో ఉప్పెన రాబోతోంది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అని ఉంది. 'నేను ఫోన్ వంక చూసి, అలా తల పైకెత్తేసరికి నా కళ్ల ముందు 10 అడుగుల ఎత్తున బురద, రాళ్లతో కూడిన భయంకరమైన నీటి ప్రవాహం దూసుకొస్తోంది. 'పరుగెత్తండి' అని గట్టిగా అరిచి, ఉన్నపళంగా వెనక్కి తిరక్కుండా పరుగెత్తాను. నేను నా జీవితంలో అంత వేగంగా ఎప్పుడూ పరుగెత్తలేదు. ఆ ఫోన్ చూడటం ఒక్క 30 సెకన్లు లేట్ అయినా.. ఈరోజు మేం ప్రాణాలతో ఉండేవాళ్లం కాము' అని అర్జున్ వివరించారు.

**చీకట్లో కొండలు దాటుతూ.. ప్రాణ భయంతో రాత్రంతా ప్రయాణం**

వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోగా, పరుగెత్తే క్రమంలో అర్జున్ తన చెప్పులు, ఫోన్, సొంత వస్తువులన్నీ కోల్పోయారు. కానీ తనతో ఉన్న ఎనిమిది మంది శ్రామికుల ప్రాణాలు కాపాడటమే ఆయనకు ముఖ్యమైంది. రాత్రి కాగానే కింద సముద్రంలా మారిన నది వైపు వెళ్లే దారి లేక, శ్రామికులంతా చుట్టూ ఉన్న కొండలు, దట్టమైన అడవుల గుండా చీకట్లోనే నడుచుకుంటూ వెళ్లారు. రాత్రి పది గంటల ప్రాంతంలో కొన్ని ఇళ్లను చూసి, తాము నువాకోట్ జిల్లాలోకి వచ్చామని గుర్తించారు. అక్కడే కొద్దిగా ఆహారం తీసుకుని విశ్రాంతి లేకుండా సురక్షిత ప్రాంతానికి పయనమయ్యారు.

**ఆర్మీ క్యాంపును చేరుకుని ఊపిరి పీల్చుకున్న శ్రామికులు**

మరుసటి రోజు గురువారం మధ్యాహ్నానికి, వారంతా నేపాల్ ఆర్మీ ఏర్పాటు చేసిన బిదూర్ రెస్క్యూ బేస్‌కు చేరుకున్నారు. ఆర్మీ క్యాంప్ వద్ద తమ కుటుంబ సభ్యుల కోసం కన్నీళ్లతో వెతుకుతున్న బాధితులను చూసి అర్జున్ కలచివేతకు గురయ్యారు. వరదలు వచ్చిన రోజు సాయంత్రం 5 గంటల తర్వాత సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఎందరో కొట్టుకుపోయి ఉంటారని, ఆ సమయంలో అక్కడ ఉన్న వారు బతికే అవకాశాలు చాలా తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రకోపించినా, సకాలంలో వచ్చిన ఒక్క ఎస్ఎంఎస్ ఆ ఎనిమిది మంది శ్రామికుల కుటుంబాల్లో వెలుగులు నింపింది.



## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్మీనాథ్‌గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ మా సహోద్యోగి లక్ష్మీనాథ్‌గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగశాఖ కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగాఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్మీనాథ్ గోపిశెట్టి నేపథ్యంచూస్తే ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవంఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబిఎం, పిడబ్ల్యూసీ, హెచ్‌సిఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.



## సిఎంల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ప్రజల్లో అసంతృప్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమ ముఖ్యమంత్రుల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ నిర్వహించిన సర్వేలో మూడు రాష్ట్రాల్లోని ఆరువేల మందికి పైగా ఓటర్లను ఈనెల 25 వరకు ప్రశ్నించారు. దీనితో పాటు ఇండియా సీ ఓటర్ సర్వేలో జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది అభిప్రాయాలను సేకరించారు. పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పోల్చుకుంటే ఉత్తరప్రదేశ్‌లోనే ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా కనిపించింది. 49 శాతంమంది తమ ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే ఎమ్మెల్యేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై అభిప్రాయం కొంత మెరుగ్గా ఉంది. 41.8 శాతం మంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయగా, 38.4శాతం మంది అసంతృప్తి తెలిపారు. యుపిలో ప్రధాన ఎన్నికల సమస్యగా నిరుద్యోగం 23.1 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రైతుల సమస్యలు 14.1 శాతం, విద్యవైద్యం 13.7 శాతం, ద్రవ్యోల్బణం 12.2 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సర్వే ప్రకారం బీజేపీ నేతృత్వంలోని కూటమి 41.8 శాతంతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కూటమికి 38.7 శాతం మద్దతు ఉంది. ఉత్తరాఖండ్‌లో సిఎం పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై 39.1 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేయగా, 38.1 శాతం మంది అసంతృప్తిగాఉన్నారు. ఎమ్మెల్యేల విషయంలో పరిస్థితి మరింత ప్రతికూలంగా ఉంది. 48 శాతంమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, కేవలం 27.1 శాతంమంది సంతృప్తి తెలిపారు. పంజాబ్‌లోనూ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఎక్కువగానే ఉంది. 45.3 శాతం మంది తమ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 32.2 శాతం మంది మాత్రమే సంతృప్తి తెలిపారు. అయితే సిఎం భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వంపై 40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. 35.4 శాతం మంది అసంతృప్తి తెలిపారు.

### రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ

## సిబిఐకి పట్టుబడిన జిఎస్టీ అధికారులు

**ముంబయి, ఆగస్టు 29:** మహారాష్ట్రలో భారీ లంచం కేసు వెలుగులోకి వచ్చింది. రూ.40 లక్షల లంచం తీసుకున్నారనే ఆరోపణలపై ఇద్దరు జిఎస్టీ అధికారులతో పాటు మరో వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్ట్ చేసింది. ఈ ఘటన రాయ్‌గఢ్ జిల్లాలో చోటుచేసుకుంది. స్టోన్ క్వారీకి సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు తొలుత రూ.1.50 కోట్ల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం చర్చల తర్వాత ఆ మొత్తాన్ని రూ.40 లక్షలకు తగ్గించినట్లు సిబిఐ తెలిపింది. ఈ కేసులో సిజిఎస్టీ అదనపు కమిషనర్ వినయ్ కుమార్ కాంతేటి, జిఎస్టీ సూపరింటెండెంట్ రాకేష్ కుమార్ సిన్హా, మరో వ్యక్తి నరేందర్ రాజ్‌పుత్‌లను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులపై లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన ఆరోపణలతో దర్యాప్తు చేపట్టినట్లు సిబిఐ వెల్లడించింది. ఫిర్యాదుదారుడికి చెందిన రాతి క్వారీయింగ్ సంస్థకు సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు రూ.1.50 కోట్లు లంచంగా ఇవ్వాలని సూపరింటెండెంట్ డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈనెల 26న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

లంచం మొత్తంపై జరిగిన చర్చల అనంతరం తొలుత డిమాండ్ చేసిన రూ.1.50కోట్లను రూ.40 లక్షలకు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ లంచం మొత్తాన్ని వసూలు చేసే బాధ్యతను నిందితులైన ప్రభుత్వ అధికారులు నరేందర్ రాజ్‌పుత్‌కు అప్పగించినట్లు ఎర్కొంది. అధికారులు పన్నిన ఉచ్చులో నరేందర్ రాజ్‌పుత్ రూ.40 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని అధికారులు తెలిపారు. అతని అరెస్టు అనంతరం కేసులో మరింత దర్యాప్తు చేపట్టిన సిబిఐ సంబంధిత జిఎస్టీ అధికారులపై కూడా చర్యలు తీసుకుంది. లంచం వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న సమయంలో వినయ్ కుమార్ కాంతేటి, రాకేష్ కుమార్ సిన్హా కూడా లంచం స్వీకరణకు సంబంధించిన ఆరోపణలను అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను సిబిఐ దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురానుంది.

### విదేశీ సహాయక బృందాల సాయాన్ని

## అంగీకరించిన నేపాల్



**ఖాట్మండు, ఆగస్టు 29:** విదేశీ రెస్క్యూ బృందాలు తమ దేశం వచ్చి సహాయం చేయడానికి నేపాల్ అంగీకరించని సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయంతో నేపాల్ తన నిర్ణయం మార్చుకుంది. విదేశీ సహాయక బృందాలను అంగీకరించాలని నిర్ణయించింది. పరిమితంగా మాత్రమే విదేశీయుల్ని అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. బుధవారం నేపాల్‌లో భారీ వరద సంభవించడంతో 600 మంది వరకు మరణించగా, మరో 1,500 మంది వరకు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు నేపాల్ రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా చాలా మంది ఆచూకీ దొరకలేదు. ఇదే సమయంలో తమ బృందాల్ని సహాయక చర్యల కోసం పంపిస్తామని ఇండియాతోపాటు అమెరికా వంటి దేశాలు చెప్పాయి. అయితే, తమకు ఏ దేశ సహాయం అవసరం లేదని, తమ దేశంలోని రెస్క్యూ బృందాలే ఈ చర్యలు చేపట్టగలవని నేపాల్ తెలిపింది. గాలింపు, సహాయక చర్యలకోసం విదేశాల సాయాన్ని తిరస్కరించింది. అయితే, తమ దేశానికి ఆర్థిక సాయం అందించవచ్చని మాత్రం కోరింది. అది కూడా దేశంలోని సహాయనిధికి అందించాలని సూచించింది. కానీ, నేపాల్ తమ సాయాన్ని తిరస్కరించడంపై విదేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అనుకున్నట్లుగా సహాయక చర్యలు కొనసాగడం లేదు. అక్కడి సిబ్బంది శక్తికి మించిన భారంగా మారింది. పరిస్థితి ఊహించినదానికంటే భిన్నంగా ఉంది. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా గల్లంతైన వారిని గుర్తించడంలో నేపాల్ విఫలమైంది. అటు విదేశాల నుంచి సాయం కోసం ఒత్తిళ్లు ఇటు సహాయక చర్యలు సరిగ్గా కొనసాగకపోవడంతో నేపాల్ కాస్త వెనక్కు తగ్గింది. రెస్క్యూ చర్యలకోసం విదేశాలకు అనుమతించింది. గాలింపు, సహాయక చర్యల కోసం తమ బృందాలను పంపించేందుకు విదేశాల నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇదే సమయంలో కొన్ని దేశాలకు చెందిన పౌరులు కూడా గల్లంతయ్యారు. తమ వారిని గాలించేందుకు సహాయక చర్యలకు సిద్ధంగాఉన్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో అర్హులైన కొందరు నిపుణుల్ని అనుమతిస్తున్నాం అని నేపాల్ ప్రకటించింది. నేపాల్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం ఉంది. నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇండియాతోపాటు పలువురు చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వారిని రక్షించడంలో నేపాల్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడంలేదు. ఈ నేపథ్యంలో ఆయాదేశాలు నేపాల్‌పై ఒత్తిడి తేవడంతో, నేపాల్ విదేశీ సహాయక బృందాలకు అనుమతించింది.

## ఉద్యోగంపోతే వెంటనే అమెరికా వీడాల్సిందే!




**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నిపుణులకు మరింత ఆందోళన కలిగించే పరిణామాలు ఎదురవుతున్నాయి. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉపాధి వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు వీలు కల్పించే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేసే ప్రతిపాదనపై ట్రంప్ యంత్రాంగం తన సమీక్షను పూర్తి చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, ముఖ్యంగా భారతీయ టెక్కీలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) 60 రోజుల విచక్షణాధికార గ్రేస్ పీరియడ్ తొలగింపు అనే పేరుతో ఈ ప్రతిపాదనను ఈనెల 6న వైట్‌హౌస్‌కు పంపింది. 27న దీనిపై సమీక్ష ముగిసింది. కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదన వైట్‌హౌస్ ఆమోదం పొందినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన పూర్తి వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంది. తదుపరి దశలో ఈ ప్రతిపాదిత నియమాన్ని ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించి, ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత నిబంధన ప్రకారం హెచ్1బీ, ఎల్1, ఓ1 వంటి తాత్కాలిక ఉపాధి వీసాలపై ఉన్నవారు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల వరకు అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో వారు కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడం, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్చుకోవడం లేదా దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై ప్రెసిడెంట్స్ అడ్వైజరీ కమిషన్ ఆన్ ఏషియన్ అమెరికన్స్ మాజీ సభ్యుడు అజయ్ జైన్ భూటోరియా తీవ్రంగా స్పందించారు. ఇది అమానవీయమైన, ఆచరణకు సాధ్యం కాని నిర్ణయమని ఆయన విమర్శించారు. "ఉద్యోగం కోల్పోయిన నిపుణులకు 60 రోజుల సమయమే చాలా తక్కువ. అలాంటిది దాన్ని పూర్తిగా తొలగిస్తే, ఆ కుటుంబాలు తమ ఇళ్లు సర్దుకోవడానికి, పిల్లల చదువుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కూడా సమయం ఉండదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## వేదిక శుద్ధీకరణపై భగ్గుమన్న రాహుల్

### బిజెపిలో గూడుకట్టిన అంటరానితనానికి నిదర్శనమని ధ్వజం




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. మల్లికార్జునఖర్గే కొద్దిరోజులక్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు. మరుసటి రోజు కొందరు బిజెపి అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బిజెపి ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదికఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈవిషయంలో ప్రధాని మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు.

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా క్షిపణుల దాడి

**క్యీవ్, ఆగస్టు 29:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. కీవ్‌సమీపంలోని బుచాజిల్లాలో 27 మంది మరణించారు. ఈ దాడుల్లో 50 ఇళ్లు దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగిందని, పలుచోట్ల నివాసాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ మైలా గ్రామంలోని ఓ గోదాముపై దాడి జరిగిందని, తర్వాత భారీ పేలుడు సంభవించిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎలాంటి పేలుడు సామాగ్రి ఉంచారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. నివాస ప్రాంతాల్లో మందుగుండు సామాగ్రి చేయడంపై నిల్వ సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇప్పటికే 370 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరసగా మూడు రోజుల నుంచి కీవ్‌ను రష్యా టార్గెట్ చేస్తోంది. రాజధాని ప్రాంతంపై రష్యా నిరంతరం వైమానిక దాడులు చేస్తోంది.

### ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ


## కొత్త ప్రతిపాదనలు

### సుప్రీంకోర్టుకు ముసాయిదా అందజేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 29:** ప్యాకేజ్డ్ ఫుడ్స్ పరంగా కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ కొత్తప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఫ్రంట్ ఆఫ్ ప్యాకెట్ వార్నింగ్ లేబుల్స్‌కు సంబంధించి దాఖలైన కేసులో సుప్రీంకోర్టు గతంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి కీలక సూచనలు చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆ ఆహారానికి సంబంధించిన ప్రభావాల్ని చూపించే లేబుల్స్ ఉండేలా చూడాలని కోర్టు ఆదేశించింది. దీనివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్తున్న ఫుడ్ ఎలాంటిదో ఒక అంచనాకు రాగలుగుతారు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వార్నింగ్ లేబుల్స్‌ను అమలు చేయడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆలస్యం చేసింది. దీనిపై స్పందించిన కోర్టు ఆహార తయారీ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా కోర్టుకు ఆరు పేజీల అఫిడవిట్ సమర్పించింది. ఎక్కువ ఉప్పు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ చక్కెర ఉండే పదార్థాలున్న ఫుడ్ ప్యాకేజ్‌పై రెడ్ లేబుల్ ఉండేలా చూస్తామని కోర్టుకు తెలిపింది. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోని కీలక అంశాలివి. ప్యాకెట్ల ముందు భాగంలో ఆరు కోణాలుండే ఎరుపు రంగు మార్క్ ఉంటుంది. దీనర్థం ఆ ప్రొడక్ట్‌లో అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు ఉన్నాయని. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆఫ్ ద ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ 2024లో సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఒక ఉత్పత్తిలోని పోషక విలువల్నిగుర్తిస్తారు. ఈప్రమాణాల ప్రకారం అధిక స్థాయిలో హానికర పదార్థాలుంటే రెడ్ లేబుల్ వేస్తారు. ముందు వైపు పెద్ద సైజులో రెడ్ లేబుల్ వేయడం వల్ల అది చాలా హానికరం అని పిల్లలు, తల్లిదండ్రులు గుర్తించే వీలుంది. అయితే, సహజసిద్ధమైన ఉత్పత్తులకు ఈ రూల్ వర్తించదు. అంటే తేనె, నెయ్యి, ఉప్పు, చక్కెర, నూనె వంటి వాటికి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్ సమర్పించింది. దీనిపై మరో 10 రోజుల తర్వాత విచారణ జరగనుంది. ఆ తర్వాత ఈ నిబంధన అమలుపై కోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

# సంక్షిప్త వార్తలు

## ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన రష్యా



**మాస్కో, ఆగస్టు 29:** ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తూనే రష్యా తన అత్యాధునిక ఆయుధాలను పరీక్షిస్తున్నది. తాజాగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించినట్లు చెప్పింది. ఆర్కన్‌గెల్స్క్ ప్రాంతంలో పెసస్కీ కాస్మోడ్రోటోమ్ నుంచి వార్‌హెడ్‌ను పరీక్షించారు. అయితే ఆ క్షిపణి ఈశాన్య దిక్కుకు ప్రయాణించింది.

## టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసునమోదు

**కోల్‌కతా, ఆగస్టు 29:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీపై కేసు నమోదైంది. కోల్‌కతా పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణలపై కోల్‌కతా హేస్టింగ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈ కేసు నమోదైంది. ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి దారి తీసింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని మమత బెనర్జీ తప్పు పట్టారు.

## భారత్ సరిహద్దుల్లోకి పాక్ డ్రోన్

**శ్రీనగర్,ఆగస్టు 29:** భారత సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ మళ్లీ కుట్రలకు తెరలేపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట శత్రు దేశం నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ప్రత్యక్షం కావడంతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పూంచ్ జిల్లా సరిహద్దుల్లో ఈ సస్పెక్టెడ్ డ్రోన్ కదలికలు కనిపించడంతో మన రక్షణ దళాలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లోని ఆర్మీ బలగాలు రాత్రికి రాత్రే అదనపు నిఘాను ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

## ఘోరప్రమాదం, నలుగురు విద్యార్థులు మృతి

**మధురాంతకం, ఆగస్టు 29:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మదురాంతకం సమీపంలో ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పుదుచ్చేరి టూర్ ముగించుకుని చెన్నైకి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా వెనుక టైరు పేలడంతో వాహనం అదుపుతప్పినట్లు సమాచారం. దీంతో కారు పలుమార్లు పల్టీలు కొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు విద్యార్థులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## జావోజోంగ్‌పై జిన్‌పింగ్ వేటు

**బీజింగ్, ఆగస్టు 29:** చైనా సైన్యంలో కీలక జనరల్, 2017 డోక్లామ్, 2020 గల్వాన్ ఘర్షణకు బాధ్యుడిగా భావిస్తు జావో జోంగ్‌కిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చర్యలు తీసుకున్నారు. జావోను చైనాలోని అత్యున్నత రాజకీయ సలహా సంస్థ అయిన చైనీస్ పీపుల్స్ పొలిటిషియన్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ నుంచి తొలగించడంతో పాటు మరో రెండు కీలక పదవుల నుంచి కూడా తప్పించారు. భారత సరిహద్దులో ఉన్న టిబెట్, షింజియాంగ్ ప్రావిన్సులతో పాటు భారత్‌చైనా సరిహద్దులోని చాలా ప్రాంతాలకు బాధ్యత వహించే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు జావో జోంగ్ నాయకత్వం వహించాడు.

## పుఝల్ జైలులో సిఎం విజయ్ ఆకస్మిక తనిఖీలు

**చెన్నై, ఆగస్టు 29:** తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పుఝల్ సెంట్రల్ ప్రిజన్1లోని పలు విభాగాలను సిఎం విజయ్ పరిశీలించారు.

# విజ్ఞాన్స్‌లో ఘనంగా ఏజెంటిక్ ఏఐ డే-2కే26

**-కృత్రిమ మేధస్సుతో సృజనాత్మకత, ఆవిష్కరణలకు విద్యార్థులు పదును పెట్టాలి**

**-విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

**- విద్యార్థుల్లో ఏఐ నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలు నిపుణులతో ముఖాముఖి**

**పొన్నూరు, ఆగస్టు 29,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో వివిధ విభాగాల విద్యార్థులు, అధ్యాపకుల చురుకైన భాగస్వామ్యంతో ఏజెంటిక్ ఏఐ డే-2కే26 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయిక వినియోగాలకు మించి కృత్రిమ మేధస్సు(ఏఐ) సామర్థ్యాలను అన్వేషించేలా విద్యార్థులను ప్రోత్సహించడం, ఏఐని సృజనాత్మకత, తార్కిక,



ఆలోచన, పరిశోధన, సమస్య పరిష్కారం, ఆవిష్కరణలకు సాధనంగా వినియోగించుకునేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్య, పరిశోధన, పరిశ్రమ రంగాల్లో ఏఐ భవిష్యత్‌లో మరింత కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ఏఐని కేవలం ఒక సాంకేతిక సాధనంగా ఉపయోగించకుండా, సృజనాత్మకంగా ఆలోచించడం, సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం, పరిశోధనలు చేపట్టడం, వినూత్న ఆలోచనలను అభివృద్ధి చేయడం వంటి అంశాలకు వినియోగించుకోవాలని డాక్టర్ లావు రత్తయ్య సూచించారు. మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమలో నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

**సృజనాత్మకత, ఆవిష్కరణలకు వేదిక:**

ఏజెంటిక్ ఏఐ డే-2కే26 విద్యార్థులకు ఏఐతో ప్రయోగాలు చేసేందుకు, తమ సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఆసక్తికరమైన వేదికగా నిలిచింది. కో-రైట్ విత్ ఏఐ, ఫ్యూచర్ ఫ్రేమ్ ఏఐ: ఫ్రమ్ నౌటు నెక్స్ట్, ఏఐ ఇన్నోవేషన్ ఐడియా ఛాలెంజ్, ఏఐ ట్రెజర్ హంట్, ఏఐ విజువలైజేషన్ ఛాలెంజ్, ఏఐ ఇమేజ్ జనరేషన్, ఏఐ యానిమేషన్ జనరేషన్, ఏఐ క్విజ్, ఏఐ ఫర్ గ్రీన్ ప్లానెట్, ఏఐ లిటరేచర్ రివ్యూ, ఏఐ పోస్టర్ ప్రజెంటేషన్, ఏఐ మీట్స్ కాన్‌స్టిట్యూషన్, డికోడింగ్ హెరిటేజ్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భాష, గణితం, గణాంకాలు, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు తదితర విభిన్న విద్యా విభాగాలను ఏఐతో అనుసంధానం చేస్తూ కార్యక్రమాలను రూపొందించారు. లాంగ్వేజ్-లాజిక్-డిస్కవరీ-ఇన్నోవేషన్ అనే ప్రధాన భావనతో విద్యార్థులు ఏఐని విభిన్న కోణాల్లో అర్థం చేసుకునేలా, తమ విద్యా రంగాల్లో దాని ఆచరణాత్మక వినియోగాన్ని అన్వేషించేలా ప్రోత్సహించారు.

**నిపుణులతో విద్యార్థుల ముఖాముఖి:**

కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ఆయా విభాగాల అధ్యాపకులు విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ఏఐలో వస్తున్న తాజా పరిణామాలు, భవిష్యత్ అవకాశాలు, వివిధ రంగాల్లో ఏఐ వినియోగం తదితర అంశాలపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**బాధ్యతాయుత ఏఐ వినియోగంపై విద్యార్థుల ప్రతిజ్ఞ:**

కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఏఐ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా, నైతిక విలువలతో, బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సమాజ శ్రేయస్సుకు, దేశ అభివృద్ధికి దోహదపడేలా ఏఐని ఉపయోగిస్తానని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సాంకేతిక అభివృద్ధితో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత కూడా ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ ప్రతిజ్ఞ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించారు. ఏఐ ద్వారా లభించే సమాచారాన్ని బాధ్యయుతంగా వినియోగించడం, సాంకేతికతను సానుకూల ప్రయోజనాల కోసం ఉపయోగించడం వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.

**రూ.1లక్ష నగదు బహుమతులు:**

వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం రూ.1లక్ష విలువైన నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు వారి భాగస్వామ్యాన్ని గుర్తిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, ప్రొఫెసర్ పీఎంవీ రావు, అడ్వైజర్, మాజీ డీజీపి డాక్టర్ మాలకొండయ్య, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్ల రామయ్య సేవలకు గుర్తింపు ఎమ్మెల్సీ పదవి

**ప్రత్తిపాడు, ఆగస్టు 29, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు మార్కెట్ సెంటర్ వద్దనున్న




వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం గుంటూరు జిల్లా టిడిపి అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ హాజరయ్యారు. ప్రారంభంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగు చలనచిత్ర నటుడు, యుగపురుషుడు, రాజకీయాలకు సరికొత్త అర్థం చెప్పిన మహానాయకులు, తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత, స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి, ఘన నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు వర్ల రామయ్యను గజమాలతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అతిథులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఇక్కడ ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన సభలో పాల్గొనడం మాకు చాలా గర్వంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, అంకితభావంతో, నిబద్ధతతో ప్రజాసేవలో కొనసాగుతున్న వర్ల రామయ్యకు లభించిన ఈ గౌరవం తెలుగుదేశం పార్టీకి, పార్టీ శ్రేణులకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గళమెత్తిన వర్ల రామయ్య సేవలకు ఎమ్మెల్సీ పదవి మరింత గుర్తింపు తీసుకువచ్చిందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ ఆదేశానుసారం ఎన్నో పోరాటాలు చేసి విజయ బావుటాకు నాంది పలికిన వ్యక్తి వర్ల రామయ్య అన్నారు. వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి వర్ల రామయ్య బయటకు వచ్చాడంటే వారికీ గుండెల్లో రైళ్లు పరుగెత్తేవని వివరించారు. రాష్ట్రంలో దళిత నాయకులు రాజకీయంగా ఎదగడానికి అంబేద్కర్ రాజ్యాంగం సృష్టిస్తే దానికి వర్ల రామయ్య మా అందరికీ ఆదర్శ ప్రాయుడుగా నిలిచారని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడే నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, అర్హతకు, అనుభవానికి, నిబద్ధతకు సముచిత గౌరవం కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ నిర్ణయాలు ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యారావుకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పొన్నూరు, వేమూరు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, తిరువూరు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, నక్కా ఆనందబాబు, మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, కొలికపూడి శ్రీనివాసరావు, దేగల ప్రభాకర్, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్29, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన డాక్టర్ డి.శ్రీనివాస్, డా.ఎం.శ్యాంసుందర్‌లు సీఎంతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దీర్ఘకాలంగా తాము పనిచేస్తున్నామని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల సేవలను జీఓ ఎంఎస్. నెంబరు114 ప్రకారం క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెం.46, జీఓ ఎంఎస్ నెం.14 ప్రకారం మాకు యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలని విన్నవించారు. తద్వారా మా కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు. అలాగే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో తమ దీర్ఘకాలిక బోధన అనుభవం, అర్హతలు, ఏపిఐ స్కోర్‌లను యూజిసి నిబంధనల ప్రకారం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా జీఓ ఎం.ఎస్ నెంబరు 20 ప్రకారం యూజిసి పే స్కేల్ పొందిన వారికే అర్హత అనే నిబంధన కారణంగా తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. తమకు తగిన మినహాయింపు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను తానుకూలంగా విన్న సీఎం చంద్రబాబు స్పందిస్తూ మీ సమస్యలను పరిష్కరించే దిశగా న్యాయపరమైన ప్రయోజనాలు కల్పిస్తామని వారికి సూచించారు. సీఎం స్పందించిన తీరుపై కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా వారు వర్సిటీ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 35వ రోజుకు చేరుకున్నాయి.

# ఘనంగా భాషా,క్రీడా దినోత్సవాలు

**పొన్నూరు, ఆగస్టు 29,ప్రభాతవార్త:** పట్టణంలోని నేతాజీనగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని, అదేవిధంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషను చక్కగా నేర్చుకోవాలన్నారు. తద్వారా ఇతర భాషలను నేర్చుకోవడం సులభమవుతుందన్నారు. తెలుగు భాషకు విశేషమైన కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులుగారి జయంతినే తెలుగు భాషా దినోత్సవం జరుపుకోవడం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదువులోనూ,



ఆటల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం తెలుగు పండితులు కె.అన్నపూర్ణ, ఎల్.సుభాషిణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ప్రసాద్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎండి జీవల్ హక్, సిహెచ్ నాగశ్రీనివాసరావు, ఆదే బుజ్జి తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

# చిన్నతనంలోనే శతక పద్యాలు నేర్పించాలి

**-లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు శేషుకుమారి**



**పొన్నూరు, ఆగస్టు 29,ప్రభాతవార్త:** చిన్నారులకు చిన్నతనంలోనే శతక పద్యాలు నేర్పించడం ద్వారా వారిలో సృజనాత్మకత వెల్లివిరిసే అవకాశం ఉందని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు పరాశరం శేషుకుమారి సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ తెలుగు భాష నేర్చుకోవడం ద్వారా ఇతర భాషలు నేర్చుకోవడం సులభమవుతుందన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హాకీ మా ంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ సుభాషిణి, మన్నవ అనసూయాదేవి, పరాశరం రంగవల్లి, ఎం.అమరేశ్వరి, కె.విజయలక్ష్మి, పి.మోహనలక్ష్మి, పి.నిర్మల, పి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య రథసారథి నందమూరి హరికృష్ణ సేవలు చిరస్మరణీయం

**మంగళగిరి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** చైతన్య రథసారథి, నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ



నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లోని నందమూరి తారక రామారావు, డాక్టర్ ఎంఎస్ఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి, నందమూరి హరికృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో హరికృష్ణ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. చైతన్య రథసారథిగా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో నందమూరి హరికృష్ణకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన నిరాడంబర జీవితం, ప్రజల పట్ల ఉన్న అభిమానం, పార్టీ పట్ల చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అబద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యన్నారాయణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజాయరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, గోవాడ దుర్గారావు, తోట శ్రీనుబాబు, తోట కరుణ కుమార్, పీల్లెళ్ళ గంగాధర్ పాల్గొన్నారు.

# సమాజ ప్రగతికి మహిళా సమానత్వమే మూలస్తంభం

**కెఎల్‌యు సైకాలజిస్ట్ శంకరి.**

**తాడేపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెఎల్ యు ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఖిమహిళా సమానత్వ దినోత్సవ చైతన్య ర్యాలీఖి ఘనంగా నిర్వహించారు. స్త్రీ విద్యే సమాజ వికాసానికి పునాది. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించినప్పుడే పరిపూర్ణమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్య వక్త సైకాలజిస్ట్ శంకరి పేర్కొన్నారు. చిర్రావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మహిళా సమానత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ గ్రామంలో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఆడపిల్లలకు నాణ్యమైన విద్యనందించడం ద్వారానే వారి ఆర్థిక, సామాజిక సాధికారత సాధ్యమవుతుందని వక్త శంకరి స్పష్టం చేశారు. చట్టసభలు, ఉద్యోగాలు, నాయకత్వ బాధ్యతల్లో మహిళలు తమ హక్కులను పంచుకోవాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు, స్థానికులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు "మహిళా హక్కులను కాపాడుదాం సమానత్వాన్ని సాధిద్దాం" అంటూ ప్లాకార్డులతో ఊరేగింపు నిర్వహించి సమాజంలో లింగ వివక్షను అడ్డుకోవాలని



నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కెఐ.పవన్ కుమార్, విద్యార్ధి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కె. ఆర్. ఎస్. ప్రసాద్, అసోసియేట్ డీన్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఖాన్, ఉమెన్స్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, విఈసీ హెచ్ఓడీ డాక్టర్ పవన్ కుమార్, ఈవెంట్ కోఆర్డినేటర్ ఎ.విజయ రత్నం, సిఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో పాటు విఈసీకి చెందిన మానసిక నిపుణులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# కుష్టువ్యాధిగ్రస్తుల పిల్లలకు డబల్ హార్స్ వారి ఆర్థిక సహాయం అందజేత

**తెనాలి ఆగస్ట్ 29(ప్రభాతవార్త):** కుష్టు వ్యాధిగ్రస్తుల పిల్లల విద్యకు డబుల్ హార్స్ మినప గుళ్ళు సంస్థ శనివారం ఆర్థిక సహకారం అందించారు. తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ళు ప్రతినిధులు లెప్రా సొసైటీ వారిచే కుష్టువ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత చదువులకు సహకారం అందించే నిమిత్తం ఆర్థిక సహాయాన్ని తెనాలి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమోళి ,డిపిఎమ్ఓ జంగంశ్యామ్ చేతుల మీదుగా ద్వారా చెక్కును విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక మాట్లాడుతూ, తమ సంస్థ తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ వారి సహకారంతో పదిమంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. సంస్థ ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్ భాష మాట్లాడుతూ, ఈ సహాయాన్ని తమ ఆపరేషన్ ఏరియాలో విద్యార్థినీ విద్యార్థులకు అందజేస్తూ తెనాలిలో ఈ చెక్కులను సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమోళి ద్వారా బ్యాంకు చెక్కును ఇప్పించడం జరిగినదన్నారు. ఈ సందర్భంగా డబుల్ హార్స్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోఆర్డినేటర్ సాతిరి రమణయ్య, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్దంటి రవికుమార్ ,సూపర్వైజర్ తిరువీధుల శివరామప్రసాద్ ,మల్లోల యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# పాస్టర్లకు ఆర్థిక సహాయం అందించిన ఆర్ఈఐ సంస్థ

**తెనాలి ఆగస్ట్ 29(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని ప్యాడిసన్ పేటలో గల దివంగత బిషప్ గద్దం థామస్ ప్రాంగణంలో ఆయన స్థాపించిన ఆర్ ఈ ఐ సంస్థ ద్వారా పాస్టర్లకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. శనివారం ఆ సంస్థ 70 మంది పాస్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని



నిర్వహించింది. నిర్వాహకులు బిషప్ డాక్టర్ గద్దం సాధువు థామస్ జూనియర్ పర్యవేక్షణలో జరిగిన ఆ కార్యక్రమంలో తొలి విడతగా ఎంపిక కాబడిన 40 మంది పాస్టర్లకు నాలుగు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం గద్దం సాధు థామస్ జూనియర్, అతిథులుగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొల్లపూడి రాజు, రెవరెండ్ గిద్యోను లు అందించారు. ఆ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిషప్ డాక్టర్ గద్దం సాధుతామస్ జూనియర్ మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను అనుసరిస్తూ మా తండ్రి దివంగత బిషప్ గద్దం థామస్ ఆశయాల కనుగుణంగా సంస్థ ద్వారా పాస్టర్లకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. సేవకులు సంతోషంగా జీవించాలని ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో 70 మంది పాస్టర్లు ఉన్నారు.

# రుణాలు తీసుకోండి...

# అభివృద్ధికే వినియోగించండి : ఏపిఎం రమాదేవి

**కొల్లిపర,అగస్టు 29 ప్రభాతవార్త:** బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలని డిఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో పొదుపు



సంఘాల సభ్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి..రికార్డులు పరిశీలించి..రుణాలపై తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువుగా చేసుకుంటే అధికంగా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను నిర్ణీత వ్యవధిలో చెల్లించాలన్నారు. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నెల..నెలా డ్వాక్రా మహిళలు సమావేశం ఏర్పాటు చేసుకోవటం మంచిదన్నారు. సమావేశంలో సీసీలు బుజ్జిబాబు, విజయకుమార్, ప్రమీలాదేవి, టి.మధు, ఎమ్ ఎస్ ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రసిద్ధ గాయని జానకికి నివాళిగా స్వరనిరాజనం

**తెనాలి మున్సి పాలిటీ,ఆగస్ట్ 29,(ప్రభాతవార్త):** తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం సుప్రసిద్ధ గాయని ఎస్.జానకి కి నివాళులు అర్పించే కార్యక్రమంలో భాగంగా ఆర్కెస్ట్రా సైదా ఆధ్వర్యంలో



జానకి అమ్మగారి పాటల స్వరనీరాజనం సమర్పించారు ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ తెనాలి ప్రాంత కళాకారులు ప్రాంతానికి దేశానికే పేరు తెచ్చిన మహనీయులని అందుకు ఎస్. జానకి తెనాలి ప్రాంత రేపల్లె పక్కన పల్లపట్లలో జన్మించటం ఒక ఉదాహరణగా ఉంటుంది అని తెలియజేశారు ఆమె వివిధ భాషలలో ఎన్నో పాటలు పాడి ఎన్నో అవార్డులు అందుకున్నారని. అన్నారు. డాక్టర్ పురుషోత్తం రావు మాట్లాడుతూ,ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన సైదాని అభినందించి సంగీత కార్యక్రమాలను ఆస్వాదించే తెనాలి ప్రాంత ప్రజలకి చక్కని కార్యక్రమం అని కొనియాడారు కాలేషా డెకరేషన్ వారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాఖ్యాతగా ఉపాధ్యాయుడు సినీ రచయిత మహమ్మద్ సాబీర్. ప్రతినెల ఒక సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. గాయని గాయకులు అలీ ఖాన్. శైలజ. మల్లికా. సైదా. గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో.కొత్త సుబ్రమణ్యం పుర ప్రముఖులు విచ్చేసి ఎస్ జానకి కి నివాళులర్పించి కళాకారులను అభినందించారు

# వైద్య పరీక్షలు చేయించుకోండి

**-మండల వైద్యాధికారి ప్రియాంక**


కొల్లిపర,అగస్టు 29 ప్రభాతవార్త: మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నవరం గౌడపాలెంలో వైద్యాధికారులు సంచార చికిత్స



కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ గర్భిణీలు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌సీ జానీబేగం, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ రెండో తేదీ చేనేత సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయండి : గొట్టిముక్కల

**చెరుకుపల్లి ,ఆగస్టు 29, ప్రభాతవార్త:** చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని కనగాల ,రాజోలు ,గుల్లపల్లి, చెరుకుపల్లి గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా కార్యచరణ నాయకులు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు తక్షణ బకాయిలు వెంటనే చెల్లించాలని ,పాలకవర్గం ఎన్నికలు నిర్వహించాలని,



జీఎస్టీ ని రద్దు చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ రెండో తేదీన రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని శ్రీ మార్కండేయ పద్మశాలియ కళ్యాణ మండపంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, ఐక్య కార్యాచరణ కమిటీ నిర్వహణ కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం ద్వారా భవిష్యత్ కార్యాచరణ తయారు చేయనున్నట్లు సభ్యులు మురుగుడు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మర్రివాడ వెంకటరావు, కె శివరామకృష్ణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కొండపాటూరు పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**ప్రత్తిపాడు (కాకుమాను), ఆగస్టు 29, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, కాకుమాను మండలం, కొండపాటూరు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ ఆలయ హుండీలోని కానుకలను శనివారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి ఆగస్టు 29వతేదీ వరకు128 రోజులకు రూ.15,92,629లు నగదును భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి సమర్పించినట్లు ఆలయ ఈవో జక్క శ్రీనివాసరావు తెలిపారు. గతంలో కంటే రూ.3,26,900లు అధికంగా భక్తుల నుంచి అమ్మవారికి కానుకలు వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపు



కార్యక్రమం బాపట్ల దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎం.గోపి, ఆలయ ఛైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ధర్మకర్తల మండలి సభ్యులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భూమా వీర వెంకట బాపారావు, అర్చకులు రామచంద్రరావు, చైతన్య గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 29,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 18సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈ ఆదివారం కేన్సర్ వ్యాధి-లక్షణాలు-చికిత్స విధివిధానాలు అన్న అంశంపై ఆరోగ్యసభ ఏర్పాటుచేయబడింది. ఆగస్టు 30ఆదివారం ఉదయం 11గంటలకు అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభలో ప్రధానవక్తగా సీనియర్ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ హనీషా పాల్గొంటారన్నారు. ఆరోగ్యాభిలాషులందరూ ఈ ఆరోగ్యసభకు హాజరు కావలసిందిగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు.

# శెరవేగంగా ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్3 పనులు

**రూ.48 కోట్ల సిఆర్డిఏ నిధులతో నిర్మిస్తున్న ఎంజి ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు. కేంద్రమంత్రి పెమ్మసానితో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బూర్ల.**

**ప్రత్తిపాడు, ఆగస్టు 29, ప్రభాతవార్త:** వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురై ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ.48 కోట్ల సిఆర్డిఏ నిధులతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 అభివృద్ధి పనులను కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్



కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు శనివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్ర సహాయమంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3 పూర్తయితే గుంటూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలకు ఉపశమనం లభిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారి నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తోందని వివరించారు. గత వైసీపీ హయాంలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధికి కొత్త ఊపిరి వచ్చిందని, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 1, ఫేజ్ 2 పూర్తిచేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. ఇప్పుడు ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 పనులను చేస్తుంది కూడా తెలుగుదేశం ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, వాణిజ్య, పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాల అభివృద్ధికి కూడా మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని ప్రారంభించడం మాత్రమే కాదని, అది పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించి, పూర్తిచేయడమే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనల అమలుపై స్పెషల్ డ్రైవ్

**గుంటూరు క్రైమ్,ఆగస్టు29,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం,ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా శుక్రవారం సాయంత్రం 4.00 గంటల నుండి రాత్రి 7.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ట్రాఫిక్ అమలు కార్యక్రమం నిర్వహించబడింది.ఈ ప్రత్యేక డ్రైవ్ లో జిల్లాలోని 20 బ్లాక్ స్పాట్లు,మరో 15 ఇతర కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 481 చలానాలు నమోదు చేసి రూ. 2,91,541/ జరిమానా విధించారు.హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై,కార్ లో సీట్ బెల్ట్ ధరించని వారిపై 134 కేసులు.ట్రిపుల్ రైడింగ్‌పై – 15 కేసులు.ప్రమాదకరంగా వాహనాలు నడిపిన వారిపై – 9 కేసులు.రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై – 6 కేసులుమొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై – 16 కేసులు.మద్యం సేవించి వాహనం నడిపిన 10 మందిపై కేసులు నమోదు చేశారు.మైనర్ డ్రైవింగ్ చేసినవారు 14 కేసులు నమోదు చేశారు.ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 272 కేసులు నమోదు చేశారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు,హెల్మెట్ వాడకంపై జిల్లా వ్యాప్తంగా ఉమెన్స్ కాలేజ్,చలమయ్య కాలేజ్,అమరావతి రోడ్డు వై జంక్షన్,పెదకాకాని సి కె కాలేజ్,కేఎల్ యూనివర్సిటీ,బివిఆర్ జడ్పీ హైస్కూల్ ప్రత్తిపాడు,టిటిడి టెంపుల్ వెంకటపాలెం,జె ఎం జి కాలేజ్,గాంధీ చౌక్ తెనాలి,కొల్లిపర కరకట్ట 15 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల ద్వారా 328 మంది డ్రైవర్లు,310 మంది విద్యార్థులు, 310 మంది సాధారణ ప్రజలకు రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.మొత్తం 948 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని,హెల్మెట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగించకుండా డ్రైవింగ్ చేయడం ద్వారా,రాత్రివేళ నిదర ట్రైములో డ్రైవింగ్ చేయ కుండా ఉండటం వలన ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక అమలు డ్రైవ్‌లు,రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు.

# నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని నిరసన

**గుంటూరు విద్య ఆగస్టు 29 ప్రభాతవార్త :** గుంటూరు పొన్నూరు రోడ్లు పరిసర ప్రాంత ప్రజల సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో స్థానికనివాస ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణం లైసెన్సును వెంటనే రద్దు చేయాలనీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.గుంటూరు పొన్నూరు రోడ్డు, చంద్రబాబు నాయుడు కాలనీ మెయిన్ రోడ్డు ఎదురుగా ఏర్పాటు చేయబోతున్న మద్యం దుకాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పరిసర ప్రాంత ప్రజల వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే మద్యం దుకాణం లైసెన్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఇది పూర్తిగా నివాస ప్రాంతమని, ఇక్కడ కుటుంబాలు, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు నివసిస్తున్నారని పేర్కొన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రజారోగ్యం, సామాజిక భద్రతపై ప్రతికూల ప్రభావం పడటంతోపాటు మహిళలు, చిన్నారులకు అసౌకర్యం, భయాందోళనలు కలిగే అవకాశం ఉందన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరగడం, గొడవలు మరియు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోవడం, పరిసరాల్లో చెత్తఅపరిశుభత సమస్యలు ఏర్పడటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నివాస ప్రాంత ప్రజల ప్రశాంతత, భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు.ఈ మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ గుంటూరు పొన్నూరు రోడ్డు, చంద్రబాబు నాయుడు కాలనీ మెయిన్ రోడ్డు ఎదురుగా శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలో పరిసర ప్రాంత ప్రజలు, మహిళలు, యువత, ప్రజాసంఘాలు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఐ తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పారావు మారెళ్ల




**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాయకత్వ శిక్షణా తరగతులు అప్రతిహతంగా కొనసాగుతూ 50 బ్యాచ్‌లను విజయవంతంగా పూర్తి చేసుకున్నాయిఈ శిక్షణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8,300 మందికి పైగా మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులకు పార్టీ సిద్ధాంతాలు, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలపై పక్కా ప్రణాళికతో శిక్షణ అందించడం జరిగింది ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని, శిక్షణ అందించిన "మాస్టర్ ట్రైనర్ల"తో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, మండలక్లస్టర్ స్థాయి నాయకులకు సోషల్ మీడియా వినియోగం, డిజిటల్ వ్యూహాలు మరియు సమకాలీన ప్రచార పద్ధతులపై విశేష శిక్షణ అందించినందుకు గాను,_గిదీశ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ మారెళ్ళ అప్పారావు గారు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా గౌరవ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు పార్టీ క్యాడర్‌ను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే ఇంతటి బృహత్తర కార్యక్రమంలో భాగస్వామి కావడం, అందునా పార్టీ అధినేత, పెద్దాయన చంద్రబాబు గారి చేతుల మీదుగా ఈ ప్రశంస అందుకోవడం పట్ల మారెళ్ళ అప్పారావు గారు హర్షం వ్యక్తం చేశారురానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు, డిజిటల్ రంగంలో తెలుగుదేశం జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లడానికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు

# ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాష క్రీడా దినోత్సవాలు

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** 1928 1932 1936 సంవత్సరములలో వరుసగా జరిగిన ఒలంపిక్ క్రీడలలో బంగారు పతకాలను




సాధించి క్రీడారంగంలో భారతదేశము యొక్క కీర్తి ప్రతిష్టలను దిగంతాలకు వ్యాపింప చేసిన క్రీడాకారులు మేజర్ ధ్యాన్ చంద్ అని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత అన్నారు. గోల్స్ సాధించటంలో ధ్యాన్‌చంద్ ప్రదర్శించిన నైపుణ్యమునకు మంత్రముగ్ధుడైన ఆనాటి జర్మనీ నియంత హిట్లర్ వేదిక దిగివచ్చి మన భారతీయ క్రీడాకారునికి షేక్ హ్యాండ్ ఇవ్వటం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా పరిరక్షణ దినోత్సవాల సందర్భంగా శనివారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ క్రీడాకారులు 90వ ఏట అడుగుపెట్టిన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ సింగారెడ్డి భాస్కర రెడ్డి , రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ పివి సుబ్బారావు గార్లను స్థానిక శారదా జిల్లా పరిషత్ హై స్కూలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర రెడ్డి మాట్లాడుతూ ఈ రోజున జాతి మొత్తం స్పోర్ట్స్ డే జరుపుకుంటుందన్నారు. తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ పివి సుబ్బారావు మాట్లాడుతూ వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా తెలుగు భాషను పరిరక్షించిన మహానుభావుడు గిడుగు రామమూర్తి పంతులు గారని, ఆయన పుట్టిన రోజును తెలుగు భాషా పరిరక్షణ దినోత్సవం గా జరుపుకోవటం చాలా గొప్ప విషయం అన్నారు. ఇదే వేదిక నుండి కవి విమర్శకులు తోటకూర వెంకటనారాయణ మాట్లాడుతూ సవర భాషకు లిపిని కనుగొన్న గిడుగు వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. సన్మాన గ్రహీతలు భాస్కర రెడ్డి సుబ్బారావులు తమకు జరిగిన ఈ సందర్భోచితమైన సన్మానములకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పలు క్రీడలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఇన్నర్ వీల్ సభ్యులు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత, కోశాధికారి తియ్యగోర రమాదేవి, హెడ్మాస్టర్ రత్నజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాసింబుడే, పొదిలి వెంకటేశ్వర్లు, ప్రేమచంద్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ జీవి రాఘవులు, తోటకూర శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

# వికాస్ విద్యాసంస్థల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** స్థానిక వికాస్ స్కూల్ (పెదనందిపాడు రోడ్ క్యాంపస్), జు॥గి ది స్కూల్ (సుబ్బయ్య తోట క్యాంపస్)లలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు అంగరంగ



వైభవంగా జరిగాయి. ప్రముఖ భాషావేత్త, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ దండా పవన్ కుమార్ మాట్లాడుతూ.. పండితులకే పరిమితమైన భాషను సామాన్య ప్రజల వద్దకు చేర్చి, వ్యవహారిక భాషా ఉద్యమానికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని కొనియాడారు. విద్యార్థుల్లో మాతృభాష పట్ల గౌరవం, ఆసక్తి, అభిమానం పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ వేడుకల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గిడుగు జీవిత విశేషాలు, తెలుగు భాష ఔన్నత్యంపై ప్రసంగించారు. అలాగే గేయాలు, పద్యాలు, పొడుపు కథలు, చిలిపి ప్రశ్నలు, వేషధారణ, చిత్రలేఖనం వంటి సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ దండా రోజాశ్రీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దండా రోజాశ్రీ, ప్రిన్సిపాళ్లు శ్యాం బాబు, అప్సరలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కిట్స్ అధ్యాపకురాలు రాగిణికు డాక్టరేట్



**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 29, ప్రభాతవార్త :** మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న శిఖాకొల్లి రాగిణి ఆంధ్ర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందిందని కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలోని ఎంపిక చేసిన ఎన్.బి.ఎఫ్.సిల ఆధారంగా భారతదేశంలో ఎన్బిఎఫ్సి డిజిటల్ పరివర్తన యొక్క నియంత్రణ, కార్యాచరణ మరియు వినియోగదారుల ఫలితాలపై పరిశోధన పూర్తిచేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నట్లు చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ డా.అడ్డాడా నరసింహారావు పర్యవేక్షణలో రాగిణి చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడం తమకెంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. తమ కళాశాలలో అధ్యాపకులను వివిధ పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డా.రాగిణి ని కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె. హరిబాబు, విభాగాధిపతి డా.బి.భానుప్రకాష్, సహ అధ్యాపకులు అభినందిస్తూ ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చైర్మన్ చాంబర్లో డాక్టరేట్ పొందిన రాగిణి కి కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు డాక్టరేట్ పట్టాను అందించి అభినందించారు.

# రోటరీ క్లబ్ అఫ్ ఆదర్శ్ ఆధ్వర్యంలో లక్ష విత్తన బంతులు మహా తయారీ

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రోటరీ క్లబ్ అఫ్ ఆదర్శ్ ఆధ్వర్యంలో లక్ష విత్తన బంతులు మహాతయారీ కార్యక్రమం గుంటూరు చిన్మాయ విద్యాలయంలో ఈ రోజు 29 ఆగష్టు న జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లీజుళీ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్, చిన్మాయ విద్యాలయం,ఇంటర్నేషనల్ స్కూల్, శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య మునిసిపల్ హై స్కూల్, అభ్యుదయ మహిళా కళాశాల విద్యార్థి విద్యార్థునులు 350 మందికి పైగా పాల్గొన్నారు.ముఖ్య అతిథి రోటరీ జిల్లా 3150 గవర్నర్ ఉదయ్ పిలాని మాట్లాడుతూ విద్యార్థులందరూ కనీసం ఒక మొక్కయినా నాటాలని దానికి తమ ఇష్టమైన మంచి మిత్రుని పేరు పెట్టాలని దానిని సంరక్షించాలని కోరారు. రోటరీ సంస్థ "పర్యావరణాన్ని" తమ ఏడవ ముఖ్య వైభవంగా గుర్తిస్తూ మనం కేవలం మొక్కలనే కాకుండా సామాజిక అడవులను కూడా ప్రభుత్వాలతో కలసి అభివృద్ధి చేయాలని క్లబ్ లను కోరారు.రోటరీ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అన్నే శివకుమారి స్వాగతపన్యాసం లో ఈ మహ యజ్ఞం కు నాలుగు నెలలు ముందునుండే ప్రణాళికలు ప్రారంభమైనవని అనేక మంది సహాయసహకారాలతో ఇంతవరకు వచ్చామన్నారు. ఇక ప్రభుత్వ సహాయంతో వీటిని డ్రోన్ ల ద్వారా వెదజల్లాలని అన్నారు.ఇది పర్యావరణ పరిరక్షణలో రోటరీ జిల్లా 3150 లో ఒక మైలురాయి అని రోటరీ జిల్లా పర్యావరణ చైర్మన్ రిజు మోహనరావు అన్నారు.విద్యార్థులు కేవలం వీటి తయారీలోనే గాక ప్రకృతి పట్ల బాధ్యతను, భవిష్యత్ పట్ల ప్రేమను, పచ్చని ప్రపంచాన్ని నిర్మించాలనే సంకల్పం చేపట్టారని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ రేళీ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమం గొప్పదనం లక్ష అనే సంఖ్యలోనే కాదు ఒకే లక్ష్యంతో కలసిన



వందలాది చేతుల్లోవుందని సీనియర్ రొటేరియన్ శ రవీంద్రనాథ్ అన్నారు.క్లబ్ కార్యదర్శి జవ్వాది జయశ్రీ వందన సమర్పణ చేసిన ఈ సభలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ లు వడ్లమాని రాజ్యలక్ష్మి, అన్నే రత్న ప్రభాకర్, తాళ్ళ రాజశేఖరరెడ్డి అతిథులుగా ను, క్లబ్ సభ్యులు శ విజయ వెంకట లక్ష్మి, ద్పీ. రీ పద్మజ, తీ అశోక, శ రాణి, శ శివరంజని, రత్న ప్రియ, అనురాధ, సునీత, వాణి, జయలక్ష్మి,సుస్మిత, ద్పీ. కల్పన మరియు చిన్మయ్య గుంటూరు ఆదర్శ్, ష్మి భ్ధి గుంటూరు ఆదర్శ్, శీదిలీశీలీది గుంటూరు ఆదర్శ్, ఇంటరాక్ట్ క్లబ్ ల సభ్యులు, అభ్యుదయ గుంటూరు ఆదర్శ్ రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు కృత్రిమ మేధ నైపుణ్యాల పెంపు

**గుంటూరు విద్య ఆగస్టు 29 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా విద్యార్థులలో ఉపాధ్యాయుల్లో డిజిటల్ సృజనాత్మకత, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలను పెంపొందించేందుకు అడోబీ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. పలు రాష్ట్ర ప్రభుత్వాలతో భాగస్వామ్యం కుదుర్చుకుని వేలాది ప్రభుత్వ పాఠశాలలకు "అడోబీ ఎక్స్‌ప్రెస్ ఫర్ ఎడ్యుకేషన్‌ను ఉచితంగా అందించను న్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని 7.8 మిలియన్ల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు లబ్ధి పొందనున్నారు. . పీఎం శ్రీ, సీఎం శ్రీ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌తో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. భవిష్యత్ ఉద్యోగాలకు అవసరమైన సృజనాత్మక, ఏఐ నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యమని అడోబీ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ మాలా శర్మ తెలిపారు

# ముగిసిన హరిత సదస్సు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్29, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ హరిత సదస్సు 2026 శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు వీలుగా పర్యావరణ విభాగం జాతీయస్థాయిలో హరిత సదస్సు నిర్వహించడం ఎంతో ముదావహం అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరిష్కార మార్గాలు కనుగొనాలన్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు వాటిని వినియోగించుకునేందుకు నూతన పద్ధతులు సృష్టించాలన్నారు. అనంతరం సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు అధ్యక్షతన సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆచార్య ఏవివిఎస్.స్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా వీసి గంగాధరరావు స్వామి దంపతులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, పాలకమండలి సభ్యులు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు, యూజిసి కోఆర్డినేటర్ ఆచార్య వై.అశోక్‌కుమార్, జగ్జీవన్‌రాం చైర్ కోఆర్డినేటర్ ఆచార్య పి.జె.రత్నాకర్, ఆచార్య తులసీదాసు, డాక్టర్ వి.సుభాషిణి, డాక్టర్ కె.శశిధర్, డాక్టర్ సి.హెచ్.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,30,330 ఆర్థిక సహాయం అందజేత

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన పగడాల జయలక్ష్మి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,30,330/ ఆర్థిక సహాయం



మంజూరైంది.మాజీ మంత్రి వర్యులు, శాసనసభ్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో మంజూరైన ఈ ఆర్థిక సహాయాన్ని నాదెండ్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా జయలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సహాయం అందించడం జరుగుతోందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వేముల నాగేశ్వరరావు, సాతులూరు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా మందిరం 8వ వార్షికోత్సవ వేడుకలకు మర్రిను ఆహ్వానించిన ఆలయ ధర్మకర్త

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణంలోని నరసరావుపేట రోడ్డు సాయినగర్ నందు గల శ్రీ షిరిడి సాయిబాబా మందిరం 8వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 31న అనగా సోమవారం రుద్రాక్షలతో కూడిన సహస్ర కలశాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుందని, ఈ పూజా కార్యక్రమంలో సతీ సమేతంగా పాల్గొనవలసినదిగా శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్



లలితమ్మను వారి నివాసం కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించిన ఆలయ ధర్మకర్త, శ్రీ ద్వారకామయి సద్గురు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డిబీ విజయ్ కుమార్....

## సుమేధ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**గుంటూరు విద్య ఆగస్టు 29 ప్రభాతవార్త:** స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడం జరిగినది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైనటువంటి బ్రహ్మకుమారీస్ మోటివేషనల్ స్పీకర్ కుమారి శిరీష రక్షాబంధన్ పండుగ జరుపుకోవడానికి గల కారణాలు మరియు పండుగ యొక్క





విశిష్టతను, ప్రముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రక్షాబంధన్ అంటే కేవలం సోదరసోదరీమణులకు చెందిన పండుగే కాదని హ భగవంతుణ్ణి స్మరించుకుంటూ రక్షించమని వేడుకుంటూ ఎవరికైనా ఈ రక్షా రేఖను కట్టవచ్చునని విద్యార్థులకు తెలియచేసారు. పండుగను పురస్కరించుకుని విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీలను కట్టించి మిఠాయిలు తినిపించి పరస్పర శుభాకాంక్షలు తెలియచేసుకోవడం జరిగినది.కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగను భారతదేశంలో కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకునే ఏకైక పండుగ అని తెలియచేస్తూ విద్యార్థులు అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మరో ముఖ్య అతిథులుగా ఆరోగ్యభారతి కార్యకర్తలు డాక్టర్ కె.శంకర్ రెడ్డి ఎండి, ఏవి .రమణ మూర్తి మరియు స్కూల్ హెచ్‌ఎం కె .రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఐపై పుస్తక ఆవిష్కరణ

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్29, ప్రభాతవార్త:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్నోవేషన్‌పై రూపొందించిన పుస్తకాన్ని ఏఎన్‌యు పాలకమండలి సభ్యులు, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆచార్య టి.స్వరూపరాణి శనివారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంయిడి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ భావిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పుస్తకాన్ని ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ విద్యారంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ పుస్తకం ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే దిశగా విలువైన పుస్తకాన్ని రూపొందించిన రచయితలు రమేష్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్ జోసఫ్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమెన్ కరస్పాండెంట్ సిస్టర్ డా. థెరిస్సా, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డా. ప్రియదర్శిని, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రూబీ కిషోర్, రచయితలు ఏఎన్‌యు ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ ఎం.వసంతరావు, ఏసి లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమృత, ప్రసాద్ జొన్నలగడ్డ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి

**చిలకలూరిపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షేక్ నాగూర్ వలి (55) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 19న జంగాలపల్లిలో ఓ రోగికి వైద్యం అందించి తిరిగి వస్తుండగా, బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు




ఆయనను వెంటనే గుంటూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు. మృతుడి భార్య మస్తాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు.

# ప్రతి రోజు 150 వీధి కుక్కలకు నిర్దేశిత నిబంధనల మేరకు ఏబీసి చేయడానికి పటిష్ట చర్యలు

**నగర కమిషనర్ కె.మయూర్ అశోక్**

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 29 ( ప్రభాత వార్త ) :** గుంటూరు నగరంలో ప్రతి రోజు 150 వీధి కుక్కలకు నిర్దేశిత నిబంధనల మేరకు ఏబీసి చేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శనివారం పొన్నూరు రోడ్ లోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) తనిఖీ చేసి, సెంటర్‌లో కుక్కలకు అందిస్తున్న వైద్య సేవలు, శస్త్రచికిత్సల నిర్వహణ తీరు, ఆపరేషన్ థియేటర్ల పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించి,



సెంటర్ పనితీరుపై పశువైద్య అధికారులు, నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్షించి, పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏసిపి జకిరా, విఎఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తెలుగు వ్యవహారిక భాషోద్యామానికి జీవితాన్ని అంకితం చేసిన గిడుగు రామ్మూర్తి

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 29,ప్రభాతవార్త :** తెలుగు వ్యవహారిక భాషోద్యామానికి సమాజంలో అధిక జనాభాకు విజ్ఞానం,సృజనశక్తి,సంస్కారం అందజేయాలంటూ తన జీవితం మొత్తం ఉద్యమించిన గిడుగు రామ్మూర్తి పంతులు సేవలు చిరస్మరణీయమని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.జీవన సంధ్య వికాస వేదిక అధ్యక్షుడు సిరసవల్లి కృష్ణారావు మాట్లాడుతూ 1910లో తెలుగు వ్యవహారిక భాషోద్యామానికి శ్రీకారం చుట్టిన గిడుగు రామ్మూర్తి,కందుకూరి వీరేశలింగం,గురజాడ వంటి ప్రముఖులతో కలసి విస్తృతంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించారన్నారు.సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ గిడుగు చేపట్టిన భాషోద్యామానికి ఆరోజుల్లో ప్రజలనుండి పత్రికవ యాజమాన్యాల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు.కవి బి.జమదగ్ని మాట్లాడుతూ భాషకోసం,సవరల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేసిన భాషోద్ధారకుడు గిడుగు రామ్మూర్తి అని,వ్యవహారిక భాషా వికాసానికి కృషిచేయడమే ఆ మహనీయునికి మనమందించే ఘనమైన నివాళులన్నారు.కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటరత్నం,కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

30-08pg10:30-08pg10.qxd 29/Aug/26 10:42 PM Page 1





## మాంటెర్రే ఓపెన్‌లో బార్టుంకోవాపై మెర్టెన్స్ విజయం

**మెక్సికో:** బార్టుంకోవాపై విజయం సాధించిన మెర్టెన్స్, మాంటెర్రే ఓపెన్ ఫైనల్‌లో ప్యారీ సరసన చేరింది. ఈ టోర్నీలో బెల్జియంకు చెందిన రెండో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని చెక్ క్రీడాకారిణి నికోలా బార్టుంకోవాను 1-6, 6-4, 6-2 తేడాతో ఓడించి, దయాన్ ప్యారీతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. 23 ఏళ్ల ఫ్రెంచ్ క్రీడాకారిణి ప్యారీ, అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్‌లో అమెరికన్ ఐదవ సీడ్ ఆన్ లీని రెండు గంటల మూడు నిమిషాల పోరులో 7-6(7) 6-4 తేడాతో ఓడించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. రెండవ సెమీఫైనల్‌లో, బార్టుంకోవా అద్భుతమైన ఆరంభం చేసింది. తొలి గేమ్‌లోనే మెర్టెన్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, 4-1 ఆధిక్యంతో దూసుకుపోయింది. ఆ 20 ఏళ్ల క్రీడాకారిణి రెండోసారి కూడా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మెర్టెన్స్‌కు తిరిగి పుంజుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదు. చివరి గేమ్‌లో మూడోసారి సర్వీస్‌ను బ్రేక్ చేసి, సెట్‌ను 6-1తో కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో వెనుకబడిన తర్వాత, మెర్టెన్స్ రెండో సెట్‌లో 3-0తో వెనుకబడినప్పటికీ పుంజుకుంది. వరుసగా మూడు రిటర్న్ గేమ్‌లలో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని గెలుచుకొని, సెట్‌ను 6-4తో కైవసం చేసుకుని స్కోరును సమం చేశాడు. మెర్టెన్స్ ఆ ఊపును నిర్ణయాత్మక సెట్‌లోకి కొనసాగించి చివరకు 6-2 తేడాతో సెట్‌ను కైవసం చేసుకుంది.




## ఆసియా క్రీడలకు నీరజ్ దూరం

**న్యూఢిల్లీ:** భారతదేశానికి రెండుసార్లు ఒలింపిక్ పతకం అందించిన నీరజ్ చోప్రా, చీలమండకు గాయం కావడంతో రాబోయే 2026 ఆసియా క్రీడలకు దూరమవ్వనున్నాడు. గత వారం లౌసాన్ డైమండ్ లీగ్‌లో సీజన్‌లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల త్రో నమోదు చేసి రెండో స్థానంలో నిలిచిన చోప్రా, శిక్షణా సెషన్‌లో గాయపడ్డాడు. తన వైద్యుడు, జట్టుతో సంప్రదించిన తర్వాత, 2026 సీజన్ నుండి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు రెండుసార్లు ఆసియా క్రీడల ఛాంపియన్ వెల్లడించారు. ఈ సీజన్‌ను ముగించాలన్న చోప్రా నిర్ణయం వల్ల, అతను ఈ వారం ప్రారంభంలో అర్హత సాధించిన 2026 డైమండ్ లీగ్ ఫైనల్‌కు, అలాగే అర్హత సాధించే అవకాశం ఉన్న తొలి వరల్డ్ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్‌కు కూడా దూరంకానున్నాడు.

## కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్.. మోహన్ బగాన్ హ్యాట్రిక్ విక్టరీ

### 3-1 తేడాతో రైల్వే ఓటమి

**కోల్‌కత్తా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్‌లో శనివారం నాడు రైల్వే ఎఫ్‌సిపై మోహన్ బగాన్ సూపర్ జెయింట్ విజయం సాధించి, సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించడానికి మరో అడుగు వేసింది. అరగంట తర్వాత రైల్వే తరఫున ఉమేష్ మారండీ తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించగా, ఎనిమిది నిమిషాల్లోనే బగాన్ తిరిగి పుంజుకుని మోహన్ బగాన్ గ్రౌండ్‌లో 3-1 తేడాతో విజయం సాధించింది. వరుసగా బాగాన్ చేస్తున్న దాడులను రైల్వే అదుపు చేయడంలో విఫలమవగా, ఐదు నిమిషాలలోపే రోబిలాల్ మండి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి మెరైనర్స్‌ను ముందుకు నడిపించాడు. ఆ తర్వాత భారత అండర్23 అంతర్జాతీయ ఆటగాడు సుహైల్ అహ్మద్ భట్ గోల్ చేయడంతో, బాగాన్ జట్టు రెండవ అర్ధభాగంలో ఆటను మలుపు తిప్పి, లీగ్‌లో నాలుగో స్థానంలో ఉన్న యునైటెడ్ ఎసిపై తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, ఆ రోజును



చిరస్మరణీయంగా ముగించింది. ఒక మ్యాచ్ ఎక్కువగా ఆడినప్పటికీ, తొమ్మిది మ్యాచ్‌లలో 19 పాయింట్లతో ఉన్న ఈస్ట్ బెంగాల్ కంటే బాగాన్ ఒక పాయింట్ వెనుకబడి ఉంది. ఇక సెప్టెంబర్ 1న బిఎస్ఎస్ స్పోర్టింగ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది. అదే రోజు రైల్వే, కిడ్డర్‌పోర్‌తో తలపడనుంది. ఇటీవల డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో రెడ్‌అండ్‌గోల్డ్ బ్రిగేడ్ చేతిలో ఓడిపోయిన బగాన్, ఈ మ్యాచ్‌లో తమ ప్రధాన జట్టులోని పలువురు ఆటగాళ్లను బరిలోకి దింపింది. విరామం తర్వాత వెంటనే మన్వీర్ సింగ్ గోల్ చేయడంతో స్కోరు 11తో సమమైంది.



## టీమిండియాకు శ్రీలంక ఎఫెక్ట్

### కివిస్‌తో సిరీస్‌కు ఐదుగురు ఔట్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్న టీమిండియా, ఇప్పుడు రాబోయే న్యూజిలాండ్ పర్యటనపై దృష్టి సారించింది. నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో తొలి టెస్ట్, అలాగే నవంబర్ 27న క్రైస్ట్ చర్చ్‌లో రెండో మ్యాచ్ జరగనుంది. న్యూజిలాండ్ పరిస్థితులు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) భారత జట్టులో కీలక మార్పులు జరిగే అవకాశం ఉన్నాయి.

శ్రీలంక సిరీస్‌లో ఆడిన ఐదుగురు ఆటగాళ్లపై సెలెక్టర్లు పునరాలోన చేస్తున్నారు. భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. లంక రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ కేవలం 139 పరుగులు మాత్రమే చేశాడు. అందులో 34.75 సగటు మాత్రమే ఉంది. న్యూజిలాండ్‌లో బంతి స్వింగ్ అయ్యే పరిస్థితులు ఉండటంతో ఫుట్‌వర్క్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పులు జరగాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దీంతో జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.

అప్పుడు కె.ఎల్. రాహుల్‌తో సుదర్శన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. ఇక లంకలో కుల్దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 25 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి ఒకే వికెట్ మాత్రమే తీశాడు. దీంతో అతన్ని పక్కన పెట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా న్యూజిలాండ్‌లో పరిస్థితులు స్పిన్నర్ల కంటే పేసర్లకి ఎక్కువగా అనుకూలించే విధంగా ఉండటంతో ఎక్కువ మంది స్పిన్నర్లతో వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాయి సుదర్శన్ స్థానంలో లంక టూర్‌లో సర్ఫరాజ్ ఖాన్‌ని ఎంపిక చేసింది. అయితే రెండు టెస్టుల్లోనూ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కొలంబో టెస్ట్‌లో రిషభ్ పంత్ గాయపడిన సమయంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా సేవలు అందించాడు. అయితే సుదర్శన్ పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో సర్ఫరాజ్‌కు జట్టులో చోటు కష్టమే. యువ పేసర్ గుర్‌నూర్ బ్రార్ కూడా కీవిస్ టూర్‌లో పోటీ ఎదురుకానుంది. జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉంటే అతన్ని ఎంపిక చేయడం కష్టమే. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ విభాగంలో బలమైన పోటీదారులుగా ఉన్నారు. అంతేకాదు, హర్షిత్ రాణా గాయం నుంచి కోలుకుంటే అతడు కూడా పోటీలోకి వస్తాడు. దీంతో గుర్‌నూర్ బ్రార్‌కు తుది జట్టులో చోటు దక్కేది అనుమానమే. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో 33 ఏళ్ల వయసులో టెస్ట్ అరంగేట్రం చేసిన సారంచ్ జైన్ పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్ సిరీస్‌కు అతడికి చోటు దక్కడం అనుమానమే.

## మహిళల ఆసియా కప్‌లో నేడు థాయిలాండ్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ ఆరంభ మ్యాచ్‌లో థాయిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా క్రికెట్ జట్టు ఈ నెల 30వ తేదీన దుబాయ్‌లో తలపడనుంది. గత దశాబ్ద కాలంగా మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ అత్యంత ఆధిపత్యం చెలాయించిన జట్టుగా ఉంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత, ఆస్ట్రేలియాతో జరిగిన అత్యంత కీలకమైన పోరులో హర్మన్‌ప్రీత్ రాణించింది.

అయితే, ఉన్నత ర్యాంకు జట్లపై భారత్ తడబడిన ఈ టోర్నమెంట్‌లో, బ్యాటింగ్‌లో ఆమె నిలకడ లేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలలో ఒకటిగా నిలిచింది. ఇక నమ్మకమైన బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ దూరమవడంతో, ఆ స్థానంలో ప్రతీకా రావల్‌ను చేర్చుకుంది. అయితే, ఈ ఎంపిక మిడిల్ ఆర్డర్ ఎన్‌ఫోర్సర్ అవసరాన్ని ఏమాత్రం తీర్చదు. ఓపెనర్లుగా భారత్‌కు స్మృతి మంధాన, షఫాలీ వర్మల పటిష్టమైన ఓపెనింగ్ జోడి కొనసాగుతుంది, కానీ 3వ, ఆ తర్వాతి స్థానాల్లోని బ్యాటర్లకు అదే ఊపును కొనసాగించి, స్కోరుబోర్డుకు మరింత వేగాన్ని అందించడం అతిపెద్ద సవాలుగా నిలుస్తోంది. గతసారి ఈ ఫార్మాట్‌లో భారత్ ఆడినప్పుడు కూడా పేలవమైన ఫీల్డింగ్ ఒక ప్రధాన ఆందోళనగా నిలిచింది.



బౌండరీల సమీపంలో వరుసగా అవకాశాలను జారవిడవడం వారి పతనానికి దారితీసింది. దీంతో ఈసారి జట్టు అటువంటి లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది. స్పిన్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించేందుకు అనుభవజ్ఞురాలైన ఆల్‌రౌండర్ దీప్తి శర్మపై ఆధారపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన శ్రీ చరణీ, రాధా యాదవ్, ప్రేమా రావత్‌లు ఈ బాధ్యతను పంచుకోనున్నారు. మరో అనుభవజ్ఞురాలైన రేణుకా సింగ్ ఠాకూర్‌కు తోడు క్రాంతి గౌడ్, అరుంధతిరెడ్డి, నందినీ శర్మ వంటి వారు బాధ్యతలను పంచుకోవడంతో భారత సీమ్ బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా కనిపిస్తోంది. ఈ టీమిండియాలో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), భారతీ ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), గుణాలన్ కమలిని (వికెట్‌కీపర్), ప్రతీకా రావల్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, నందనీ చార్మ ఉన్నారు.

## వాణిజ్యం

## మళ్లీ సంపాదిస్తా..

### ఆత్మవిశ్వాసంతో పైకొస్తా

### జి ఛైర్మన్ సుభాష్‌చంద్ర



**ముంబయి, ఆగస్టు 29:** దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తానని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త కార్యాచరణ షురూచేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.24 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.





## జియోబ్లాక్‌రాక్ నుంచి కొత్త ఫండ్ ఆఫర్!

**ముంబయి, ఆగస్టు 29:** మ్యూచువల్ ఫండ్ సంస్థ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ మరో కొత్త స్కీమ్‌ను తీసుకురాబోతుంది. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ పేరుతో ఈ కొత్త ఎన్ఎఫ్ఓను (న్యూ ఫండ్ ఆఫర్) సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్ఎఫ్ఓ 2026, సెప్టెంబర్ 11న ప్రారంభం కానుండగా, అదేనెల 26 లాస్ట్ డేట్‌గా ఉంది. ఎన్ఎఫ్ఓలో యూనిట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత కనీసం 5 పని దినాల్లోపు ఈ స్కీమ్‌ను నిరంతర కొనుగోలు, విక్రయాల కోసం తిరిగి ప్రారంభించనున్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనేది ఒక ఓపెన్ ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్. ఇది ప్రధానంగా ఈక్విటీ, ఇతర ఈక్విటీకి సంబంధించిన సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడి వ్యూహాన్ని బట్టి ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడులను నిర్వహించడమే ఈ తరహా ఫండ్లలో ప్రధాన ప్రత్యేకత. ఈ స్కీమ్ లక్ష్యం దీర్ఘకాలంలో మంచి మూలధన వృద్ధితో పాటు ఇన్వెస్టర్లకు ఆదాయం అందించడమే. ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ సాధనాల్లో 65 శాతం నుంచి 90 శాతం వరకు పెట్టుబడుల్ని డెట్, మనీమార్కెట్ సాధనాల్లో 10నుంచి 35% వరకు కేటాయించనున్నారు. మార్కెట్ పరిస్థితులు, ఫండ్ వ్యూహాన్ని బట్టి వాస్తవ పెట్టుబడి కేటాయింపుల్లో మార్పులు ఉండొచ్చు. ఈ ఎన్ఎఫ్ఓలో లంప్ సమ్ పెట్టుబడికి కనీస మొత్తం రూ. 500 గా నిర్ణయించారు. గరిష్ఠ పెట్టుబడికి పరిమితి అంటూ ఏం లేదు. సిప్ ద్వారా కూడా కనీసం రూ. 500 తో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. అయితే కనీసం 6 సిప్‌లైనా చేసి ఉండాలి. అదనపు కొనుగోలు లేదా స్విచ్ ఇన్ కోసం కూడా కనీస పెట్టుబడి మొత్తం రూ. 500 గానే ఉంది.

## టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్ వాటా విక్రయం!

**ముంబయి,ఆగస్టు 29:** టాటా గ్రూప్‌లో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా ఉన్న శాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్‌తో టాటా గ్రూప్ చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఖరీదైన రుణాలను తీర్చేందుకు నిధులు సమీకరించుకోవాలని చూస్తున్న ఎస్పీ గ్రూప్‌కు లిక్విడిటీ అందించే మార్గాలపై ఇరు వర్గాలు చర్చిస్తున్నాయి. ఇందులో టాటా గ్రూప్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు బదిలీ చేసే 'షేర్ స్వాప్ ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. టాటా కుటుంబ అధిపతి నోయెల్ టాటా ప్రతినిధులు ఈ అంశంపై పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్‌కు ఉన్న 18.4 శాతం వాటాలో కొంత లేదా మొత్తం వాటాకు బదులుగా టాటా పవర్ వంటి లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు అందించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ స్వయంగా ఎస్పీ గ్రూప్ వాటాను కొనుగోలు చేయడం.

ఇందుకోసం విదేశీ బ్యాంకుల నుంచి నిధులు సమీకరించే అవకాశం ఉంది. మరో ప్రత్యామ్నాయం ఎస్పీ గ్రూప్ వాటాను బయటి పెట్టుబడిదారుడికి విక్రయించడం. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడిదారుడికి విక్రయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు తప్పనిసరిగా ఒప్పందానికి దారితీస్తాయని చెప్పలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చర్చలు ముందుకు సాగుతున్న కొద్దీ ప్రతిపాదిత లావాదేవీ నిర్మాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన సవాలు టాటా సన్స్ విలువను




నిర్ణయించడమేనని నిపుణులు భావిస్తున్నారు. టాటా గ్రూప్‌లోని అనేక కీలక సంస్థలను టాటా సన్స్ నియంత్రిస్తోంది. ఎయిర్ ఇండియా, ఐఫోన్ తయారీ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ వంటి అనేక పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు కూడా టాటా సన్స్ పరిధిలో ఉన్నాయి.ఈ నేపథ్యంలో టాటా సన్స్‌కు సరైన విలువను నిర్ణయించడం, తద్వారా ఎస్పీ గ్రూప్‌కు చెందిన 18.4 శాతం వాటాకు న్యాయమైన విలువ కేటాయించడం అత్యంత క్లిష్టమైన అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.న్యాయ, నియంత్రణ అంశాలపై పరిశీలషేర్ స్వాప్ ప్రతిపాదనలో టాటా పవర్ వంటి లిస్టెడ్ టాటా కంపెనీల షేర్లు ఉండే అవకాశం ఉన్నందున, దీనికి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణపరమైన అంశాలను కూడా ఇరు వర్గాలు పరిశీలిస్తున్నాయి.ఎస్పీ గ్రూప్‌కు తక్షణం నిధులు సమీకరించి రుణభారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉండగా, టాటా గ్రూప్ ప్రయోజనాలు, ఇతర వాటాదారుల ఆందోళనలు, నియంత్రణ సంస్థల నిబంధనలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



## భారత్ మార్కెట్లకు ఫెడ్ ఛైర్మన్ ఎఫెక్ట్!

**న్యూఢిల్లీ,ఆగస్టు, 29:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ జాక్సన్ హోల్ సింపోజియంలో చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ మార్కెట్లలో కలకలం రేపుతున్నాయి. వార్ష్ చేసిన కఠిన వైఖరి వ్యాఖ్యలతో సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న అంచనాలు పెరిగాయి.ఫెడ్ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలో కొనసాగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులఅంచనా. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు , రూపాయి మారకం విలువ, భారత బాండ్ రాబడులపై ప్రభావాన్ని నిశితంగా గమనించాల్సి ఉంటుంది.అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధికంగా కొనసాగితే అక్కడి ఆస్తులు పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా మారతాయి. దీంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ నిధుల ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది.అదే సమయంలో బలపడే అమెరికా డాలర్ భారత రూపాయిపై అదనపు ఒత్తిడిని తీసుకురావచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి. అమెరికా బాండ్ రాబడులు పెరిగితే భారత్‌లోనూ బాండ్ రాబడులు పైకి వెళ్లే అవకాశం ఉంది. ఫెడ్ రేట్ల పెంపు అంచనాలు బంగారం ధరలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.




## ఐటి రిటర్నులకు గడువు ముంచుకొస్తోంది

**ముంబయి, ఆగస్టు 29:** ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి వేర్వేరు రకాల పన్ను చెల్లింపుదారులకు వేర్వేరు డెడ్‌లైన్స్ ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం లేదా 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి కొందరు పన్ను చెల్లింపుదారులకు 2026, ఆగస్ట్ 31 గడువుగా ఉంది. ముఖ్యంగా ఎలాంటి టాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి, బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు ఈ తేదీలోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే తర్వాత బిలేటెడ్ ఐటీ రిటర్న్ దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆలస్య రుసుముతో పాటు ఇతర ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ గడువు ప్రధానంగా కింది వర్గాలకు వర్తిస్తుంది. బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న, టాక్స్ ఆడిట్ అవసరం లేని సంస్థల భాగస్వాములు, చట్టంలో పేర్కొన్న కొన్ని ఇతర వర్గాల పన్ను చెల్లింపుదారులు, ట్రస్టులు వంటి వర్గాలకు గతంలో జులై 31 గడువుగా ఉండగా, కొన్ని మార్పుల నేపథ్యంలో ఆగస్ట్ 31 వరకు అదనపు సమయం లభించినట్లు సమాచారం. 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి సాధారణ ఐటీఆర్ గడువులు ఇలా ఉన్నాయి. వేతన జీవులు, బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం లేని నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లకు జులై 31 లాస్ట్ డేట్. టాక్స్ ఆడిట్ అవసరం లేని బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న వారికి ఆగస్ట్ 31 లాస్ట్ డేట్‌గా ఉంది. కంపెనీలు, టాక్స్ ఆడిట్‌కు లోబడే టాక్స్ పేయర్లకు అక్టోబర్ 31, సెక్షన్ 92ని కింద ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రిపోర్ట్ అవసరమైనవారికి 2026, నవంబర్ 30 డెడ్‌లైన్ ఆగస్ట్ 31 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సిన అర్హత ఉన్న నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లు గడువు మిస్ అయితే, నిబంధనలకు లోబడి బిలేటెడ్ ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి సాధారణంగా 2026, డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుంది. అయితే వర్తించే నిబంధనలు, వ్యక్తిగత పరిస్థితులపై ఇది ఆధారపడి ఉంటుంది. ఇంకా గడువు దాటిన తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద రూ. 5 వేల వరకు లేట్ ఫీ పడుతుంది. ఇక్కడ ఆదాయం రూ. 5 లక్షల్లోపు ఉంటే రూ. 1000 ఫైన్, రూ. 5 లక్షలు దాటితే రూ. 5 వేల వరకు జరిమానా పడుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14